కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

పర్యావరణ క్షీణత మానవాళికి అత్యంత ప్రమాదకరం
బిసి కమిషన్ బహిరంగ విచారణ షురూ
ఏడాదిలో వెయ్యి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తాం
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 346 | శుక్రవారం | 06-06-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# 2 ఉద్యోగులకు డిఏలు

ప్రస్తుతం ఒక డిఏ, ఆరునెలల తరువాత మరొకటి

- ఉద్యోగుల ఆరోగ్య బీమాకు ట్రస్టు ఏర్పాటు
- ప్రతినెల రూ.50 చెల్లిస్తే, ప్రభుత్వం తరపున కొంత చెల్లింపు
- ఆరోగ్య సమస్యలు వస్తే ట్రస్టు ద్వారా నిధులు అందజేత
- ఉద్యోగులకు బిల్లుల పెండింగ్ బకాయిలను నెలకు రూ.700 కోట్ల చొప్పున మంజూరు చేస్తాం
- మహిళా స్వయంసహాయక బృంద సభ్యులు మరణిస్తే రూ.10 లక్షలు సాయం
- కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ వర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు
- హామ్ విధానంలో రోడ్ల ఆధునీకరణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం
- కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు భట్టి, పొంగులేటి, పొన్నం



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఎలు ఇవ్వాలని, అందులో వెంటనే ఒక డిఎను చెల్లించి, మరో డిఎను ఆరు నెలల తర్వాత ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఉద్యోగులు, అధికారుల భాగస్వామ్యంతో ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, ఉద్యోగులు చెల్లించే ప్రతి నెలా రూ.500లకు సమానంగా ప్రభుత్వం కూడా ఆ మొత్తాన్ని చెల్లించి, ఉద్యోగు ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఉద్యోగ సంఘాల డిమాండ్లపై రాష్ట్ర మంత్రివర్గం సానుకూలంగా నిర్ణయం తీసుకున్నది. రిటైర్డ్ అయిన ఉద్యోగుల సేవలను తిరిగి వినియోగించుకోవద్దని నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లులో ప్రతి నెలా రూ.700 కోట్లకు తగ్గకుండా ఉద్యోగుల బకాయిలను చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదించినట్టు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం మంత్రివర్గ సమావేశం జరిగింది. సుమారు ఐదున్నర గంటల పాటు జరిగిన ఈ సమావేశం మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ అందించిన నివేదికపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. ప్రభుత్వ ఉద్యోగుల డిఎ,ఆరోగ్య భద్రత, పెండింగ్ బిల్లుల విషయంలో తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించింది. ఇందిరమ్మ ఇళ్లు పథకం అమలు, వానకాలం పంటల సాగు సన్నద్ధత, రెవెన్యూ సదస్సులు, కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణ, తదితర అంశాలపై మంత్రివర్గంలో చర్చించారు. మంత్రివర్గ సమావేశనంతరం సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీసిఎం మల్లు భట్టి విక్రమార్క మీడియాకు వివరాలను వెల్లడించారు. సచివాలయంలో ఉద్యోగుల సంఖ్య 12.5 శాతం కోటా ఉండాలన్న ఉద్యోగ సంఘాల డిమాండ్‌కు మంత్రివర్గం ఆమోదించింది. మెడికల్ ఇన్‌వాలిడేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీలలో పనిచేసే కార్యదర్శులకు ఆయా పంచాయతీల గ్రేడింగ్ ఆధారంగా గ్రేడ్లు కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయంచింది. ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి డిపిసిని ఏర్పాటు చేయాలని, అలాగే ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి వారి వారి ప్రాంతాలకు పంపించాలని, నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం అంగీకరించింది. అంగన్‌వాడీ రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్‌ను రూ. 2లక్షలకు పెంచాలని నిర్ణయించారు. ఉధికారులు ఉపయోగించే అద్దె వాహనాల తరువాయి 2లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత

# సుధాకర్ మృతి

నంబాల మృతి చెందిన పక్షం రోజుల్లోనే మరో కేంద్ర కమిటీ నాయకుడి కాల్చివేత



ప్రజాపక్షం/భద్రాచలం

మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. మావోయస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు చలం అలియాస్ సుధాకర్ గురువారం మృతి చెందారు. సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిన అతి కొద్ది రోజుల్లోనే మరో కేంద్ర కమిటీ సభ్యున్ని బలగాలు కాల్చి చంపాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధాకర్ (67) యువతను పెద్ద ఎత్తున మావోయిస్టు పార్టీ వైపు ఆకర్షింపజేశాడు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన అనేక దాడుల్లో సుధాకర్ ప్రధాన పాత్రదారిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంద్రావతి జాతీయ ఉద్యానవనం ప్రాంతంలోని అడవిలో కూంబింగ్ నిర్వహిస్తున్న బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు బుధవారం నుండే సంయుక్త బలగాలు ఆపరేషన్ మొదలుపెట్టి మట్టుపెట్టినట్లు తెలిపారు. మావోయిస్టు పార్టీ నాయకుడు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ తరువాయి 2లో



# చినాబ్ వంతెన నేడు జాతికి అంకితం

**జమ్మూ :** పహల్గామ్ ఉగ్రదాడి తరువాత ప్రధానమంత్రి తొలిసారిగా శుక్రవారం జమ్మూ కశ్మీర్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఆయన రైల్వే వంతెనలను ప్రారంభించనున్నారు. వాటిలో ఒకటి ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమైన చీనాబ్ వంతెన. మరొకటి భారత దేశంలో తొలి కేబుల్ వంతెన అంజి బ్రిడ్జ్. అలాగే శ్రీనగర్—కాట్రా మధ్య నడిచే ప్రత్యేకంగా రూపొందించిన రెండు వందేభారత్ రైళ్ళను కూడా ఆయన ప్రారంభిస్తారు. అలాగే 272 కిలోమీటర్ల ఉద్ధంపూర్—శ్రీనగర్—బారాముల్లా రైల్వేలైన్ చివరి దశను ప్రారంభిస్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనేక ముఖ్య ప్రాంతాలలో అదనపు బలగాలతో పాటు, తరువాయి 2లో



'రాఫెల్' ప్రధాన భాగాల తయారీ

# హైదరాబాద్‌లో...

ఫ్రెంచ్ ఏరోస్పేస్ దిగ్గజం 'దస్సాల్ ఏవియేషన్'-'టిఏఎస్ఎల్' మధ్య కీలక ఒప్పందం

భారతరక్షణరంగానికి ధన్యవాదాలు తెలియజేసిన దస్సాల్ ఏవియేషన్ చైర్మన్, సిఇఓ ఎరిక్ ట్రాపియర్

**న్యూఢిల్లీ :** భారతదేశ వైమానిక దళంలో తిరుగులేని యుద్ధ విమాన ఫైటర్లుగా ప్రశంసలు అందుకున్న రాఫెల్ యుద్ధ విమానాల తయారీకి సంబంధించి ఒక కీలక ఒప్పందం కుదిరింది. భారతదేశంలో రఫేల్ యుద్ధ విమానంలో ఒక కీలకభాగమైన విమాన చట్రం (ఫ్యూజ్‌లేజ్) హైదరాబాద్‌లో తయారీకి ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ మాతృసంస్థ, ఏరోస్పేస్ దిగ్గజం దస్సాల్ ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టిఏఎస్ఎల్)మధ్య ఒక కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు గురువారం ఆ రెండు సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఈ నేపథ్యంలో తరువాయి 2లో

# ప్రతి భారతీయుడిపై ఆర్థిక ఒత్తిడి

- పెట్టుబడిదారులకోసమే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోంది
- గత ఏడాదిలో వాహన అమ్మకాలు తగ్గిపోయాయి
- ఇంటి అద్దె, దేశీయ ద్రవ్యోల్బణం, విద్యా ఖర్చులు ఖరీదయ్యాయి
- ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ:** ప్రతి భారతీయుడు ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంటున్నాడని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం అన్నారు. ప్రభుత్వం కొంతమంది పెట్టుబడిదారుల కోసం పని చేస్తోందని విమర్శించారు. 'గణాంకాలు నిజం చెబుతున్నాయి' అని కాంగ్రెస్ నేత తన 'ఎక్స్' ఖాతాలో హిందీలో రాశారు. 'గతేడాది ద్విచక్ర వాహనాల అమ్మకాలు 17 శాతం, కార్ల అమ్మకాలు 8.6 శాతం తగ్గాయి. మొబైల్ మార్కెట్ 7 శాతం తగ్గింది. మరోవైపు ఖర్చులు, అప్పులు నిరంతరం పెరుగుతున్నాయి. ఇంటి అద్దె, దేశీయ ద్రవ్యోల్బణం, విద్యా ఖర్చులు, దాదాపు ప్రతిదీ ఖరీదైనవిగా మారుతున్నాయి. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదు. ప్రతి సాధారణ భారతీయుడు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడికి చెందిన వాస్తవికత ఇది' అని పేర్కొన్నారు. గత నెల సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ తయారీదారులు (ఎస్ఐఏఎం) ద్విచక్ర వాహనాల పంపిణీ ఏప్రిల్‌లో 17 శాతం తగ్గి 14,58,784 యూనిట్లకు చేరుకున్నాయని తెలిపింది. అదే కాలంలో దేశంలోని ఫ్యాక్టరీల నుంచి కంపెనీ డీలర్‌షిప్‌లకు ప్రయాణికుల వాహనాల తరువాయి 2లో



న్యాయవ్యవస్థలో సాంకేతికత

# ఆధిపత్యం సహేతుకం కాదు

భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఉద్ఘోద్ఘ
లండన్ సెమినార్‌లో కీలకోపన్యాసం



**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థలో సాంకేతికతకు ప్రాధాన్యత ఇవ్వకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ హెచ్చరించారు. ఇది న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని, మానవత్వం దృష్టిని మరల్చవద్దని ఆయన కోర్టులకు హితవు పలికారు. మే 4న (బుధవారం) లండన్‌లో బ్రిటీష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ కంపారటివ్ లా వద్ద 'కోర్ట్స్, కామర్స్ అండ్ ది రూల్ ఆఫ్ లా' అంశంపై జరిగిన సెమినార్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాస్కర్ తన కీలకోపన్యాసం చేశారు. ఆయన తన ప్రసంగంలో వాణిజ్యాన్ని సమతుల్యం చేసే న్యాయ వ్యవస్థ పాత్రను, తరువాయి 12లో

# నిధుల సమీకరణపై అధికారులు తీవ్ర దృష్టి



- రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్‌కు సంబంధించిన అంశాలు, వాటి పురోగతిపై ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారులను నియమించాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశం
- రిసోర్స్‌మొబిలైజేషన్ కేబినేట్ సబ్‌కమిటీ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

నిధుల సమీకరణ అంశంపైన అధికారులు తీవ్రంగా దృష్టి సారించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు సూచించారు. రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ కు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించేందుకు ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలని అధికారులను ఆయన ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో 'రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ' సమావేశం కమిటీ చైర్మన్,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రతివారం నిర్వహించే సమావేశంలో భాగంగానే ఈ వారం జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిని వచ్చేవారం సమావేశంలో అంశాల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శాఖల వారీగా పలు అంశాలను భట్టి విక్రమార్క సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ్ బి ముఖ్యకార్యదర్శి వికాస్ రాజు, ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్ ముఖ్యకార్యదర్శి రిజ్వీ,సి సి ఎల్ ఎ సెక్రటరీ నవీన్ మిట్టల్, మైనింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ ,తో పాటు ఐఎఎస్ అధికారులు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్ర మోహన్, బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఇలంబర్తి , ఆర్. వి కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## కొమురం భీం గడ్డపై

# పోడు భూముల రగడ

దశాబ్దాల కష్టంపై అధికారుల దౌర్జన్యం..
తిరగబడ్డ రైతులు

ప్రజాపక్షం/ చింతలమానేపల్లి



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లి, పెంచికల్‌పేట మండలాల్లో పోడు భూముల వివాదం రోజు రోజుకు తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. వర్షాకాలం ప్రారంభమైనా క్రమంలో అటవీ అధికారుల పోడు భూముల ఆక్రమణ ప్రయత్నాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాణాలు పోయినా సరే, మా పొలాలు వదిలేది లేదు అంటూ పోడు రైతులు కూడా గట్టిగానే చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో అటవీ అధికారులు అటవీ భూములను స్వాధీనం చేసుకొని మొక్కలు నాటేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, మూడు తరాలుగా, 30 నుండి 50 సంవత్సరాలుగా పోడు భూములను నమ్ముకొని జీవిస్తున్న రైతులు దీన్ని తీవ్రంగా తరువాయి 12లో

# శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

నిరుపేదల చిరకాల స్వప్నం సాకారమవుతున్న వేళ
హామీమేరకు దశలవారీగా నగదు జమచేస్తున్న ప్రభుత్వం
ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ. కోటి 36 లక్షలు
ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఫస్ట్




ప్రజాపక్ష/ రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక సొంత ఇల్లు ఈ చిరకాల స్వప్నం సాకారం దిశగా ప్రజా ప్రభుత్వం సహకారంతో అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా అందిస్తోంది ప్రభుత్వం. మొదటి దఫాలో ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో రూ. కోటికి పైగా మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నది. ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.సొంత ఇల్లు నిర్మించుకోవాలని ప్రతి ఒక్కరి చిరకాల స్వప్నం. ఈ కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసింది. మొదటి విడతలో ఇంటి స్థలాలు ఉన్న వారికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో అందజేస్తున్నది. 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుంది. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే రూ.లక్ష, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## 2,200 మంది అరెస్టు: ఐసిఇ రికార్డు



**వాషింగ్టన్:** అమెరికాలో వలసవాదుల వేటలో భాగంగా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) అధికారులు ఒకే రోజులో 2,200 మందిని అరెస్టు చేశారు. ఇది ఐసిఇ చరిత్రలోనే ఒక రికార్డు. ట్రంప్ సహాయకులు స్టీఫెన్ మిల్లర్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టి నియోమ్ ఇటీవలే ఐసిఇ అధికారులకు కీలకాదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. రోజుకు 3వేల మంది వలసదారులను అరెస్టు చేయాలని చెప్పారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఐసిఇ అధికారులు ఆల్టర్‌నేటివ్ టు డిటెన్షన్ (ఎటిడి) ప్రోగ్రామ్ కింద నమోదు చేసుకొన్న వారిని టార్గెట్ చేసుకొన్నట్లు తెలుస్తోంది. ఎటిడిలో నమోదైన వలసదారులను ఐసీఈ కార్యాలయానికి రావా లని అధికారులు సందేశాలు పంపిస్తున్నా రు. అలా సందేహాలు అందిన వారు తమ వద్దకు రాగానే అరెస్టు చేస్తున్నారు. బేడీలు వేసి కార్లలో తరలిస్తున్నారు. అలా రాని వాళ్లు డిపోర్టేషన్‌కు గురవుతున్నారు.

## వారు మాకొద్దు..

### 12 దేశాల వారికి రానివ్వద్దని ట్రంప్ నిర్ణయం



**వాషింగ్టన్:** సంచలన నిర్ణయాలు తీసుకుంటూ తరచు వార్తల్లోకి ఎక్కుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించారు. తమ దేశంలోకి రావడానికి వీల్లేదంటూ 12 దేశాల ప్రజలపై నిషేధం విధించారు. కొలరాడోలో యూదు సమూహంపై ఒక వ్యక్తి దాడికి దిగిన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. అయితే, అధికారికంగా మాత్రం ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. అమెరికా నిషేధించిన దేశాలు వరుసగా, అఫ్గానిస్థాన్, ఇరాన్, యెమెన్, మయన్మార్, చాడ్, కాంగో రిపబ్లిక్, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, లిబియా, సోమాలియా, సూడాన్. అదే విధంగా బురిండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్కమెనిస్థాన్, వెనిజులా దేశాలపై పాక్షిక నిషేధం విధించినట్టు వైట్‌హౌస్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం జూన్ 9వ తేదీ, సోమవారం నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. కాగా, ఈ నిర్ణయాన్ని దేశ భద్రత, అమెరికా పౌరుల ప్రయోజనాల పరిరక్షణ కోసం తీసుకున్నట్టు ట్రంప్ తెలిపారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో చాలా మంది ఉంటున్నారని, అలాంటి వారి కారణంగానే హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. 2017లో ఐరోపాలో చోటు చేసుకున్న ఘటనలు అమెరికాలో జరగడానికి వీల్లేదని ట్రంప్ స్పష్టం చేశారు. కొన్ని దేశాలను సురక్షితమైనవిగా చెప్పలేమని, అలాంటి దేశాల నుంచి బహిరంగ వలసలను అనుమతించేది లేదని పేర్కొన్నారు. కాగా, ట్రంప్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం కొత్తేమీకాదు. 2017లో ఇరాన్, ఇరాక్, లిబియా, సోమాలియా, సూడాన్, సిరియా, యెమెన్ దేశాలపై ఆయన ఇలాంటి నిషేధమే విధించారు. గత ఏడాది, మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నప్పుడు, తన ఎన్నికల ప్రణాళికలో నిషేధానికి సంబంధించిన వాగ్దానం చేశారు. తాను ఎన్నికైతే గాజా స్ట్రిప్, లిబియా, సోమాలియా, సిరియా, యెమెన్ వంటి దేశాల నుంచి పౌరుల రాకపై ఆంక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇప్పుడు ఆ నిర్ణయాన్ని అధికారికంగా అమలు పరుస్తూ, ఉత్తర్వులపై సంతకం చేశారు.

## అమెరికాది అదే తీరు..

### గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణ ఒప్పంద తీర్మానాన్ని వీటో చేసిన అగ్రరాజ్యం



**ఐక్యరాజ్య సమితి:** గాజా స్ట్రిప్‌పై అమెరికా వైఖరి మరోసారి బైటపడింది. అక్కడ శాశ్వతంగా కాల్పుల విరమణను అమలుకావాలని, ప్రజలకు మానవతాసాయం అందాలని పేర్కొంటూ భద్రతా మండలి (సెక్యూరిటీ కౌన్సిల్) ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. ఒకవైపు గాజాలో శాంతి కోసం ప్రయత్నిస్తున్నామని, హమాస్, ఇజ్రాయెల్ మధ్య చర్చలను ప్రోత్సహిస్తూ, కీలక పాత్ర పోషిస్తున్నామని ప్రకటించుకుంటున్న అమెరికా, తీరా నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు యూటర్న్ తీసుకుంది. ఇజ్రాయెల్‌కు మేలు చేసే అంశాలు లేవంటూ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. గాజాలోని సుమారు 21 మంది ప్రజలు ఆకలితో.. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో అల్లాడుతున్నారని, వారికి తక్షణ సాయం అవసరమని భద్రతా మండలి అభిప్రాయపడింది. తాత్కాలిక ప్రకటనలు, ఒప్పందాలు కాకుండా, శాశ్వతంగా కాల్పుల విరమణ అమలు కావలని పేర్కొంటూ తీర్మానాన్ని సిద్ధం చేసింది. గాజా ప్రజలకు మానవతా సాయాన్ని అందించడానికి ఇజ్రాయెల్ చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 14 దేశాలు ఓటు వేయగా, అమెరికా వీటో చేసింది. మెజారిటీ సంబంధం లేకుండా, ఒక తీర్మానాన్ని కొట్టివేయడానికి ఉపయోగించే వీటో అస్త్రాన్ని గాజా విషయంలో అమెరికా ప్రయోగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికాకు సన్నిహితంగా ఉండే బ్రిటన్ కూడా వీటోను వ్యతిరేకించడం విశేషం. బ్రిటన్ దౌత్యాధికారి బార్బరా ఉడ్‌వార్డ్ సైతం ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండను ప్రశ్నించారు. గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను విస్తృతపరుస్తున్నదని అన్నారు. కనీసావసరాల సప్లయిని సైతం అడ్డుకంటున్న ఇజ్రాయెల్ విధానాలను ఎవరూ ఆహ్వానించరని స్పష్టం చేశారు. పాకిస్తాన్ రాయబారి ఆసిమ్ ఇఫ్తికార్ అహమ్మద్ మాట్లాడుతూ అమెరికా చర్య ఒక హింసాత్మక విధానానికి స్వాగతం పలుకుతున్న వైనాన్ని స్పష్టం చేస్తున్నదని, రాబోయే తరాలు దీనిని గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు. ఒక వర్గాన్ని లేదా ఒక ప్రాంత ప్రజలను ఏరివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలకు అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్టు ఉందని విమర్శించారు. ఇలావుంటే, వలచ్చేవారం జరిగే ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో గాజా అంశాన్ని లేవనెత్తుతామని పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ తెలిపారు. 193 సభ్య దేశాలున్న జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాకు న్యాయం జరుగుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు. ఏదిఏమైనా గాజా స్ట్రిప్‌లో బతుకుపోరాటం చేస్తున్న లక్షలాది మంది ప్రజలు, ప్రత్యేకించి పాలస్తీనియన్లకు సాయం కూడా అందకుం డా ఇజ్రాయెల్ సైనిక పహారా పెంచడం, దాడులు చేయడంపై పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, హమాస్ గాజా విడిచి పెట్టి వెళ్లాలని, అదే విధంగా ఇప్పటికీ హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ పౌరులను తక్షణమే విడుదల చేయాలని లేనందున, సెక్యూరిటీ కౌన్సిల్ తీర్మానాన్ని వీటో చేసినట్టు అమెరికా వాదిస్తున్నది.

### చైనా ఆగ్రహం..



ఇజ్రాయెల్ ఇప్పటికే అన్ని హద్దులను దాటేసిందని, గాజాలోని ప్రజలకు కనీస అవసరాలు కూడా చేరకుండా అడ్డుకుంటున్నదని యుఎన్‌లో చైనా రాయబారి ఫూ కాంగ్ విమర్శించారు. అంతర్జాతీయ నియమాలను, ఐక్యరాజ్య సమితి నిబంధనలను కూడా ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదని అన్నారు. ఒక దేశం అండగా నిలవడంతో, ఇజ్రాయెల్ సాగిస్తున్న దమనకాండను ఎవరూ కనీసం ప్రశ్నించడం కూడా లేదంటూ పరోక్షంగా అమెరికాపై విమర్శలు గుప్పించారు. మానవతా సాయంపై ఆంక్షలు ఎత్తివేయడం, గాజాలో తక్షణమే కాల్పుల విరమణ కోసం డిమాండ్ చేస్తూ ఐరాస భద్రతా మండలి ముసాయిదా తీర్మానాన్ని అమెరికా వీటో చేయడాన్ని తీవ్రస్థాయిలో ఆక్షేపించారు. గాజా ప్రజల ప్రధాన డిమాండ్లు ప్రతిబింబించే... అంతర్జాతీయ సమాజం గొంతు ప్రతిధ్వనించే ఈ తీర్మానాన్ని వీటో చేయడం ద్వారా గాజా ప్రజల చిరు ఆశలను అమెరికా మళ్లీ చంపేసిందని వ్యాఖ్యానించారు. క్రూరంగా రెండు మిలియన్ల మందికిపైగా ప్రజలను అంధకారంలోకి నెట్టివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సమాజం ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాజాలో ఘర్షణను ముగించడంలో భద్రతా మండలి అసమర్థత మరోమారు బహిర్గతమైందని, ఇజ్రాయిల్‌కు కవచంగా అమెరికా ఉందన్నారు. భద్రతా మండలి శాశ్వత సభ్యదేశంగా అమెరికా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇజ్రాయిల్ చర్యలు అంతర్జాతీయ మానవతా చట్టంలోని అన్ని రెడ్ లైన్‌లను దాటేశాయని, భద్రతా మండలి, జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని తీవ్రంగా ఉల్లంఘించాయని ఫూ కాంగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అగ్రరాజ్యం అండదండలతో దానిని నిలదీసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇటువంటి ద్వంద్వ వైఖరి, లక్షిత చర్యలను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. గాజాలో శాంతి నెలకొల్పేందుకు, మానవతా విపత్తును నియంత్రించేందుకు, 'టూ స్టేట్' అమలు చేసేందుకు, సమగ్రంగా న్యాయం చేకూరేందుకు, పలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అంతర్జాతీయ సమాజంతో కలిసి పని చేసేందుకు చైనా సిద్ధమని ఫూ కాంగ్ ప్రకటించారు.

### అమెరికాకు నెతన్యాహు కృతజ్ఞతలు



తన వీటో అధికారాన్ని అమెరికా వినియోగించడంతో అగ్రరాజ్యానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఎక్స్ మాధ్యమంగా కృతజ్ఞతలు తెలిపారు. 'మా మధ్య పొద్దు పొడిచేందుకు ప్రసక్తే లేదని మా శత్రువులకు మరోమారు స్పష్టం చేసినందుకుగాను అమెరికాకు, డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు' అని ఆయన పేర్కొన్నారు. గాజా జైళ్లలో 58 మంది అమాయకులను బందీగా ఉంచిన హమాస్ ఉగ్రవాదుల వినాశనానికి ఇదొక్కటే మార్గం. తక్షణమే, బేషరతుగా బందీలను విడుదల చేయాలని నాగరిక ప్రపంచం డిమాండ్ చేయాలి' అని నెతన్యాహు ట్వీట్ చేశారు.


## రష్యాకు బేషరతుగా మద్దతిస్తాం: కిమ్



**ప్యాంగ్యాంగ్:** తమ మద్దతు ఎప్పుడూ రష్యాకు ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ప్రకటించారు. రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఉత్తర కొరియా పర్యటనలో భాగంగా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో కిమ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు బేషరతుగా సంపూర్ణ మద్దతును కిమ్ మరోసారి ప్రకటించారు. ఇద్దరు నాయకులు వ్యూహాత్మక భాగస్వామ్యం తదితర కీలకాంశాలపై చర్చించారు. కర్స్క్ ప్రాంతం పునర్నిర్మాణంపైనా మాట్లాడుకున్నారు. రష్యా తన సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతను కాపాడుకునేందుకు చేస్తోన్న పోరాటంలో అండగా ఉంటామని కిమ్ వెల్లడించారు.

## ఇండోనేషియాలో పెరుగుతున్న డ్రగ్స్ కేసులు

### భారతీయులుసహా పలువురు విదేశీయుల అరెస్టు



**జకార్తా:** ఇండోనేషియాలో, ముఖ్యంగా బాలీ ద్వీపంలో, ఇటీవల మాదక ద్రవ్యాల సరఫరా కేసులు పెరుగుతున్నాయి. భారత్‌సహా పలువురు విదేశీయులు మాదకద్రవ్యాల కేసుల్లో అరెస్టు కావడం, మరణ శిక్ష ఎదుర్కోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. మాదక ద్రవ్యాల నిబంధనలను ఇండోనేషియా అత్యంత కఠినంగా అమలు పరుస్తున్నది. నేరస్థులపై కేసులు పెడుతున్నది. నేరం రుజువైతే, కోర్టులు మరణ శిక్ష విధించే అవకాశాలు కూడా ఉన్నాయి. కాగా, అరెస్టయిన వారిలో కొంత మంది భారతీయులు కూడా ఉన్నారు. లాస్ ఏంజెల్స్ నుండి బాలీకి వచ్చిన హరిశ్ వి. అనే భారతీయుడు, న్గురా రాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మాదకద్రవ్యాలతో కూడిన డఫెల్ బ్యాగ్‌తో పట్టుబడ్డాడు. ముత్తుకు మారన్, సెల్వదురై దినకరణ్, గోవింద సామి విమల్కందన్ అనే ముగ్గురు తమిళనాడు వాసులు, 2024 జూలైలో 106 కిలోల క్రిస్టల్ మెత్‌ను సింగపూర్‌ఫ్లాగ్డ్ వాహనం లెజెండ్ అక్వేరియస్ ద్వారా ఇండోనేషియాలోకి అక్రమంగా తరలించడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రాసిక్యూటర్లు వారికి మరణ శిక్ష విధించాలని కోరుతున్నారు, అయితే వారి న్యాయవాదులు వారు నిర్దోషులని, నౌకా కెప్టెన్ బాధ్యత వహించాలనిఅంటున్నారు. 43 ఏళ్ల ఆస్ట్రేలియా పౌరుడు లామారా ఆచీహ 1.7 కిలోల కొకైన్‌ను బాలిలోకి అక్రమంగా తరలించడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అతను 2025 మే 22న అరెస్టయ్యాడు. ఇండోనేషియా మాదకద్రవ్య నిబంధనల ప్రకారం, అతనికి 20 సం వత్సరాల జైలు శిక్ష లేదా మరణ శిక్ష విధించే అవకాశం ఉంది. ముగ్గురు బ్రిటిష్ పౌరులు జోనాథన్ కొల్లియర్, లిసా స్టాకర్, ఫినియస్ ఫ్లోట్ 2025 ఫిబ్రవరిలో బాలీ విమానాశ్రయంలో 1 కిలోల కొకైన్‌ను డెజర్ట్ మిక్స్ ప్యాకెట్లలో దాచి ప ట్టుబడ్డారు. వారి కేసు డెన్పాసార్ జిల్లా కోర్టులో విచారణలో ఉంది. మొత్తం మీద ఇండోనేషియాలో ప్రస్తుతం సుమారు 530 మంది, అందులో 96 మంది విదేశీయులు, మాదకద్రవ్యాల కేసుల్లో మరణ శిక్ష ఎదుర్కొంటున్నారు. ఇండోనేషియా యొక్క కఠినమైన మాదకద్రవ్య నిబంధనలు మరియు శిక్షలు, విదేశీయులకు కూడా సమానంగా వర్తిస్తాయి.

## హైదరాబాద్‌లోనే

(మొదటి పేజీ తరువాయి)

రఫేల్ యుద్ధ విమానాలకు సంబంధించిన ప్రధాన భాగాలు హైదరాబాద్‌లోని టిఏఎస్ఎల్‌లో తయారు చేయడానికి అంగీకరిస్తూ ఒప్పందం చేసుకున్నాయి. రఫేల్ ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాలు ఫ్రాన్స్ దేశం వెలుపల తయారు కావడం ఇదే తొలిసారి కానున్నది. విమానయాన రంగంలో భారతదేశం గణనీయమైన అభివృద్ధిని సాధిస్తుందనడానికి తాజాగా కుదిరిన ఈ కీలక ఒప్పందమే ఒక చక్కటి ఉదాహరణగా పేర్కొనవచ్చని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ భాగస్వామ్యం కింద టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ పోరాట జెట్ కీలక భాగాన్ని ఉత్పత్తి చేయడానికి హైదరాబాద్‌లో ఒక 'కట్టింగ్ఎడ్జ్ ప్రొడక్షన్ ఫెసిలిటీ'ని నెలకొల్పనున్నది. మొదటి విమాన చట్రాలు 2028 ఆర్థిక సంవత్సరం నాటికి ఫ్యూజ్‌లేజ్ అసెంబ్లింగ్ లైన్, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలను తయారుచేయడానికి టిఏఎస్ లిమిటెడ్ సన్నద్ధం అవుతోంది. ఈ క్రమంలో టిఏఎస్ లిమిటెడ్ నెలకు రెండు విమానచట్రాలను అందించనున్నది. 'భారత్‌లో మా ఉత్పత్తులను బలోపేతం చేయటంలో ఇది ఒక నిర్ణయాత్మక అడుగుగానే భావిస్తున్నాం. భారత రక్షణ రంగంలో మా సేవలను విస్తరిస్తున్నందుకు మేం భారత్‌కు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం. ఈ నిర్ణయం రఫేల్ విస్తరణకు మరింత ఉపకరిస్తుంది. నాణ్యమైన సేవలు అందించేందుకు, సైనిక అవసరాలను తీర్చేందుకు ఎంతగానో దోహదపడుతుంది' అని డస్సాల్ట్ ఏవియేషన్ చైర్మన్, సిఇఒ ఎరిక్ ట్రాపియర్ అన్నారు. ఈ ఒప్పంద ం భారత రక్షణ రంగ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ సిఎండి సుకరన్ సింగ్ సంతోషం వ్యక్తంచేశారు.భారత వైమానిక వ్యవస్థ అభివృద్ధిని, పురోగతిని ఈ కీలక ఒప్పందం ప్రతిబింబిస్తుందన్నారు.

## ఆర్థిక ఒత్తిడి

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీ సంవత్సరానికి 4 శాతం పెరిగి 3,48, 847 యూనిట్లకు చేరుకున్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో స్కూటర్ అమ్మకాలు 5,48, 370 యూనిట్లుగా ఉన్నాయి. ఇది 2024 ఏప్రిల్‌లో 5,81,277 యూనిట్ల నుంచి 6 శాతం తగ్గింది. మోటార్ సైకిల్ పంపిణీలు 23 శాతం తగ్గాయి. ఏప్రిల్‌లో గత సంవత్సరంతో పోలిస్తే 8,71,666 యూనిట్లు. గత నెలలో మోపెడ్ హోల్‌సేల్స్ 38,748 యూనిట్లకు చేరుకున్నాయి. ఇది 8 శాతం తగ్గి 41,924 యూనిట్లు. అదే విధంగా 2025 మొదటి త్రైమాసికానికి సంబంధించిన సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) ఇండియా మొబైల్ హ్యాండ్‌సెట్ మార్కెట్ సమీక్ష నివేదిక ప్రకారం భారతదేశంలో స్మార్ట్‌ఫోన్ రవాణా 7 శాతం తగ్గింది. 'సంఘటనల మెరుపు గురించి కాదు... రోజువారీ జీవిత వాస్తవికత గురించి ప్రశ్నలు అడిగే పరిస్థితిని అర్థం చేసుకునే, బాధ్యతాయుతంగా స్పందించే రాజకీయాలు మనకు అవసరం' అని రాహుల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఎంపిక చేసిన కొంతమంది పెట్టుబడిదారుల కోసం కాకుండా ప్రతి భారతీయుడి కోసం పని చేసే ఆర్థిక వ్యవస్థ మనకు అవసరం' అని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ జపాన్‌ను అధిగమించిందని ప్రభుత్వం పేర్కొన్న సమయంలో ఆయన వ్యాఖ్యలు వచ్చాయి.

**రాజకీయాలకు చిహ్నంగా నితీశ్ ప్రభుత్వం**

బిహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అత్యాచార బాధితురాలి తల్లికి చికిత్స చేసినందుకు వైద్యుడిని దారుణంగా కొట్టిన ఘటనకు సంబంధించి ప్రభుత్వాన్ని విమర్శించారు. నేరం, నిరుద్యోగం, వలసలు రాష్ట్ర పాలకవర్గానికి నిజమైన గుర్తింపుగా మారాయని ఎద్దేవా చేశారు. బీహార్‌లోని జెడి(యు)–బిజెపి ప్రభుత్వం అధికార రాజకీయాలకు చిహ్నంగా మారిందనిష ఈ అన్యాయ చక్రాన్ని విచ్ఛిన్నం చేసి రాష్ట్రాన్ని భద్రత, ఆత్మగౌరవం, ఉన్నత మార్గంలో ముందుకు తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. గయలో అత్యాచార బాధితురాలి ఇంటికి వెళ్లిన డాక్టర్ జితేంద్ర యాదవ్‌ను అత్యాచార నిందితుడు చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టినట్లు చూపించే వీడియోను బీహార్ కాంగ్రెస్ ఎక్స్‌లో పోస్ట్ చేసిన తర్వాత రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. 20 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ, నితీష్ జీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బీహార్‌కు భద్రత, గౌరవం లేదా అభివృద్ధిని అందించలేకపోయిందని రాహుల్ మండిపడ్డారు. 'నేరం, నిరుద్యోగం, వలసలు ఇది నితీష్–బిజెపి ప్రభుత్వానికి నిజమైన గుర్తింపుగా మారిందని, ప్రజలను నిస్సహాయులను చేస్తూ అధికారాన్ని చేపట్టడమే వారి ఎజెండా అని ఆయన ఆరోపించారు. నితీష్ ప్రభుత్వం న్యాయం కోసం కాకుండా అధికార రాజకీయాలకు చిహ్నంగా మారిందని ఎద్దేవా చేశారు. ఇక చాలు.. ఈ అన్యాయ చక్రాన్ని విచ్ఛిన్నం చేసి బిహార్‌ను భద్రత, ఆత్మగౌరవం, ఉన్నతమార్గంలో ముందుకు తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## సుధాకర్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుడు బండి ప్రకాష్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు అప్పారావుతో పాటు మరికొందరు ఉన్నారనే సమాచారం మేరకు ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసులు చెబుతున్నారు. చోటు చేసుకున్న ఎదురు కాల్పుల తర్వాత సంఘటనా స్థలాన్ని పరిశీలించిన బలగాలకు సీనియర్ మావోయిస్టు మృతదేహంతో పాటు ఏకే 47 తుపాకీ లభ్యం కావడంతో స్వాధీనం చేసుకున్నారు. కాగా మృతి చెందిన వ్యక్తి కేంద్రకమిటీలోని సభ్యుడు సుధాకర్‌గా పోలీసులు తర్వాత గుర్తించారు. ఈయనకు ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, అరవింద్, సోమన్న అనే మారు పేర్లు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన వాడిగా పోలీసులు ధృవీకరించారు. విప్లవ రాజకీయ పాఠశాల, సెంట్రల్ రీజనల్ బ్యూరో లకు కూడా ఈయన ఇంచార్జ్‌గా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అనేక హింసాత్మక సంఘటనల్లో ప్రధాన బాధ్యునిగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. యువతమెదళ్లలో తీవ్రవాదాన్ని నూరిపోసి తప్పుదారి పట్టించడంలో ఈయనకు సిద్ధహస్తునిగా పేరుంని బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజన్ వెల్లడించారు. ఈయన ఎన్‌కౌంటర్ భద్రతాబలగాలు ఖాతాలో పెద్దవిజయమని, ఇప్పటికే మావోయిస్టు పార్టీ పెద్ద ఎత్తున దండకారణ్యంతో పాటు ఏపి, తెలంగాణ, ఒడిస్సాలతో పాటు పలు ప్రాంతాల్లో ఉనికి కోల్పోతుందని ఆయనచెప్పారు. సుధాకర్ ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టు పార్టీకి తీరని దెబ్బతగిలిందని అభిప్రాయ పడ్డారు. ఎదురుకాల్పులు జరిగిన సంఘటనా స్థలం నుండి పెద్ద ఎత్తున మావోయిస్టులు తప్పించుకున్నారనే సమాచారం మేరకు కూంబింగ్ ముమ్మరం చేసినట్లు ఐజి తెలిపారు. మావోల కోసం మరింత ఆపరేషన్ ముమ్మరం చేశామని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని అయన చెప్పారు. గత నెల మే 21న మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలయాస్ బసవరాజుతో సహా 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పటి ఎన్‌కౌంటర్‌తో .ఈ ఏడాది ఇప్పటి వరకు వేర్వేరు ఘటనల్లో 203 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో 186 మంది బస్తర్ డివిజన్‌లోని హతమయ్యారు. ఇందులో బీజాపూర్, బస్తర్, కాంకేర్, కొండగావ్, నారాయణ్పూర్, సుక్మా, దంతెవాడ జిలాల్లకు చెందిన వారు ఉన్నారు. గత ఏడాది జనవరి నుండి ప్రభుత్వ లెక్కల ప్రకారం బస్తర్ డివిడన్‌లో ఇప్పటి వరకు 403 మంది కంటే ఎక్కువమంది వివిధ క్యాడర్లకు చెందిన మావోయిస్టులు వేర్వేరు ఎన్కౌంటర్లలో మృతి చెందినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## చినాబ్ వంతెన నేడు జాతికి అంకితం

(మొదటి పేజీ తరువాయి)

నిఘా కోసం డ్రోన్‌లు, అధునిక పరికరాలను వినియోగిస్తున్నారు. అలాగే సరిహద్దులో కూడా భద్రతను మరింత పటిష్టం చేశారు. ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చి బ్రిడ్జి అయిన చినాబ్ ఉక్కు వంతెన నదికి 359 మీటర్ల ఎత్తులో ఉంటుంది. 1.31 కి.మీ. మేర విస్తరించిన ఈ వంతెన నిర్మాణానికి కేంద్రం రూ.1,486 కోట్లు ఖర్చు చేసింది. దీంతో భారత రైల్వే నెట్ వర్కుతో జమ్మూ కశ్మీర్ పూర్తిగా అనుసంధానం కానుంది.

## శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

**11 మండలాల్లో మోడల్ హౌస్‌లు**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇండ్ల నిర్మాణం, గదులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ముందుగా జిల్లాలోని ఆయా చోట్ల మోడల్ హౌస్ లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 11 మండలాల్లో మోడల్ నిర్మాణాలను మొదలు పెట్టారు గృహ నిర్మాణ శాఖా అధికారులు. ఆయా ఇండ్లు తుదిదశకు చేరుకున్నాయి.

**రూ. కోటి 36 లక్షలకు పైగా సాయం మంజూరు**

జిల్లాకు మొదటి విడుత కింద 1061 ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి అయింది. వీటిలో బేస్మెట్ లెవెల్ లో 105, రూఫ్ లెవెల్ లో 31లో ఉన్నాయి. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించు కుంటున్న లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ఎవరి ప్రమేయం లేకుండా జమ చేసింది.

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో జిల్లా ఫస్ట్..**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాకు మంజూరు అయిన 7862 ఇండ్లకు గాను 7828 అలాట్మెంట్ ఆర్డర్లు లబ్దిదారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో ఫేజ్1,2 లో కలిపి 2575 ఇండ్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో ఫేజ్1,2 లో కలిపి 3608 ఇండ్లు, చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలంలో ఫేజ్ 1,2 లో కలిపి 820 ఇండ్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యంతో కలిసి, మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో ఫేజ్ 1,2లో 805 ఇండ్ల మంజూరు పత్రాలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఇటీవల కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని కరీంనగర్ లో నిర్వహించగా, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరై ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను అభినందించారు.

### రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంతో ..

చాలా ఏండ్లుగా సొంత ఇల్లు కట్టుకోవాలి అనేది చూస్తున్న. మాకు రేకుల ఇల్లు ఉండేది. ఇల్లు కట్టుకునే పరిస్థితి లేక ఆగినం. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంతో నేను ఇల్లు కట్టు కుంటున్న. బేస్మెంట్ కట్టిన రూ. లక్ష రూపా యలు నా బ్యాంక్ ఖాతాలో పడ్డయి. సీఎం రేవంత్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు.

**కత్తెర లక్ష్మి , 8వ వార్డ్ పెద్దూర్, సిరిసిల్ల మున్సిపాలిటీ**

### రెండు లక్షలు పడ్డయి..

నా గూనల ఇల్లు కూలింది. మస్తు ఇబ్బంది పడ్డం. శీనన్నను కలిసి ఇల్లు అడిగినం. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించిండు. ముగ్గు పోసి.. కట్టుకుంటున్న. బేస్ మీట్ అయి, గోడలు లేసినయి. నా బ్యాంక్ అకౌంట్ల రెండు లక్షల రూపాయలు పడ్డయి. నా ఇల్లు కట్టుకునేందుకు సాయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు.

**ద్యావ సూర్యమ్మ, వెంకటాంపల్లి, వేములవాడ మండలం**

### పైరవీ అవసరం లేదు..

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరి పైరవీ అవసరం లేదు. నాలుగు దశల్లో లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమవుతుంది. వీటి కోసం ఎవరినీ సంప్రదించవద్దు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు పూర్తి సహకారం అందిస్తాము. ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేసుకుని రానున్న దసరా దీపావళి పండుగలను నూతన గృహాలలో జరుపుకోవాలని లబ్ధిదారులను కోరుతున్నాను.

**– సందీప్ కుమార్ ఝా, కలెక్టర్ రాజన్న సిరిసిల్ల**

### ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలి. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు ఇటీవల పర్యటనలో జిల్లాకు అదనంగా 1750 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారు. దీంతో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే అవకాశంవచ్చింది.

**–ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

## 2 డిఎలు

(మొదటి పేజీ తరువాయి)

పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు వాటి అద్దెలను మరింత పెంచేందుకు మంత్రివర్గం అంగీకరించింది. జిఒ 317ను పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించినట్టు భట్టి విక్రమార్క వెల్లడించారు.

**కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ఆ యూనివర్సిటీకి మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పేరును పెట్టాలని మంత్రివర్గం నిర్ణయంచినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశలో రూ. 19,579 కోట్ల వ్యయంతో 86.1 కిలోమీటర్ల మెట్రో కారిడార్‌ను విస్తరించనున్న ట్టు తెలిపారు. దీనిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించిందని, ఇందుకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేం ద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్, ఎంపి ఈటల రాజేందర్ సహకారం అందించాలని కోరారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రమాదవశా త్తు చనిపోతే ఇక నుంచి రూ.10 లక్షలు ఇవ్వనుందని, దీనికి సంబంధించిన ఇన్సూరెన్స్ ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు.గత ఏడాదిలో మృతిచెందిన 385 కుటంబాలకు రూ. 38.5 కోట్లను చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదించింది.

మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు ఇవే ...

- ♦ ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ 12 ఎక రాలు కేటాయింపు.
- ♦మహిళా స్వయం సహాయక బృందాల సభ్యుల ప్రమాద బీమా, లోన్ బీమా చెల్లింపుల కోసం రూ.70 కోట్లు చెల్లిస్తూ నిర్ణయం.
- ♦ హమ్ విధానం లో గ్రామీణ రోడ్ల ఆధునీకరణ చేపట్టాలని నిర్ణయం.
- ♦ ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్‌లను పరిశీలించిన మంత్రివర్గం.
- ♦ అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించగా, కొన్నింటిని పరిశీలనకు స్వీకరించింది.



- ♦ ప్రతి సంవత్సరం సెప్టెంబర్‌లో డిపిసి ఏర్పాటు చేయనుంది.
- ♦ జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను రికగ్నిషన్ చేసేందుకు నిర్ణయం.
- ♦ జి.ఒ 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం ..
- ♦ రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులను ప్రోత్సహం.
- ♦ సన్నాలకు బోనస్‌తో రైతులకు లబ్ధి చేకూరిందని, సన్న వడ్లకు బోనస్ కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయం.
- ♦ స్వయం సహాయక సంఘాలకు ప్రమాద బీమా పథకం అమలుకు రూ. 38.5 కోట్లు స్త్రీనిధికి కేటాయింపు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లించకుండా నేరుగా స్త్రీనిధి ద్వారా 385 మంది బాధిత కుటుంబాలకు ప్రమాదబీమా పరిహారం అందించాలని నిర్ణయం.
- ♦ పంచాయతీరాజ్ పరిధిలో 7947 కిలోమీటర్లు, ఆర్ అండ్ బి పరిధిలో 5190 కిలోమీటర్లు, మొత్తం 13137 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేస్తుంది.
- ♦ పంచాయతీ రాజ్ రోడ్లకు రూ. 16 వేల 780 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్లకు రూ. 16 వేల 414 కోట్లు ప్రభుత్వం రాబోయే రోజుల్లో ఖర్చు పెడుతుంది.
- ♦ పార్లమెంట్ ఒక యూనిట్ గా లేదా ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా ఒక్కో ప్యాకేజ్ గా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం.
- ♦ హైదరాబాద్ సిటీలో మెట్రో రెండవ దశలో భాగంగా కారిడార్1లో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ. కారిడార్ 2 జూబ్లీ బస్ స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ కారిడార్3 జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్ పేట్ వరకు 22 కి.మీ విస్తరించాలని నిర్ణయం .



# జనరల్
STATE & REGIONAL NEWS

## మ్యుటేషన్‌కు డబ్బులు డిమాండ్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా ఏసిబికి చిక్కిన బిల్‌కలెక్టర్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట వార్డు కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రవణ్‌కుమార్‌లు రూ.20వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఏసిబి డిఎస్‌పి ఆనంద్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ తూంకుంటకు చెందిన సదరు ఇంటి యజమాని శామీర్‌పేటలో రెండు ఇండ్లను కొనుగోలు చేశారు. ఆ ఇండ్లకు సంబంధించిన మ్యుటేషన్ చేయించుకొనేందుకు సంవత్సరం నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో శామీర్‌పేట వార్డు కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రవణ్‌కుమార్‌లు బాధితుడి ఇంటికి వెళ్లి మీ ఇంటి మ్యుటేషన్ పెండింగ్‌లో ఉన్నాయని రూ.20వేలు లంచం ఇస్తే మ్యుటేషన్ చేస్తామని ఇంటి యజమానికి చెప్పారు. విసుగుచెందిన యజమాని ఏసిబి అధికారులకు ఫిర్యాదు చేయడంతో రూ.20వేలు లంచం తీసుకుంటుండగా శ్రవణ్‌కుమార్‌ను ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# పర్యావరణ క్షీణత మానవాళికి అత్యంత ప్రమాదకరం

సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ క్షీణత మానవాళికి అత్యంత ప్రమాదకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. పెరిగిన గ్లోబల్ వార్మింగ్‌లో ప్రపంచంలోనే భారత దేశం రెండవ స్థానంలో, అందులో దక్షిణ భారత దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, ఇది ప్రజల జీవితాలు జీవనోపాధికి హాని కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్), ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి, సుందరయ్య పార్క్ వద్ద గురువారం ప్రదర్శన నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సయ్యద్ అజీజ్ పాషా, ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రేఖల గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి ప్రభాకర్, నాయకులు ఎ.విజయలక్ష్మి, ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్‌పటేల్, సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, ప్రబలమైన పారిశ్రామికీకరణ, ప్రభుత్వాల తిరోగమన విధానాలు పర్యావరణానికి భారీ ముప్పును కలిగిస్తున్నాయన్నారు. దేశంలో 2019 నుండి 2022 వరకు 5.8 మిలియన్ చెట్లు నరికివేయగా, ఉపగ్రహ సర్వేలో 11 శాతం పూర్తిగా పెరిగిన చెట్లు నరికివేశారని తేలిందని తెలిపారు. దక్షిణ భారత దేశంలోని తెలంగాణలో అత్యధికంగా 2014 నుండి 2024 వరకు 11,422 హెక్టార్ల అటవీ భూమిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ సంక్షోభం, క్షీణిస్తున్న గాలి నాణ్యత, అటవీ నిర్మూలన, ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం ప్రజల జీవితాలను ప్రమాదంలో పడవేస్తున్నాయని, ఇది గ్లోబల్ వార్మింగ్‌కు నిదర్శనమన్నారు. ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, ఇది నీటి వనరులను, వ్యవసాయం, ప్రజల ఆరోగ్యాలపై ప్రభావితం చూపిందని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌ను ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం 1997 క్యోటో ప్రోటోకాల్, 2015 పారిస్, సిఒపి19, బాకు వంటి అంతర్జాతీయ ఒప్పందాలను ఖచ్చితంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ ప్రకృతి దృశ్యానికి ప్రాణం పోసే పర్యావరణపరంగా సున్నితమైన కంచగచ్చిబౌలి అడవిని తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం వేలం వేయడానికి అక్కడ ఉన్నసహజ గడ్డి, చెట్లను నరకడం, వన్యప్రాణులకు హాని కలిగించడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో కంచాగచ్చిబౌలి అడవి భూములు రక్షించబడ్డాయని చెప్పారు. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల నుండి ప్రపంచాన్ని రక్షించడంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఇంటి నిర్మాణానికి అనుమతి పొందే ముందు రెండు చెట్లను నాటాలనే ముందస్తు షరతును బెంగళూరు మునిసిపల్ కార్పొరేషన్ అమలు చేస్తుందని, దీనిని జిహెచ్ఎంసి, ఇతర మునిసిపాలిటీలను అమలు చేయాలని సయ్యద్ అజీజ్‌పాషా విజ్ఞప్తి చేశారు. రేఖల గోపాల్ మాట్లాడుతూ ఊహించలేని వేడి తరంగాలు, వరదలు, తుఫానులు తీవ్రతరం అవుతుండడం, గ్లోబల్ వార్మింగ్ మొత్తం ప్రపంచానికి అతిపెద్ద ప్రమాద సంకేతమన్నారు. మన జీవితాలకు అనూహ్యమైన నష్టాన్ని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను ఒక్కసారి వాడకానికి నో చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కడారి ప్రభాకర్ మాట్లాడుతూ అంటార్కిటికా పచ్చని భూముల వద్ద హిమానీనదాలు చాలా వేగంగా కరిగిపోతున్నందున, ప్రస్తుత పర్యావరణాన్ని మెరుగుపరచడానికి బహుముఖ విధానం అవసరమని అన్నారు. మునీర్ పటేల్ మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజా అవగాహన ప్రచారం, సమాజ భాగస్వామ్యాన్ని అవసరమని తెలిపారు.

### ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా..

# స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించరా?

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలేదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి దుయ్యబట్టారు.
రాజీవ్‌గాంధీ హయాంలో సుపరిపాలన కోసం 73, 74వ రాజ్యాంగ సవరణలో ఉన్నవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను జాప్యం చేయడం సరికాదని, వెంటనే నిర్వహించాలని, గ్రామపంచాయతీ పెండింగ్ నిధులు విడుదల చేయాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా అర్హులందరికీ మంజూరు చేయాలని కోరారు. గురువారం కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ మట్లాడారు.
కేంద్రంలోని బిజెపి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ విరుద్ధ పాలన కొనసాగిస్తోందని మండిపడ్డారు. మోదీ నియంతృత్వ పోకడతో ఉత్తరాది రాష్ట్రాలకు పెద్దపీట వేస్తూ దక్షిణాదిపై చిన్నచూపు చూస్తున్నారన్నారు. ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెంచుకునేందుకే కులగణన అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు సీట్లు తగ్గించి అన్యాయం చేస్తారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా మనువాద సిద్ధాంతం పాటించే ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వంపై భవిష్యత్తు ఉద్యమ కార్యచరణకు సిద్ధమయ్యామన్నారు.
పాకిస్తాన్ ఉగ్రవాదులపై కగార్ ఆపరేషన్ పేరిట యుద్ధం చేసి చర్చలు జరిపారు, కానీ మావోయిస్టులతో చర్చలు జరిపి పరిష్కరించడంలేదన్నారు. మావోయిస్టులను అంతం చేయాలని మోడీ, అమిత్ షా కంకణం కట్టుకున్నారన్నారు. ప్రశ్నించే గొంతు ఉండకూడదని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. నియంతృత్వ పాలనతో బానిసలుగా ఉండే పరిస్థితి నెలకొందన్నారు. మావోయిస్టు పార్టీని అంతం చేయడం సాధ్యం కాదన్నారు. మావోయిస్టులది సామాజిక ఆర్థిక సమస్య అని, శాంతియుతంగా మోదీ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అభివృద్ధిలో మాత్రం దక్షిణాదిపై నిర్లక్ష్యం చూపెడతారన్నారు. పక్షపాతం చూపెడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో అణచివేస్తామంటే కుదరదన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపల్లి రాజు, బండ రాజిరెడ్డిలు పాల్గొన్నారు.

### ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేసి

# రైతులను వెంటనే విడుదల చేయాలి

సిపిఐ(ఎం) డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గద్వాల జిల్లా రాజోలిమండలం పెద్దదన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 60 మందిని అక్రమంగా అరెస్ట్ చేసి, 12 మందిని రిమాండ్‌కు పంపడాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఈ కంపెనీ నిర్మాణానికి తీసుకున్న భూమికి సమీపంలో ప్రభుత్వం దళితులకిచ్చిన భూములు, ఇంటి స్థలాలు ఉండడం వల్ల వివిధ రకాల కాలుష్యం ఏర్పడుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నారన్నారు. గ్రామసభల తీర్మానం, గ్రామపంచాయతీ అనుమతి లేకపోయినా కంపెనీ యాజమాన్యం జెసిబిలు, టిప్పర్లు, కంటైనర్లతో పాటు, బయటి నుండి కూలీలను తెచ్చి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, దీన్ని వ్యతిరేకించిన రైతులు, మహిళలు, ప్రజలపై పోలీసులు లాఠీఛార్జి చేయడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. తక్షణమే రిమాండ్ చేసినవారిని విడుదల చేసి, అక్రమంగా బనాయించిన కేసులన్నింటినీ ఎత్తివేయడంతోపాటు ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు. అదేవిధంగా ఏళ్లతరబడి అధికారుల చుట్టూ తిరిగినా తమ భూసమస్యలు పరిష్కారం కాకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్న నేపథ్యంలో రెవెన్యూ సదస్సులను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి కార్మిక సంఘాల వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విశాఖ స్టీల్ ప్లాంటులో గత 35 ఏళ్లుగా పనిచేస్తున్న 5541 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే పనిలోకి తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి చైర్మన్ డి.ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. విధుల్లో నుంచి తొలగించిన 5514 మంది కాంట్రాక్టు కార్మికులు గత 35 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారిని విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ప్రతినిధుల బృందం గురువారం హైదరాబాద్‌లో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీని కలిసి వినతిపత్రం అందజేశారు. 5541మంది కాంట్రాక్టు కార్మికులు పర్మినెంటు ఉద్యోగులతో సమానంగా అన్ని పనులను చేస్తూ విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ, కార్మికశాఖ టెక్స్‌టైల్, స్టీల్ డెవలప్‌మెంట్ చైర్మన్, సభ్యుల బృందానికి ఆదినారాయణ, ఎస్.బాల్‌రాజులు వివరించారు. కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధులలోకి తీసుకోవడంతోపాటు విశాఖ స్టీల్‌ప్లాంటులో జరుగుతున్న అక్రమ తొలగింపులను వెంటనే ఉపసంహరించుకొని వారినందరినీ పర్మినెంటు చేయాలని వారు కోరారు. దీంతో హైలెవెల్ కమిటీలో చర్చించి న్యాయం చేస్తామని పార్లమెంట్ సభ్యుల స్టాండింగ్ కమిటీ చైర్మన్ సభ్యులు హామీ ఇచ్చారు.
పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులను కలిసిన వారిలో ఎస్.బాల్‌రాజ్, డి.ఆదినారాయణ (ఎఐటియుసి), వెంకటేష్ (సిఐటియు), విజయ్‌కుమార్ యాదవ్ (ఐఎన్‌టియుసి), రెబ్బా రామారావు(హెచ్ఎంఎస్) తదితర నాయకులు ఉన్నారు.

# బనకచర్ల తెలంగాణ కాదు

కృష్ణా, గుంటూరు జిల్లాలూ వ్యతిరేకిస్తున్నాయి

డాక్టర్ కె.నారాయణ




**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనవసరంగా బనకచర్ల అనే కొత్త ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చి, అటు తెలంగాణలో, ఇటు ఆంధ్రలోని కృష్ణా, గుంటూరు జిల్లాలతో వివాదాలు తీసుకువస్తున్నాడని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఎపిలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వదిలేసి, బనకచర్లను ఎందుకు చేపడతున్నారని ప్రశ్నించారు. వాటిని వదిలేసి బనకచర్లను చేపడితే సమస్య జఠలమవుతుందని, ఈలోగా చంద్రబాబు ప్రభుత్వానికి మిగిలి ఉన్న నాలుగేళ్ళు గడిచిపోతాయని ఎద్దేవా చేశారు. తిరుపతిలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు పేరుతో లేని కొత్త సమస్యను తీసుకువచ్చాడని, దీనికి వ్యతిరేకంగా ఇప్పటికే తెలంగాణ ప్రజలు ఆందోళన చేస్తున్నారని, కృష్ణా, గుంటూరు జిల్లాలు కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఆ ప్రాజెక్టు చేపడితే గోదావరి నీళ్ళను మొత్తంగా తీసుకెళ్తే, కర్నాటక పేచీ పెట్టే అవకాశం ఉందని, మాకు నీరు తగ్గే ప్రమాదం ఉందని కృష్ణా, గుంటూరు జిల్లాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. అసలు బనకచర్ల ఆవశ్యకతనే లేదని, పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా, గాలేరునగరిని వదిలేసి కొత్త సమస్యలు ఎందుకు తెచ్చిపెడుతున్నారని నిలదీశారు.

# దన్వాడ రైతులను వెంటనే విడుదల చేయండి : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ బౌన్సర్లతో పాటు పోలీసులు కూడా రైతులపై విచక్షణారహితంగా దాడిచేయడం అమానుషమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పాలమూరు బిడ్డను అని పదేపదే చెప్పుకునే సిఎం రేవంత్‌రెడ్డి, తన జిల్లాలో ఘటన జరిగి 24గంటలు అవుతున్నప్పటికీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 12 గ్రామాల రైతులను పోలీసులు కొట్టి, 40 మందిపై కేసులు నమోదు చేసి, 12 మందిని రిమాండ్‌కు తరలించడం దుర్మార్గమని హరీశ్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన పెద్ద ధన్వాడకు చెందిన 12 మంది రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులను కొట్టించిన ఇథనాల్ ఫ్యాక్టరీ యజమానిపైన, బౌన్సర్లపైన ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ రైతులోకం తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేద రైతుల కడుపుకొట్టి బడా పారిశ్రామికవేత్తలకు భూములను కారుచౌకగా కట్టబెట్టడం సిఎం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. 2013భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ, భూములను బలవంతంగా సేకరించే బాధ్యతను సిఎం తన భుజాన వేసుకోవడంతో రైతులపై తరచుగా ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు లాఠీలు ప్రయోగిస్తున్నారని ఆరోపించారు.

# సిఐడి చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన చారుసిన్హా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ నేర పరిశోధక విభాగం (సిఐడి) చీఫ్‌గా ఐపిఎస్ 1996 బ్యాచ్‌కు చెందిన అదనపు డిజిపి చారుసిన్హా గురువారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలోనే లక్డీకాపూల్‌లోని డిజిపి ప్రధాన కార్యాలయంలో ఉన్న సిఐడి కార్యాలయంలో చారుసిన్హా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్)లో ఏడు సంవత్సరాల విశిష్ట సేవల తర్వాత చారుసిన్హా తెలంగాణకు తిరిగివచ్చారు. ఆమె బీహార్, జమ్మూకశ్మీర్‌లో పనిచేశారు. చారుసిన్హా మహిళా భద్రత, షీ టీం, భరోసా కేంద్రం అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తారు. సిఐడి చీఫ్‌గా ఇంత కాలం పనిచేసిన శిఖాగోయల్‌ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

# ఈనెల 9న బిసి కమిషన్ బహిరంగ విచారణ షురూ

తొలగించిన 26 కులాల విషయమై సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తొలగించబడిన 26 కులాల విషయంలో బిసి కమిషన్ ఈ నెల 9,10,11 తేదీలలో బహిరంగ విచారణ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లపై బిసి కమిషన్ కార్యాలయంలో గురువారం బిసి కమిషన్ సమావేశమైంది. వివిధ అంశాల పట్ల కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. ఇందులో ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగస్తుల వివరాల సేకరణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గడువులోగా సమాచారం సమర్పించనటువంటి వివిధ శాఖల కార్యదర్శులతో కమిషన్ సమీక్షా సమావేశం నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. సుప్రీం కోర్ట్‌కు కమిషన్ నివేదిక సమర్పించాల్సిన అవసరం ఉన్నందున తొలగించిన కులాల విషయంలో కులగణనలో నమోదైన జనాభా సామాజిక, ఆర్థిక, విద్య, వెనుకబాటుతనం వివరాలను అందించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాలని కమిషన్ నిర్ణయించింది. నిజామాబాద్ జిల్లా తాళ్ళ రాంపూర్ గ్రామంలో గతనెల వెలుగులోకి వచ్చిన బిసిల గ్రామ బహిష్కరణ అంశంలో నిజామాబాద్ కలెక్టర్ సమర్పించిన నివేదికను పరిశీలించి జిల్లా యంత్రాంగం స్పందించిన తీరును కమిషన్ ప్రశంసించింది. కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చవలసిన నలభై కులాల విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, సభ్య కార్యదర్శి బాల మాయాదేవి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్, రిసెర్చ్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# విజయవంతంగా గ్రామగ్రామాన నాణ్యమైన విత్తన పంపిణీ

35 వేల మంది అభ్యుదయ రైతులకు 2500 క్వింటాళ్ల విత్తనాలు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం' కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 2వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అన్ని రెవిన్యూ గ్రామాల్లో ఎంపిక చేయబడిన 35,000 మంది అభ్యుదయ రైతులకు 2500 క్వింటాళ్ల నాణ్యమైన మూల విత్తనాన్ని పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. వరిలో 20,000, జొన్నలో 1,522, కందిలో 4,568, పెసరలో 8,910 విత్తన కిట్లను రైతాంగానికి అందించడం జరిగిందని, నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 2,192 కిట్లను, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జిల్లాలో అత్యల్పంగా 379 విత్తన కిట్లను పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నాణ్యమైన విత్తనాన్ని అందుకున్న రైతులు, సరైన యాజమాన్య పద్ధతులు పాటించి వచ్చిన దిగుబడిని గ్రామంలోని ఇతర రైతులకు పంపిణీ చేయడం ద్వారా రానున్న రెండు మూడేళ్లలో ప్రతీ గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధించగలదని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి రైతు ప్రయోజనకరమైన వినూత్న కార్యక్రమాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు మరిన్ని చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతితో పాటు విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి అభినందించారు.

# మంత్రి కొండా సురేఖకు అస్వస్థత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంకు హాజరయ్యే క్రమంలో తన చాంబర్‌లో బిజిబిజీగా ఉన్న సమయంలో కొండా సురేఖ అస్వస్థతకు గురై స్పృహతప్పి పడిపోయారు. ఈ విషయం గమనించిన సిబ్బంది హుటాహుటిన వైద్యులను రప్పించి వైద్యం అందించారు. ఎటువంటి ఆందోళనా అక్కర్లేదని వైద్యులు స్పష్టం చేశారు. విరామం లేకుండా గత కొద్ది రోజులుగా వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో విస్తృతంగా కార్యక్రమాలకు హాజరుకావడం, గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాదు పిసిబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రోగ్రాంలో పాల్గొనడం... అటు తర్వాత సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశానికి హాజరు అయ్యేందుకు అవసరమైన డేటాను అధికారుల నుంచి సేకరిస్తున్న నేపథ్యంలో సకాలంలో ఆహారం తీసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ సచివాలయంలో స్వల్ప అస్వస్థతకు గురి అయ్యారు. అనంతరం అక్కడే వైద్యులు ప్రథమ చికిత్సను మంత్రికి అందించారు. విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.. సిఎం రేవంత్ రెడ్డి మంత్రి కొండాసురేఖ వద్దకు వచ్చి పరామర్శించారు.
కొద్ది సేపు మంత్రి వద్దనే ఉండి ఆమె యోగక్షేమాలు వైద్యులను అడిగి తెలుసుకోగా... ఒకటి, రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు ముఖ్యమంత్రికి చెప్పారు. కాగా, ఆరోగ్యంపట్ల జాగ్రత్త తీసుకోవాలని, ఇంటికి వెళ్ళి రెస్టు తీసుకోవాలని మంత్రి సురేఖకు సిఎం సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రి సురేఖ విశ్రాంతి తీసుకునేందుకు తన హైదరాబాద్ నివాసానికి వెళ్ళారు. ఈ విషయం మీద తన వరంగల్ ఈస్ట్ నియోజకవర్గవాసులు, జిల్లాకు చెందిన వారు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సురేఖ ఉద్ఘాటించారు. గత కొన్నిరోజులు బిజీబిజీ షెడ్యూల్ నేపథ్యంలో ఆహారం సకాలంలో తీసుకోకపోవడంతోనే ఇబ్బంది తలెత్తిందని సురేఖ చెప్పుకొచ్చారు. ప్రస్తుత పరిస్థితుల సందర్భంగా తన ఆరోగ్య నిమిత్తం వాకబు చేసిన మిత్రులు, సోదరులందరికీ మంత్రి సురేఖ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

### ఏడాదిలో వెయ్యి అంగన్‌వాడీ కేంద్రాలకు

# సొంత భవనాలు నిర్మిస్తాం

బాలికల రక్షణ కోసం స్నేహ కమిటీలు

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ ఏడాది వేయి అంగన్‌వాడి కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరుగుతున్న మేధోమథన సదస్సు ముగింపు సభలో మంత్రి మాట్లాడారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అంగన్‌వాడి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్‌వాడి సిబ్బంది అని తెలిపారు. కరీంనగర్‌లో ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను, హాజరును పెంచాలని మంత్రి ఆదేశించారు. ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువు అవుతుందన్నారు. అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వాళ్లకు శ్రీరామరక్షలాగా ఉంటాయని వివరించారు.
అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారన్నారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు తీసుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్ల ద్వారా అమ్మాయిలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డలను చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో వదిలేసి వెళుతున్నారని, చీమలు, కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని నివారించేందుకు వీలున్నచోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు. బిడ్డలను పారేయకుండా, ఆ ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను తామే స్వీకరిస్తామని తెలిపారు.
బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను మంత్రి కోరారు. మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో త్వరలోనే ఒక సలహా కమిటీ నియమిస్తామని, ఆ కమిటీ సలహాలు, సూచనలతో శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత పటిష్టపరుస్తామన్నారు. రెండు రోజులపాటు జరిగిన మేదోమథన సదస్సులో మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు ప్రాణం పోసిందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామన్నారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సర్కిల్-2, ఉప్పల్.

NIT No. 06/EEC-3/UPL/GHMC/2025-26 టెండర్ ప్రకటన తేదీ: 04.06.2025

**పని పేరు:** 1 పని కొరకు జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, ఉప్పల్, వార్డు నం.10 మరియు చిల్కానగర్, వార్డు నం.7లో కావేరి నగర్ కల్వర్ట్ వద్ద చైన్ లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు. **అంచనా విలువ:** రూ.7.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 12.06.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఎల్.నాగేందర్, ఇఇ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నం.2, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 3161-PP/CL/ADVT/1/2025-26, Date: 05-06-2025



**తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్లు మరియు భవనాల శాఖ**

No. 07/T2/DEE/DSE/SEHnk/2025-2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేదీ: 30.05.2025

హనుమకొండ జిల్లా, హనుమకొండ సర్కిల్‌లో (1) పని మరియు వరంగల్ జిల్లాలో (2) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి 02.06.2025న సా.4.00గం.ల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పైన తెలిపిన పనులకు టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం: 09.06.2025న మ.3.30గం.ల లోపు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), సర్కిల్ :: హనుమకొండ.

DIPR R.O. No. : 3204-PP/CL/ADVT/1/2025-26, Date: 05-06-2025



**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం.యస్.యస్.టి/2025, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేదీ: 05.06.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:11.06.2025 బుధవారము రోజున మ. 2.00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి / నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 04.07.2025 నుండి 03.07.2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9703662667 సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్ కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 3148-PP/CL/ADVT/1/2025-26, Date: 05-06-2025

ప్రజాపక్షం
శుక్రవారం, 06 జూన్

# జనగణన జాప్యపు ఎత్తుగడలు

ఎట్టకేలకు దేశవ్యాప్త జనగణన(సెన్సెస్)కు మోదీ ప్రభుత్వం సిద్ధపడింది. జనగణనతో పాటు స్వతంత్ర భారతదేశంలో తొలిసారిగా కులగణనను కూడా 2027 మార్చి 1వ తేదీ నుంచి (మంచు కురిసే జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో మాత్రం ఆరు నెలలు ముందుగానే) రెండు దశలుగా చేపట్టనున్నట్లు బుధవారం నాడు హోం మంత్రిత్వ శాఖ ప్రకటనను విడుదల చేసింది. దీనికి సంబంధించి ఈ నెల 16న సవివర నోటిఫికేషన్ వెలువడుతుందని చూచాయిగా తెలియపరిచింది. ఐదేళ్ళుగా జనగణనను వాయిదా వేస్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం, దానిని మరింత సాగదిస్తూ నోటిఫికేషన్ వెలువడిన దాదాపు రెండేళ్ళకు జనగణన ప్రక్రియను చేపట్టనుండడం విచిత్రం. ఇన్నేళ్ళ ఆలస్యానికి కొవిడ్ – 19ను సాకుగా చూపించారు. అయితే, కొవిడ్ విశ్వరూపం ప్రదర్శించిన చైనా, యుకె, అమెరికా తదితర దేశాలలోనే యథాప్రకారం దశాబ్ది జనాభా లెక్కలు పూర్తయ్యాయి. మన దగ్గర అనేక మార్లు ఎన్నికలను కూడా నిర్వహించుకున్నాం. 2021లో జనగణనను వాయిదా వేసుకునే నాటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకున్నట్లయితే, తాజాగా ఆ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్ళేందుకు మరో 23 నెలలు ఆలస్యమెందుకు? ప్రస్తుత జనగణనతో దేశభవిష్యత్తు, నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్, ప్రజాస్వామ్యం వ్యవస్థలో బిసిల హెచ్చు ప్రాతినిధ్యం, తదితర అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. ఎందుకంటే, మహిళలకు పార్లమెంటు, అసెంబ్లీలో మూడో వంతు రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లు 2023 సెప్టెంబర్‌లోనే పార్లమెంటులో ఆమోదం పొందినప్పటికీ, అమలుకు తదుపరి నియోజకవర్గాల పునర్విభజనతో లంకె పెట్టింది మోదీ ప్రభుత్వం. ప్రస్తుత నియోజకవర్గాలు 2026 నాటికి కాలం చెల్లి, కొత్త పునర్విభజన రాజ్యాంగ ఆదేశం. ఇక్కడే మరో తిరకాసు దాగి ఉంది. నియోజకవర్గాల పునర్విభజన చట్టం 2002 ప్రకారం 2026 తదుపరి జనాభాలెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ ప్రవచిత కుటుంబ నియంత్రణ పాటించినందుకు జనాభా తగ్గిపోయిన దక్షిణ భారతం పునర్విభజనలో లోక్‌సభ స్థానాలు గణనీయంగా కోల్పోనుందనే ఆందోళన ఉధృతమైంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు కులగణన చేపట్టాలని, బిసిలకు చట్టసభల్లో సమాన వాటా కల్పించాలనే, విపక్షాల డిమాండ్ ఊపందుకుంది. నాడు ఆ డిమాండ్‌ను తిరస్కరించిన మోదీ ప్రభుత్వం చివరకు ప్రతిపక్షాల ఒత్తిడికి తలొగ్గి కులగణన చేపట్టేందుకు అంగీకరించింది. ఈ వివరాలతో చట్టసభల్లో బిసిల భాగస్వామ్యంపై కూడా చర్చ జరగనుంది. కాబట్టి మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన, దక్షిణాది సీట్ల సంఖ్య, బిసిలకు చట్టసభల్లో వాటా వంటి అంశాలు మనువాద ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ద్వయానికి సుతారమూ ఇష్టం లేనివి. ఇవన్నీ తాజా జనాభా లెక్కలతో ముడి పడి ఉండడంతో, సాధ్యమైనంత మేరకు ఆ ప్రక్రియను జాప్యం చేసేందుకే మోదీ ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. అందుకే ప్రకటన వచ్చిన తదెనకి 23 మాసాలు ఆలస్యంగా జనగణను ప్రారంభించడం, అది పూర్తయ్యి లెక్కలు బైటికి వచ్చేందుకు 2028–29 వరకు సమయాన్ని దొలుపుకుంటూ పోయడమే ఏలికల ప్రథమపద సోపానంగా సాగుతున్నది. ఈ డెడ్‌లైన్‌లు కూడా చివరికి వచ్చేసరికి మరింత పెరిగే అవకాశమూ లేకపోలేదు. ప్రస్తుత జనగణననే 2031లో చేపట్టాల్సిన జనగణనలో కలిపే యత్నాన్ని కొట్టిపారేయలేము. అలా చేస్తే, ఒక దశాబ్ది జనాభా లెక్కలు గల్లంతైనట్లే. బిజెపికి మరో ఇష్టమైన అంశం 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' కూడా జనగణన,తదనంతరం నియోజకవర్గాల పునర్విభజనకు అనుబంధంగా ఉంది. ఇప్పటికే దీనికి సంబంధించిన బిల్లును జెపిసికి పంపారు.జనగణన జాప్యం వెనుక బిజెపి వ్యూహం ఇప్పటికీ బైట పడలేదు. అయితే, ఈ ప్రక్రియ ద్వారా మైనారిటీల జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుందనే కథనాన్ని సృష్టించి, దేశంలో మరింత విభజన తీసుకురావడం, అలాగే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యాన్ని తీసుకురావడం వంటి ప్రతిపాదనలు సంఘ్‌పరివార్ మనసు దొంతరలలో దాగి ఉన్నాయనే ప్రచారం కూడా సాగుతోంది. అకస్మాత్తుగా జనగణన, కులగణనను ముందుకు తీసుకురావడం వెనుక త్వరలో జరగనున్న బిహార్ ఎన్నికలు ముఖ్య కారణం. గతంలో తాము వ్యతిరేకించిన కులగణన ఇప్పుడు బిజెపికి ఏకుమేకుగా మారడంతో, తామే దానిని ముందుకు తీసుకెళ్తున్న చాంపియన్‌లుగా ఏమార్చేందుకే ఈ టక్కుటమారా విద్యలు. కానీ, మోదీ ప్రభుత్వ జాప్యపు మాయాజాలం తెలుసుకోలేని అమాయకులేమి కాదు ఈ దేశ ప్రజలు.

# విద్యారంగంలో రేవంత్ సరికొత్త ఆలోచనలు!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

'దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని మేం విశ్వసించాం. మెరుగైన విద్య వ్యవస్థ ఏర్పాటుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని కమిషన్‌ను ఆదేశించాం. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రీ స్కూల్ విధానం తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నాం. ప్రభుత్వ గురుకులాలు, హాస్టల్స్‌లో మెస్ చార్జీల సమస్యను పరిష్కరించాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా డైట్ చార్జీలను 40శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచాం. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో చదువుకునేలా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. తొలి దశలో రూ.11,600 కోట్లతో 58 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపట్టాం. రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకోసం 30 ఎకరాల్లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మిస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో చెప్పారు. 'కేవలం ప్రజలకు విద్య అందించడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించలేకపోవచ్చు. విద్య ఒక వ్యక్తి ఆదాయాన్ని పెంచకపోయినా, ఖచ్చితంగా అతన్ని వేరే మనిషిగా మలుస్తుంది. పేదరిక సమస్యను పరిష్కరించడంలో విద్య పోషించే పాత్రపై నేను సూక్ష్మంగా అధ్యయనం చేశా. ప్రజాస్వామ్యానికి విద్య కీలకం. ఇది ప్రజలకు సమాజంలోని వనరులను పూర్తిగా అందుబాటులోకి తెస్తుంది.వారిని వివిధ సామాజిక కార్యకలాపాల్లో పూర్తి భాగస్వాములను చేస్తుంది.' అని నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ ఒక సందర్భంలో చెప్పారు. ఇటీవల ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎం రేవంత్ ఇచ్చిన ఆహ్వానం మేరకు అభిజిత్ బెనర్జీ 'తెలంగాణ రైజింగ్ విజన్' బోర్డులో చేరేందుకు అంగీకరించారు.

తెలంగాణ ప్రభుత్వ వృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి, గొప్ప మౌలిక సదుపాయాల నిర్మాణం, అన్ని వర్గాల సంక్షేమం అనే దార్శనికతను 'తెలంగాణ రైజింగ్'గా సిఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పట్టణాభివృద్ధి, ఆర్థికవృద్ధి, ప్రజా ఆదాయాలను పెంచడం, ఆర్థిక క్రమశిక్షణ, పెద్ద ఎత్తున నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో అనేక వినూత్న ఆలోచనలపై అభిజిత్ బెనర్జీ చర్చించారు. తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డులో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సలహాదారులతో పాటు చేరవలసిందిగా ముఖ్యమంత్రి నుంచి వచ్చిన ఆహ్వానాన్ని నోబెల్ గ్రహీత కూడా అంగీకరించారని అధికారిక ప్రకటన వెలువడింది. భారీ స్థాయిలో ఉద్యోగ సృష్టి గురించి చర్చిస్తూ సాంప్రదాయ హస్త కళాకారులు ఆధునిక వ్యవస్థాపకులుగా మారేందుకు గాను ఆధునిక డిజైన్లు, ఆకర్షణ,మార్కెటింగ్ అవసరమని ముఖ్యమంత్రికి అభిజిత్ సూచించారు.సోషల్ మీడియా టెక్నాలజీ వినియోగంతో సాంప్రదాయ నైపుణ్యాలలో ప్రత్యేకమైన స్వల్పకాలిక కోర్సులను సృష్టించాల్సిన అవసరం గురించి కూడా కొన్ని సలహాలు ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో చేతిపనులు, కళలు, సృజనాత్మకతను ముఖ్యమైన భాగంగా చేర్చాలని ఆయన ముఖ్యమంత్రికి సూచించారు. రంగంలో ప్రమాణాలు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అధికారంలోకి రాగానే, డీఎస్సీ నిర్వహించి 10 వేల మంది టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలు, ప్రమోషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసింది. యువతలో నైపుణ్యం కొరవడి వెనుకబడిపోతున్నందున, నైపుణ్యాన్ని పెంచే లక్ష్యంతోనే కాంగ్రెస్



ప్రభుత్వం 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ని ఏర్పాటు చేస్తోంది.మూస పద్ధతిలో సాగుతున్న ఐటీఐలను సంస్కరిస్తూ కాలం చెల్లిన కోర్సులకు స్వస్తి పలుకుతూ వాటిని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఎటిసిలను ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు.

భారతదేశంలో 'కనీస ఆదాయ హామీ పథకం' అవసరమని అభిజిత్ బెనర్జీ అభిప్రాయపడుతున్నారు.పేదరికం భయంకరమైన పరిణామాలను కలిగిస్తుందని నోబెల్ గ్రహీత ఒక సందర్భంలో వివరించారు. జాతీయవాదం భారతదేశం వంటి దేశంలో పేదరికం వంటి ముఖ్యమైన సమస్యల నుండి దృష్టిని మళ్లిస్తుందన్నది ఆయన వాదన.ఉచితాలు పేదలను సోమరులుగా మార్చుతాయన్న సిద్ధాంతాన్ని నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ తోసిపుచ్చారు. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆవిష్కరించే వరకు ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన,ఇతర సామాజిక,ఆర్థిక, ప్రభావవంతమైన చర్యలను లాభాపేక్షలేని సంస్థలకు,ప్రైవేట్ రంగానికి వదిలివేశాయని అభిజిత్ అంటున్నారు.' పేద ప్రజలు బాగున్నప్పుడు, వారు మరింత సంపదను ఉత్పత్తి చేయడంలో, మెరుగైన జీవితాలను గడపడంలో మరింత సృజనాత్మకంగా మారతారు. వారి పిల్లలను తమ గ్రామాలకు దూరంగా ఉన్న మెరుగైన పాఠశాలలకు పంపడం ద్వారా కూడా ఇది సాధ్యమే' అని ఆయన సూత్రీకరించారు. క్రీడాకారులను తయారు చేయడం, ఒలింపిక్స్ క్రీడలు లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీలను రేవంత్ ప్రభుత్వం ప్రారంభించబోతున్నది. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించిన సంగతి తెలిసిందే.

'విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఆ రంగంలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉన్నది. ప్రతి ఒక్కరూ దీన్ని ఒక సామాజిక బాధ్యతగా గుర్తించినప్పుడే వ్యవస్థలో అవసరమైన ప్రక్షాళన చేయడం సాధ్యపడుతుంది. 2021 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో పేర్కొన్న గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఏ సబ్జెక్టులోనూ కనీస ప్రాథమిక సామర్థ్యాన్ని ప్రదర్శించలేని వారి సంఖ్య పెరుగుతోంది.ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య తగ్గుతోంది'' అని విద్యా రంగంపై గత మార్చిలో శాసనమండలిలో జరిగిన ప్రత్యేక చర్చకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2026లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు అందుబాటులోకి రానున్నాయి. బడ్జెట్‌లో 7 శాతంపైగా నిధులు విద్యాశాఖకు కేటాయించినా విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో గుర్తు చేస్తున్నారు.ప్రజాప్రభుత్వం విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు,అధికారులు ప్రభుత్వ గురుకులాలు,పాఠశాలలను వారంలో రెండు రోజులు సందర్శించాలని సిఎం సూచించినా ఆచరణలో పెట్టిన వారు చాలా తక్కువ.


తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో కీలక ముందడుగు వేసింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు నిర్మించే లక్ష్యంతో తాజాగా 20 పాఠశాలలను మంజూరు చేసింది.ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.4,000 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతి మంజూరు చేసింది. పాఠశాలలు నిర్మించనున్న నియోజకవర్గాలు ఆలేరు, అశ్వరావుపేట, బాన్సువాడ, భద్రాచలం, భువనగిరి, దేవరకొండ, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్, పాలకుర్తి, పరిగి, పటాన్‌చెరు, రాజేంద్రనగర్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, శేరిలింగంపల్లి, వరంగల్ పశ్చిమ, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, వర్ధన్నపేట. గురుకుల పాఠశాలలతో పాటు తెలంగాణలో ప్రయోగాత్మకంగా రెండు మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో మండలానికి రెండు చొప్పున మొత్తం 100 టిపిఎస్‌లను నెలకొల్పాలని ప్రభుత్వానికి తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సు చేసింది.ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా మంచాల, నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరులను పైలట్ మండలాలుగా ఎంపిక చేశారు. సిఎంగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం నుంచే విద్యావ్యవస్థ బలోపేతానికి రేవంత్‌రెడ్డి నడుం బిగించారు.వేసవి సెలవుల్లోనే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులకు వీలుగా రూ.667.25 కోట్లను కేటాయించారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో నాలుగుసార్లు మాత్రమే టెట్ నిర్వహించి, ఒకే ఒక్క డిఎస్ సి, అదీ కేవలం 8వేల పోస్టులతో సరిపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడాదిలోపే 11,062 ఉపాధ్యాయుల నియామకం పూర్తి చే సింది. ఎక్కువ మంది డిఎస్‌సికి హాజరయ్యేందుకు వీలుగా టెట్‌ను ముందుగానే నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పా ఠశాలల్లో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపిన ఫలితంగా ఇప్పుడు రాష్ట్రంలో 99 శాతం పాఠశాల ల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారు, నాణ్యమైన బోధన ఆశించుదాం!.

# అభివృద్ధికి ఇదో ఆదర్శ గ్రామం



పులి రాజు
9908383567

'గ్రామాలే దేశాని =కి పట్టు గొమ్మలు' అని మ హాత్మాగాంధీ అన్నారు. పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. అక్షరాస్యత, పరిశుభ్రత, స్వచ్ఛత, మద్యానికి దూరంగా ఉండ టం మౌలిక వసతులు కల్పన ద్వారా గ్రామాల త్వ రగా అభివృద్ధి సాధిస్తాయి. ఈ గ్రామానికి మూడు వైపుల నుండి రెండు లైన్ల రోడ్లు రోడ్లకు ఇరువైపులా చెట్లతో గ్రామంలోకి స్వాగతం పలుకుతున్నట్లుగా ఉం టుంది. గత 8 సంవత్సరాలుగా నా పరిశోధనలో ఈ గ్రామం అన్ని రంగాలలో స్వయం సమృద్ధి సాధించి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది. ఆ గ్రామం మత సామరస్యాలకు పుట్టినిల్లు. ఆ ఊరు పేరు తునికి ఖల్సా, మండలం వర్గల్, జిల్లా సిద్దిపేట. 1950 మే 21 వరకు ఈ గ్రామాన్ని తునికి అనే పేరుతో పిలిచేవారు.ఈ గ్రామ జనాభా సుమారు 5000, ఓటర్ల సంఖ్య సరిగ్గా 2400. ఇక్కడ కుటుంబాల సంఖ్య: 930




సామాజిక వర్గాల వారిగా కుటుంబాలు. ఎస్‌టి: 05, ఎస్‌సి: 230, బిసి : 630, ఒసి: 65 (ముస్లిం మైనార్టీ: 40) ఈ గ్రామ రెవెన్యూ రికార్డు ప్రకారం భూమి విస్తీర్ణం 4,192 ఎకరాలు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 3300 ఎకరాల భూమి ఉంది. ఒక కుమ్మరి సామాజిక వర్గం తప్ప అన్ని కులాల వారు, అన్ని మతాలవారు ఉన్నారు. ఇది స్థూలంగా ఆ గ్రామ స్వరూపం.

ఈ ప్రాంతంలో తునికి ఆకు (బీడీలు చేసే ఆకు) ఎక్కువగా లభించడంతో తునికి అనే పేరు వచ్చినట్లు చెబుతారు. ఖల్సా అనగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా కలిగి ఉన్న భూములని అర్థం. ఈ గ్రామంలో ఇప్పటికి దాదాపు 500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. (ఖల్సా అంటే స్వచ్ఛమైనది.) 1950 మే 22 నుండి ఈ గ్రామాన్ని తునికి ఖల్సాగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ గ్రామం చుట్టుపక్కల తునికి పేరుతో తునికిమక్త, తునికి బొల్లారం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామం నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుకు 20 కిలోమీటర్ల దూరంలో రాజీవ్ రహదారికి 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ అన్ని రకాల రాజకీయ పార్టీలు ఉన్నాయి. ఇక్కడి వ్యవసాయ భూములు స్థానికులకు 1113 ఎకరాలు, స్థానికేతరులకు 1203 ఎకరాలు ఉన్నాయి. భూమి ఉన్న కుటుంబాల సంఖ్య 534. భూమిలేని కుటుంబాల సంఖ్య 396. సామాజిక వర్గాలుగా వారీగా భూమి ఉన్న కుటుంబాల వివరాలు ఎస్‌టి : నిల్, ఎస్‌సి: 135, బిసి: 363, ఒసి:36, మైనార్టీ: 25 ఇక్కడి ప్రజలందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడికి వంటి మామిడి కూరగాయలు మార్కెట్ దగ్గర ఉండడంతో ఆధునిక పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తారు. ఇక్కడి ప్రధాన పంటలు కూరగాయలు, ఆకుకూరలు, వరి ఆలుగడ్డ ఎక్కువగా పండిస్తారు. ప్రధాన సాగునీటి వసతి బోర్లు , చెరువు కుంటలు. కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో ఎక్కడ భూగర్భ జలాలు పెరిగాయి. కూరగాయలు పండించడంతో ఇక్కడ రైతు, రైతు కూలీలకు నిత్యం పని దొరుకుతుంది. రైతులకు, రైతు కూలీలకు చేతిలో ఎప్పుడూ డబ్బులు ఉంటాయి. సుమారు 32 జతల ఎడ్లు, 46 ట్రాక్టర్లు, 19 ట్రాలీ ఆటోలు, 5 ప్యాసింజర్ ఆటోలు, 21 కార్లు, దాదాపు ప్రతి ఇంటికి ఒక సైకిల్ మోటార్ ఉన్నాయి. చాలామందికి పాలిచ్చే బర్రెలు ఉన్నాయి. ఇంత పెద్ద గ్రామంలో ఒక హోటల్, ఒక స్వీట్ షాప్, ఐదు బెల్ట్ షాపులు మాత్రమే ఉన్నాయి. యువత కూడా వ్యవసాయ పనులు, రకరకాల కంపెనీలలో ఎవరి పనులకు వారు వెళ్లిపోవడం మూలంగా ఇక్కడ ఆరోగ్యకరమైన మంచి వాతావరణం ఉంది. ఇక్కడి యువత చెడు అలవాట్లకు చాలా దూరంగా ఉన్నారు. తక్కువ మంది ప్రభుత్వం ఉద్యోగులు ఉన్నారు. రెండు కుటుంబాలు మినహా దాదాపు అన్ని కుటుంబాలు వారి వారి స్తోమతకు తగ్గట్టుగా అవసరాలు తీర్చుకునే స్థితిలో ఉన్నారు. ఇక్కడ పంచాయితీలు చాలా తక్కువ, చిన్న,చిన్న పంచాయతీలు కూడా గ్రామ పరిధిలో పరిష్కరించుకుంటారు. పోలీస్ స్టేషన్ వరకు ఈ గ్రామస్తులు పోరు అంటే అతిశయోక్తి కాదు. రాజకీయాలు, రాజకీయ పార్టీలు ఎన్నికల వరకే, ఎన్నికల తెల్లారి చాలా ఆత్మీయంగా కలిసి ఉంటారు.

ఈ గ్రామం వర్గల్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామ పంచాయతీలో 12 వార్డులు ఉన్నాయి. గ్రామ పంచాయతీలో తొమ్మిది మంది సిబ్బంది ఒక ట్రాక్టర్ పనిచేస్తారు. గ్రామం ఎప్పుడు పరిశుభ్రంగా ఉంటుంది. ఐదు వాటర్ ట్యాంకులు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ, వంట గ్యాస్ కనెక్షన్ ఉంది. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి. ఇక్కడ ఎక్కువగా ఆర్‌సిసి ఇండ్లు ఉన్నాయి. ఈ ఊరు మాంసం విక్రయాలకు పేరుగాంచింది. గ్రామంలోని ప్రతి వీధికి సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. సుమారు 80 శాతం అక్షరాస్యత సాధించింది. పార్కులో తెలంగాణ తల్లి, బతుకమ్మ విగ్రహాలు, జాతీయ జెండా ఉంది. గ్రామంలో చాలామంది జాతీయ నాయకుల విగ్రహాలు ఉన్నాయి.

ఈ గ్రామంలో నూతన పంచాయతీ భవనం, జాతీయ బ్యాంకు, కరెంటు సబ్ స్టేషన్, స్మశాన వాటిక, హైస్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడి కేంద్రం, ప్రైవేట్ పాఠశాల,రైతు వేదిక, గ్రామ దేవతలు, అన్ని కులాలకు చెందిన పెద్ద పెద్ద దేవుడి గుళ్ళు, మసీదు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఏదో ఒక కులంవారు వారి వారి కులదేవతలకు పెద్ద ఎత్తున పండుగలు చేస్తారు. ఊరు నిండా సిమెంట్ రోడ్లు. గత ప్రభుత్వంలో 98 డబుల్ బెడ్ రూమ్‌లు కట్టి అర్హులకు అందజేశారు. ఒక ప్రభుత్వ నర్సరీ రెండు ప్రైవేట్ నర్సరీలు, ఇంటర్నేషనల్ సీడ్ కంపెనీ ఈ కంపెనిలో గ్రామస్తులు సుమారు 100 మంది పనిచేస్తారు. ఒక స్పిన్నింగ్ మిల్, రైస్ మిల్ ఉన్నాయి. సోలార్ పవర్ ప్లాంట్ ఉంది. స్థానికేతరుల భూములలో మామిడి తోటలు, ఫామ్ హౌస్‌లు ఉన్నాయి.ఇక్కడ 15 చెరువు,కుంటలు ఉన్నాయి. ఇక్కడి తపాల్ ఖాన్ చెరువు కిందనే హల్దీ వాగు పుట్టి 90కిలోమీటర్ల ప్రవహించి మంజీరా నదిలో కలుస్తుంది.

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన, ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న ప్రభుత్వ పథకాలు రైతు బంధు/ రైతు భరోసా, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ , ఆసరా/చేయూత పెన్షన్లు లాంటి పథకాలతో పాటు వృద్ధాప్య పెన్షన్లు 179, వితంతు పెన్షన్లు 184, వికలాంగుల పెన్షన్లు 36, బీడీ వర్కర్స్ పెన్షన్ 18, ఒంటరి మహిళల పెన్షన్లు 9 మొత్తం 426 మందికి పెన్షన్ వస్తుంది. అటు వ్యవసాయము ఇటు కంపెనీలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల మూలంగా ప్రజల చేతిలో డబ్బులు ఆడుతున్నాయి. ఇక్కడ రెండు కుటుంబాలు మాత్రమే పేదరికంలో ఉన్నాయి. గత 8 సంవత్సరాలుగా నా పరిశోధనలో ఈ గ్రామం స్వయం సమృద్ధి సాధించి ఆర్థికపరమైన ఇబ్బందులకు గురికాకుండా ఉంది. గత పది సంవత్సరాలుగా ఒక రైతు, ఇద్దరు రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ గ్రామంలో ప్రస్తుతం ఒక ఎకరా భూమి ధర ఒక కోటి పైన పలుకుతుంది. పనిలో, సమిష్టి నిర్ణయాలలో, గ్రామాభివృద్ధిలో ఈ గ్రామం మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

# బడిబాటకు వేళాయె...

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ బడులలో నాణ్యమైన విద్యను బోధిస్తున్నారని, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, ఉన్నతోన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులు ఉన్నారని ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థులను సర్కార్ బడులలో చేర్పించడానికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ బడులలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగుతుందని, కంప్యూటర్‌లు, ఐపిబి ద్వారా డిజిటల్ సాంకేతిక పద్ధతులలో ఉత్తమమైన విద్యను బోధిస్తున్నట్లు అటు తల్లి దండ్రులకు, ఇటు విద్యార్థులకు తెలియజేస్తూ 2025–26 విద్యా సంవత్సరంలో సర్కార్ బడులలో ఎన్‌రోల్మెంట్ పెంచడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సర్కార్ బడులకు, ప్రైవేటు బడులకు వ్యత్యాసం తెలియజేస్తూ బ్యానర్లు, కరపత్రికలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వినూత్న పద్ధతిలో విద్యార్థులను ఆకర్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. సర్కార్ బడులలో ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు ఇస్తున్నారని, ఉచితంగా ఫీజు లేకుండా నాణ్యమైన విద్యను బోధిస్తున్నారని, ఉచితంగా యూనిఫాం ఇస్తున్నామని,ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయ సదుపాయం, సైన్స్ ల్యాబ్, సోషల్ తెలంగాణ రాష్ట్ర, భారత దేశ, ప్రపంచ పటాలు ఉన్నాయని, విద్యార్థులకు చదువుతో పాటు ఆటలలో పాటలలో తీర్చిదిద్దడానికి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌లు ఉన్నారని ప్రచారం చేస్తున్నారు.

### ముందుగానే చేరిన పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు 2025–26 సంవత్సరానికి కావాల్సిన పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు వేసవి సెలవుల్లో ప్రభుత్వ బడులకు చేరిపోయాయి. పాఠశాలలు వేసవి సెలవులు ముగిసి పునః ప్రారంభం జూన్ 12వ తేదీన అందరూ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.



### వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఇఆర్‌టి) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో పనిచేస్తున్న ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులకు, ప్రధాన ఉపాధ్యాయులకు, ఎంఇఒలకు, డిఇఒలకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది.ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందించడానికి, ఎన్‌రోల్మెంట్ పెంచడానికి, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి డిజిటల్, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలకు అనుగుణంగా ప్రభుత్వ బడులలో ఆనందదాయకంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు విద్యను అభ్యసించడానికి ఉపాధ్యాయులు ఏ విధంగా తోడ్పాటు అందించాలనే విషయాలను శిక్షణ కార్యక్రమాల్లో బోధించడం జరిగింది.

### ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని శాఖలకు మంత్రులను కేటాయించి విద్యాశాఖను స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు, బలహీన, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేయాలని విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. విద్యాశాఖకు విద్యా శాఖ కమిషన్ ఏర్పాటు చేసి విద్యా శాఖ కమిషన్ చైర్మన్‌ను, సభ్యులను ఏర్పాటు చేసి విద్యా రంగ సమస్యలపై రిపోర్ట్ తయారు చేయించి అన్ని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు.

### ప్రభుత్వ బడులకు కొత్త రూపు

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట తీర్చిదిద్దారు. పురాతన భవనాలలో నడిచే ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలకు మరమ్మతులు చేయడం, నూతన భవనాలను ఏర్పాటు చేయడం, తరగతి గదులను అదనంగా ఏర్పాటు చేయడం, కరెంట్,నీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల భవనాలకు పెయింటింగ్ వేయడం లాంటివి చేసి కొత్త రూపు వచ్చేటట్లు తీర్చి దిద్దారు.

### 2025–26 విద్యా సంవత్సరం నుంచే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లు

గత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు కులాల పరంగా,మతాల పరంగా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. రేవంత్ సర్కార్ కులాల పరంగా, మతాల పరంగా కాకుండా అందరూ విద్యార్థులు ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి 202526 విద్యా సంవత్సరం నుంచి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లను ఏర్పాటు చేస్తుంది. గతంలో రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తూ ఇంటి యజమానులు ఎప్పుడు ఖాళీ చేయమంటరో అంటూ బిక్కు బిక్కు మంటూ చదువుకునేవారు.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వంత భవనాలను ఏర్పాటు చేస్తున్నది.

### కామన్ విద్యా విధానం ఉండాలి

తెలంగాణ రాష్ట్రంలో కామన్ విద్యా విధానం ఉండాలని అనేక మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు కోరుతున్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మోడల్ స్కూల్‌లు, ఎయిడెడ్ స్కూల్ లు, స్పోర్ట్స్ స్కూల్‌లు, రెసిడెన్షియల్ స్కూల్‌లు, నవోదయ స్కూల్‌లు, పబ్లిక్ స్కూల్‌లు, మైనారిటీ స్కూల్‌లు, క్రిష్టియన్ మైనారిటీస్ స్కూల్‌లు అంటూ వేరు వేరుగా ఉండడం వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ అధికారులు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు కలిపి కామన్ స్కూల్ విధానంను అమలు చేస్తే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

### సర్కార్ బడులలో వేసవి శిక్షణ శిబిరాలు

విద్యార్థులకు వేసవి సెలవుల్లో సమయం వృధా కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించింది.ఆర్ట్స్, క్రాఫ్ట్, డ్రాయింగ్, ఆటలు, పాటలలో ప్రత్యేకంగా శిక్షణను ఏర్పాటు చేసి విద్యార్థులను అనేక రంగాల్లో తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 6వ తేదీ నుంచి 19 వరకు బడిబాట పేరుతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బడుల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం, బదిలీలు చేయడం, ఉపాధ్యాయులు లేని చోట ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి జిల్లా కలెక్టర్‌లకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అధికారాలు ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలలో చదివే విద్యార్థులకు తప్పని సరిగా తెలుగును అభ్యసించాలనే ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.విద్యా సంవత్సరం పునః ప్రారంభం కంటే ముందే అన్ని ఏర్పాట్లు చేయడం వల్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు సర్కార్ బడులలో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకం ఏర్పడుతుంది.

డాక్టర్!! ఎస్.విజయ భాస్కర్,
9290826988

నేటి నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట సందర్భంగా...

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## డేంజర్ బెల్స్..
### 564 మందికి పాజిటివ్.. 5 నెలల చిన్నారి సహా ఏడుగురు మృతి

**న్యూఢిల్లీ :**కొన్ని రోజులుగా భారత్‌లో కరోనా వైరస్ విజృంభిస్తోంది. పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా గత 24 గంటల్లో 500కిపైగా కేసులు వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఈ ఏడాది కరోనాబారిన పడిన వారి సంఖ్య5 వేలకు చేరువైంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం8గంటల వరకూ కొత్తగా 564 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తాజా కేసులతో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా బారిన పడిన వారి సంఖ్య 4,866కి పెరిగింది. అత్యధికంగా కేరళలో 1,487 కేసులు వెలుగు చూడగా.. ఢిల్లీలో 562, పశ్చిమబెంగాల్‌లో 538, మహారాష్ట్రలో 526, గుజరాత్‌లో 508, కర్ణాటకలో 436, తమిళనాడులో 213 కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో ఏడు మరణాలు సంభవించాయి. ఢిల్లీలో 5 నెలల చిన్నారిసహా ఇద్దరు మరణించారు. కర్ణాటకలో ఇద్దరు, మహారాష్ట్రలో ముగ్గురు కొవిడ్ ప్రాణాలు కోల్పోయారు.ఈ ఏడాది ఇప్పటివరకూ కరోనా కారణంగా మరణించినవారి సంఖ్య 51కి పెరిగింది.



భగవాన్ మహావీర్ వనస్థలిపార్క్‌లో మొక్క నాటిన ప్రధాని

### పర్యావరణ సవాళ్లు ఎదుర్కొనేందుకు
# ప్రభుత్వం కట్టుబడి ఉంది
## 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన మోదీ

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇక్కడి భగవాన్ మహావీర్ వనస్థలి పార్క్‌లో ఒక మొక్కను నాటారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' (ఒక చెట్టు అమ్మతో సమానం) ప్రచార కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ విస్తృతం చేశారు. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు 700 కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల్లో 'తిరిగి అడవులను' పెంచడానికి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఎక్స్'పోస్ట్‌లో మాట్లాడుతూ గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీలను కవర్‌చేసే ఈ గ్రహం మీద అత్యంత పురాతనమైన పర్వత శ్రేణి ఆరావళి అన్నారు. గత కొన్ని సంవత్సరాలు గా ఈ శ్రేణికి సంబంధించిన అనేక పర్యావరణ సవాళ్ల తెరపైకి వచ్చాయని, వాటిని ఎదుర్కొనేందుకు తన ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 'ఈ శ్రేణితో అనుసంధానించబడిన ప్రాం తాలను పునరుజ్జీవింపజేయడంపై మేం దృష్టి పెట్టాం. దీనికోసం స్థాన పరిపాలనా యంత్రాంగాలతో కలిసి పనిచేస్తాం. నీటిపారుదల వ్యవస్థలను మెరుపరుస్తాం.దుమ్ము తుపానులను అరికడతాం. థార్ ఎడారి తూర్పువైపు విస్తరణలను నిలువరించడమే కాకుండా మరికొన్నింటిపై దృష్టి పెడతాం' అని ఆయనవెల్లడించారు.'ఆరావళి శ్రేణి, అవతలపక్క అదనంగా సాంప్రదాయంగా నాటే పద్ధతులను అనుసరిస్తూనే మేం నూతన పద్ధతులను ప్రోత్సహిస్తాం. ప్రత్యేకించి అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాలలో ఎక్కడైతే స్థల పరిమితులుంటాయో మేరీ లైఫ్ పోర్టల్‌పై పర్యవేక్షించేలా ప్లాంటేషన్ కార్యకలాపాలకు జియోట్యాగ్‌ను అనుసంధానిస్తాం' అని ప్రధాని మోదీ తెలిపారు.ఇది ఢిల్లీ ప్రజల జీవన సౌలభ్యాన్ని కూడా మెరుగుపరుస్తుందన్నారు. ఆరావళి గ్రీన్ వాల్ ప్రాజెక్ట్ అనేది 29జిల్లాలు, మూడు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం చుట్టూ 5కి.మీ బఫర్ ఏరియాలో పచ్చదనాన్ని వ్యాపింపజేయడానికి ప్రధానంగా చొరవ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం చెప్పింది. 2.5నుంచి 3బిలియన్ల అదనపు కార్బన్ సింక్‌ను సృష్టించాలన్న భారత దేశ వాతావరణ లక్ష్యాన్ని సాధించడానికి, కార్బన్‌డయాక్సైడ్‌కు సమానమైన స్థాయిలో 2030 నాటికి 26మిలియన్ హెక్టార్ల భూమిని పునరుద్ధరించడానికి దోహదపడుతుందని తెలిపింది. ఈ ప్రాజెక్ట్ అడవుల పెంపకం, రీఫారెస్టింగ్, నీటి పునరుద్ధరణద్వారా ఆరావళి శ్రేణి జీవవైవిధ్యాన్ని పెంచుతుంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో నేల సంతానోత్పత్తిని, నీటి లభ్యతను మెరుగుపర్చడంలో సహాయపడుతుందని ప్రభు త్వం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ స్థానిక సమాజాలకు ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పించడానికి ఉపకరిస్తుందనిప్రభుత్వం తెలియజేసింది.ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆరావళి శ్రేణిలో భాగంగా ఉన్న 29 జిల్లాలలో దాదాపు 1,000 నర్సరీలను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారులు చెప్పారు. మొత్తం క్షీణించిన ప్రాంతం రాజస్థాన్‌లో 81శాతం, గుజరాత్‌లో 15.8శాతం, హర్యానాలో1.7శాతం,ఢిల్లీలో 1.6శాతం ఉన్నది.

# ఫ్రీ టికెట్లు... గేట్ల మూసివేత!



### తొక్కిసలాటకు ఇవే కారణాలు

**బెంగళూరు:**సుదీర్ఘనిరీక్షణ తర్వాత ఐపీఎల్ కప్పు సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయోత్సవం కొన్ని గంటలకే ఆవిరైంది. తమ ఆరాధ్య క్రికెటర్లను చూసేందుకు అభిమానులు పోటెత్తడంతో జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటన వెనక అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఉచిత పాస్‌లంటూ వదంతులు... స్టేడియం వద్ద గేట్ల మూసివేతతో నెలకొన్న గందరగోళం... అధిక రద్దీతో తోపులాటతో ఈ విషాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి చిన్నస్వామి స్టేడియం సామర్థ్యం 35 వేల మంది మాత్రమే. కానీ, బుధవారం సాయంత్రం అక్కడికి దాదాపు మూడు లక్షల మంది అభిమానులు చేరుకున్నారు. ఈ స్టేడియంలో మొత్తం 21 స్టాండ్‌లు, 13 గేట్లు ఉన్నాయి. ఇందులో 9, 10వ నంబరు గేట్లను రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు రిజర్వ్ చేశారు. 5, 6, 7 గేట్ల నుంచి అభిమానులకు ప్రవేశం కల్పించారు. ఇందులో 7వ నంబర్ గేట్ నుంచి చూస్తే చిన్నస్వామి స్టేడియం ప్రధాన ప్రవేశం నుంచి లోపలికి వచ్చే వ్యూ కనిపిస్తుంది.మెయిన్‌ఎంట్రెన్స్‌నుంచేఆర్సీబీ జట్టు మైదానంలోకి ప్రవేశిస్తుంది. అందువల్ల ఏడో నంబరు గేట్ వద్దకు అభిమానులు పోటెత్తారు. పాస్‌లు ఉన్నవారు మాత్రమే స్టేడియం లోపలికి వెళ్లేందుకు అనుమతి ఉంది. కానీ, చాలామంది పాస్‌లు లేకుండానే అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో ఏడో నంబరు గేట్ వద్ద ఉచిత టికెట్లు పంచుతున్నారన్న ప్రచారం మొదలైంది. వాటిని తీసుకునేందుకు అభిమానులు పరుగులు తీశారు. టికెట్ల కోసం ఒకరినొకరు తోసుకోవడంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ గేట్ వద్దే అత్యధిక నష్టం సంభవించింది. స్టేడియం వద్ద రద్దీని నియంత్రించేందుకు 5 వేల మంది పోలీసులను మోహరించారు. కానీ, అంచనాలకు మించి అభిమానులు రావడంతో వారిని నియంత్రించడం కష్టతరమైంది. గేట్లు కూడా చిన్నవిగా ఉండటంతో వారు లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. 'స్టేడియం గేట్లు చిన్నగా ఉన్నాయి. అభిమానులు కిక్కిరిసిపోవడంతో కొన్ని చోట్ల గేట్లు విరిగిపోయాయి. రద్దీ ఎక్కువగా ఉండటం వల్లే ఈ ఘటన సంభవించిందని అనుకుంటున్నాం' అని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. పాస్‌లు ఉన్నప్పటికీ తమను లోపలికి రానియ్యకుండా గేట్లు మూసివేశారంటూ కొంతమంది అభిమానులు ఆరోపించారు.మరోవైపు, బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు పరేడ్ ఉంటుందని ఆర్సీబీ జట్టు ముందే ప్రకటించింది. అయితే, అభిమానుల రాకను ముందే అంచనా వేసిన పోలీసులు ర్యాలీకి అనుమతినివ్వలేదు. ఆర్సీబీ జట్టు పరేడ్ ఉండదని, కేవలం స్టేడియంలో సన్మాన కార్యక్రమానికి మాత్రమే అనుమతి ఉందనిబెంగళూరుట్రాఫిక్‌పోలీసులు ఉదయం 11.56 గంటలకు ప్రకటించారు. మధ్యాహ్నం ఆర్సీబీ మేనేజ్‌మెంట్ మరో ప్రకటన చేసింది. పరేడ్ నిర్వహిస్తామని, అభిమానులు మార్గదర్శకాలు పాటించాలని కోరింది. అభిమానుల్లో గందరగోళం నెలకొంది. పరేడ్ ఉంటుందో లేదో తెలియక ఎక్కువ మంది నేరుగా మైదానం లోపలికి వెళ్లేందుకే ఉత్సాహం చూపించారు. కొంతమంది టికెట్లు లేకుండానే గేట్లు దూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకుని పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

# దేశం...పార్టీ రెండూ సమానమే : సల్మాన్ ఖుర్షీద్

**న్యూఢిల్లీ:** అటు దేశం పట్ల, ఇటు పార్టీ పట్ల తనకు సమాన భక్తిభావం ఉందని కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ గురువారం అన్నారు. విదేశాలలో దౌత్య కార్యక్రమంలో కేంద్రానికి అనుకూలంగా చేసిన వ్యాఖ్యలపై తన సహచరులతో సహా మరి కొంతమంది విమర్శించిన కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశభక్తి అంటే ఏమిటో అర్థం కాని వారికి నేను ఒక సందేశం పంపాలనుకుంటున్నాను. 'నాకు దేశం... పార్టీ పట్ల భక్తి ఒకటే' అని ఐదు దేశాల బహుళ పార్టీల ప్రతినిధి బందం పర్యటన నుంచి తిరిగి వచ్చిన మాజీ విదేశాంగ మంత్రి గురువారం ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయాలనే నిర్ణయంపై బీజేపీ నేతృత్వంలోని కేంద్రాన్ని ప్రశంసించిన కొన్ని రోజుల తర్వాత ఆయన వ్యాఖ్యలు వచ్చాయి. 'భారత రాజకీయాల అంశవిదేశాలలో మా చర్చల్లో రాలేదు.



మేమందరం ఒకే గొంతుకగా మాట్లాడాము. పర్యటన అంతటా నేను పార్టీ అధిష్ఠానంతో నిరంతరం సంప్రదించాను' అని అన్నారు. 'దేశీయ కథనాలు మా లక్ష్యాన్ని ప్రభావితం చేయనివ్వలేదు. మేము భారతదేశ ప్రతినిధులుగా అక్కడ ఉన్నాము' అని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ గురించి మిత్రదేశాలకు వివరించడానికి తమ దౌత్య కార్యక్రమాల సమయంలో 'బీజేపీ సూపర్ ప్రతినిధిలా' వ్యవహరించారంటూ ఉదిత్ రాజ్ సహా పార్టీ నాయకుల నుంచి ఖుర్షీద్, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ విమర్శలు ఎదుర్కొన్నారు. స్వదేశంలో ప్రజలు రాజకీయ విధేయతలను లెక్కించడం 'బాధాకరం' అని ఖుర్షీద్ అన్నారు. 'దేశభక్తి కలిగి ఉండటం అంత కష్టమా' అని ప్రశ్నించారు. జనతాదళ్ (యునైటెడ్) ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని ప్రతినిధి బృందంలో ఖుర్షీద్ ఉన్నారు. ఇండోనేషియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్, మలేషియాను. సందర్శించారు. ప్రపంచ పర్యటన ఉద్దేశం, లక్ష్యం గణనీయంగా సాధించడం జరిగిందని ఖుర్షీద్ అన్నారు. 'మా మూడు రోజుల మలేషియా పర్యటన తర్వాత పాకిస్థాన్ నిరాశపరిచిన పత్రికా ప్రకటనను విడుదల చేసింది' అని ఆయన తెలిపారు. 'ఇస్లామిక్ సహకార సంస్థ (ఐవోసీ) లో బలమైన సభ్యత్వం ఉన్నందున మలేషియా కొన్ని ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ మలేషియా ప్రధాన మంత్రి నుంచి మాకు దఢమైన మద్దతు లేఖ అందింది. భారతదేశానికి మద్దతు ఇవ్వడంలో ఎటువంటి సంకోచం కనిపించలేదు' అని ఆయన అన్నారు. ఏ దేశం నుంచి అయినా దఢమైన నిబద్ధతలను ఆశించలేమని మాజీ కేంద్ర మంత్రి అన్నారు. 'కానీ ప్రతిస్పందన గురించి మీకు సాధారణ అవగాహన లభిస్తుంది. మాకు లభించిన మద్దతు అత్యద్భుతంగా ఉంది. ముందుకు సాగుతున్నప్పుడు ఐవోసీ భావోద్వేగంలో మార్పు వస్తుందని నేను నమ్ముతున్నాను' అని ఆయన అన్నారు. భారత దేశం ఎటువంటి అణు ఘర్షణను కోరుకోవడం లేదని తెలిపారు.

## కోర్టు లాకప్‌లో దారుణం..
### ఖైదీని చంపిన మరో ఖైదీ..

**న్యూఢిల్లీ :**పగలు, ప్రతీకారాల కారణంగా చరిత్రలో మారణహోమాలు ఎన్నో జరిగాయి. 21వ శాతాబ్ధంలోనూ పగలు ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి. కొంతమంది కఠిన శిక్షలకు కూడా ఏ మాత్రం భయపడ్డం లేదు. తాజాగా, ఓ ఖైదీ మరో ఖైదీ ప్రాణాలు తీశాడు. అది కూడా కోర్టు లాకప్‌లో ప్రత్యర్థి పీక కాలితో తొక్కి మరీ చంపేశాడు. ఈ సంఘటన ఢిల్లీలో గురువారం చోటుచేసుకుంది. ఈ దారుణ సంఘటనకు సంబంధించి ఢిల్లీ పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన జితేందర్, అమన్‌లకు మధ్య గత కొన్నేళ్ల నుంచి వివాదాలు నడుస్తున్నాయి. 2024లో జితేందర్, అతడి సోదరుడిపై అమన్ దాడి చేశాడు. ఇద్దర్నీ కత్తితో పొడిచాడు. ఆ ఇద్దరూ ఆ కత్తి దాడి నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. ఇక, అప్పటినుంచి జితేందర్.. అమన్‌పై పగ పెంచుకున్నాడు. అమన్‌పై పగ సాధించడానికి ప్లాన్లు వేస్తూ ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే కొన్ని నెలల క్రితం జితేందర్, అమన్‌లు ఓ కేసులో జైలు పాలయ్యారు. గురువారం ఢిల్లీ పోలీసులు కొంతమంది అండర్‌ట్రయల్ ఖైదీలను సాకేత్ కోర్టుకు తీసుకువచ్చారు. వారిలో జితేందర్, అమన్‌లు కూడా ఉన్నారు. ఆ ఖైదీలందరినీ సాకేత్ కోర్టు లాకప్‌లో ఉంచారు. సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్న జితేందర్ కోర్టు లాకప్‌లో అమన్‌పై దాడికి దిగాడు. జితేందర్‌కు జైదేవ్ అనే మరో వ్యక్తి కూడా సాయం చేశాడు. జితేందర్, జైదేవ్‌లు కలిసి అమన్‌ను విచక్షణా రహితంగా కొట్టారు. ఆ తర్వాత జితేందర్ తన కాలితో అమన్ పీక నొక్కి చంపేశాడు. అమన్ హత్యతో కోర్టులో ఒక్కసారిగా కలకలం చెలరేగింది.

## ఉగ్ర పాక్‌కు ఆ బాధ్యతలా?
### భారత్‌కు మద్దతు ఇవ్వండి: ఖర్గే

**న్యూఢిల్లీ:** పాక్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారత్‌కు ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సామాజిక మా ధ్యమం ఎక్స్‌లో ఆయన ఓ సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఇటీవల కాలంలో పాక్‌కు బెయిల్ ఔట్ ప్యాకేజీలు, రుణాలు



లభించిన సొమ్ము సైన్యం, భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై వెచ్చిస్తుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో ఉగ్రవాదాన్ని పోషించే పాక్‌ను... ఉగ్ర బాధిత దేశమైన భారత్‌తో పోల్చడం సరికాదన్నారు. పాకిస్థాన్‌ను ఐరాస భద్రతా మండలి కౌంటర్ టెర్రరిజం కమిటీ వైస్ చైర్మన్‌గా చేయడం, తాలిబన్ శాంక్షన్ కమిటీకి 2025కు గాను అధ్యక్షత అప్పగించడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఇది పూర్తిగా దురదష్టం, అవగాహన రాహిత్యం, ఏమాత్రం ఆమోద యోగ్యం కానిదన్నారు. ఉగ్ర ఫైనాన్స్‌పై నిఘా కోసం పాకిస్థాన్‌ను ఆర్థిక కార్యదళం గ్రేలిస్ట్‌లో తిరిగి చేర్చాలన్న భారత్ డిమాండ్‌లోని సహేతుకతను గమనించాలన్నారు. ఇది కేవలం భారత్ కోసం కాదని, అంతర్జాతీయ సమాజం ప్రయోజనాల కోసం అవసరమన్నారు. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ పాకిస్థాన్‌లోనే హతమయ్యాడన్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేడా కూడా కౌంటర్ టెర్రరిజం కమిటీకి పాకిస్థాన్ నాయకత్వం వహించడాన్ని వ్యతిరేకించారు. 'జూన్ 4వ తేదీన తాలిబన్ ఆంక్షల కమిటీకి పాకిస్థాన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైంది. ఇది మన విదేశాంగ విధానం విషాద గాథ. ప్రపంచ దేశాలైనా ఎలా అనుమతించాయి' అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

### కోటా పెంపుపై, కొత్త చట్టాలపై
# ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు చేయాలి
### ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ డిమాండ్

**న్యూఢిల్లీ :** సమాజంలోని బలహీన వర్గాలకు రిజర్వేషన్‌ను 85 శాతానికి పెంచడానికి కొత్త చట్టాలు తీసుకు వచ్చేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ఆయన గురువారం బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు లేఖ రాశారు. ప్రతిపక్ష నేతగా ఉన్న యాదవ్ సోషల్ మీడియాలో ఒక లేఖను పంచుకున్నారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ఉద్దేశపూర్వకంగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లను 75 శాతానికి పెంచినప్పుడు తేజస్వీ యాదవ్ డిప్యూటీ సిఎంగా ఉన్నారు. కొత్త చట్టాలను రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి వెంటనే కేంద్రానికి



పంపాలని ఆర్‌జెడి నాయకుడు సూచించారు. 2023లో ఆమోదించబడిన చట్టాలను పాట్నా హైకోర్టు పక్కన పెట్టిందని, కోటాల పెంపు అవసరాన్ని ఎత్తి చూపే 'శాస్త్రీయ అధ్యయనం' అనుసరించలేదని అభిప్రాయపడ్డారని ఆయన గుర్తు చేశారు. కులాల వారీగా నిర్వహించిన ప్రతిష్టాత్మక సర్వే ఆధారంగా కోటాల పెంపుదల జరిగింది. 1931 జనాభా లెక్కలతో పోలిస్తే దళితులు, వెనుకబడిన తరగతుల జనాభా శాతంలో పెరుగుదల ఈ సర్వేలో కనిపించింది. వివిధ సామాజిక వర్గాల గణన చివరిసారిగా జరిగినప్పుడు ఇది జరిగింది. తమిళనాడులో 69 శాతం కోటాలు అమలులో ఉన్నాయని యాదవ్ ఉదహరించారు. బిహార్ కూడా రిజర్వేషన్ చట్టాలను తొమ్మిదవ షెడ్యూల్‌లో ఉంచడం ద్వారా న్యాయపరమైన జోక్యం నుండి రక్షించుకోవచ్చని అన్నారు. కొత్త చట్టాల రూపకల్పన కోసం 'అఖిల పక్ష కమిటీ'ని ఏర్పాటు చేయాలని, ఆ తర్వాత వీటిని ఆమోదించడానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఆర్‌జెడి నాయకుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారాన్ని పంచుకుని కేంద్రాన్ని పాలించే బిజెపి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆరోపించిన దృక్పథానికి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంనే నిందిస్తోందని కూడా ఆయన ఆరోపించారు.

## శర్మిష్ఠ పనౌలీకి మధ్యంతర బెయిల్

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనౌలీ((22)కి మధ్యంతర బెయిల్ లభించింది. 'ఆపరేషన్ సిందూర్'పై సామాజిక మాధ్యమాల్లో తన భావాలు వెల్లడించే క్రమంలో ఒక వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఆమెకు కలకత్తా హైకోర్టు గురువారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో శర్మిష్ఠకు ఉపశమనం లభించినట్లయింది. మే 31న ఆమెను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేయడంతో తీవ్ర రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. గత శనివారం న్యాయస్థానం ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా... ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. కోల్‌కతాలోని ఆనందపూర్ ప్రాంతానికి చెందిన శర్మిష్ఠ పూనె న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతోంది. లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం ఆమెకు ఇన్‌స్టాలో 94 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. రాజకీయాలపై తనదైన శైలిలో వ్యాఖ్యలు జోడించి అభిప్రాయాలను బలంగా చెప్పడం ద్వారా శర్మిష్ఠ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సరుగా పేరు సాధించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాలీవుడ్ ప్రముఖుల మౌనాన్ని ప్రశ్నిస్తూ మే 14న పోస్టు చేసిన వీడియో తీవ్ర వివాదాస్పదమై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తన పోస్టులు, రీల్స్ తొలగించి ఆమె క్షమాపణ కోరారు. శర్మిష్ఠను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్లు పెరగడంతో పోలీసులు రంగంలోకి దిగి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆమెను గురుగ్రామ్‌లో అరెస్టు చేశారు.

## హెలికాప్టర్లలో 59 మంది పర్యాటకుల తరలింపు

**గ్యాంగ్‌టక్:** భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉత్తర సిక్కిం నుంచి 59 మంది పర్యాటకులను గ్యాంగ్‌టక్‌కు తీసుకువచ్చారు, వాతావరణం మెరుగుపడిన తర్వాత సహాయక చర్యలు తిరిగి ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఉత్తర సిక్కింలోని లాచుంగ్‌లో దాదాపు వారం రోజులుగా చిక్కుకున్న 109 మంది పర్యాటకులలో వీరు ఉన్నారు. వాతావరణం మెరుగుపడిన తర్వాత తెల్లవారుజామున రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్ సమీపంలోని పాక్యాంగ్ విమానాశ్రయం నుంచి ఉత్తర సిక్కింలోని చాటెన్‌కు రెండు ఎం17వీ5 హెలికాప్టర్లు బయలుదేరాయి. 39 మంది పర్యాటకులు ఒక హెలికాప్టర్‌లో తిరిగి రాగా, 20 మంది మరొక హెలికాప్టర్‌లో వచ్చారని అధికారులు వివరించారు. వారిలో ఇద్దరు విదేశీయులు ఉన్నారని తెలిపారు. ఈ పర్యాటకులు పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురికి చేరుకోవడానికి సహాయం చేయడానికి సిక్కిం జాతీయ రవాణా (ఎస్ఎన్‌టీ) బస్సులు ఏర్పాటు చేసింది. సిలిగురికి సమీపంలోని బాగ్డోగ్రాకు విమానంలో ప్రయాణించాలనుకునే వారి కోసం పాక్యాంగ్ విమానాశ్రయంలో అదనపు హెలికాప్టర్‌ను సిద్ధంగా ఉంచారు. రెండు హెలికాప్టర్లు ఎన్‌డీఆర్ఎఫ్, విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు అవసరమైన సేవలను పునరుద్ధరించడానికి ఈ ప్రాంతంలో పనిచేసే ఎయిర్‌టెల్ ఇంజనీర్లతో చాటెన్‌కు వెళ్లాయని వారు తెలిపారు. ఈ 109 మంది పర్యాటకులను వాయు మార్గంలో చాటెన్‌కు తీసుకువచ్చారని అన్నారు. పర్యాటకులను హోటళ్లలో, చాటెన్ సైనిక శిబిరంలో ఉంచినట్లు ఒక అధికారి తెలిపారు. ఉత్తర సిక్కింలో ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం పాక్యోంగ్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ సేవలు నిలిపివేశారు. దీంతో తరలింపు ఆలస్యమయింది. ఆదివారం చాటెన్‌లోని సైనిక శిబిరంపై కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు సైనిక సిబ్బంది మరణించగా, ఆరుగురు సైనికులు గల్లంతయ్యారు. మరికొందరు కూడా గాయపడ్డారు. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా గల్లంతయిన ఆరుగురు సిబ్బంది కోసం గాలింపు చర్యలకు ఆటంకం నెలకొందని అధికారి ఒకరు చెప్పారు. మున్షితాంగ్, చాటెన్ మధ్య ఉన్న తరణ్ చు నదిపై ఉన్న రెండు కీలక వంతెనలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొట్టుకుపోవడంతో లాచెన్ నుంచి చాటెన్‌కు వాహనాల రాకపోకలు తెగిపోవడంతో ఉత్తర సిక్కింలో కొనసాగుతున్న సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మూడు రోజుల క్రితం లాచుంగ్, చుంగ్‌తాంగ్ నుంచి 1,678 మంది పర్యాటకులను రక్షించగా, ఇద్దరు అమెరికన్ జాతీయులు సహా 33 మందిని బుధవారం విమానాల ద్వారా విజయవంతంగా తరలించారు.

# సామాజిక కార్యకర్త మేధా పాట్కర్‌పై నిషేధాజ్ఞలు

**భువనేశ్వర్:** బాక్సైట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న వేళ సామాజిక కార్యకర్త మేధా పాట్కర్‌ను ఒడిశా, రాయగఢ్ జిల్లాలోకి అడుగు పెట్టనివ్వలేదు. ఆమె గురువారం ఉదయం అక్కడి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే, ప్రవేశాన్ని నిషేధించే ఉత్తర్వులు అందాయి. ఈనెల 4వ తేదీ నుంచి రెండు నెలల పాటు పాట్కర్‌ను రాయగఢ్ జిల్లాలోకి ప్రవేశాన్ని నిషేధిస్తూ ఆ ఆదేశాలిచ్చారు. నర్మదా బచావో ఉద్యమకారిణితో పాటు మరో 20 మందికిపైగా కార్యకర్తలకు ఇలాంటి నిషేధాజ్ఞలు జారీ అయ్యాయి. ఈ కార్యకర్తలు జిల్లాకు వస్తే శాంతి భద్రతల సమస్యలు వస్తాయని, ప్రజాశాంతికి భంగం కలుగుతుందని, పరిపాలన వ్యవహారాలు సజావుగా సాగలేవని, అభివృద్ధి ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందని సహేతుకమైన ఆందోళనల దృష్ట్యా వారి ప్రవేశాన్ని నిషేధించినట్లు కలెక్టర్ పారుల్ పట్వారీ సంతకంతో ఉన్న ఉత్తర్వులు పేర్కొన్నాయి. కాగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మా మాటి మాలీ సురక్ష మంచ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు మేధా పాట్కర్ రాయగఢ్ చేరుకున్నారు. కానీ ఆమెను అడ్డుకోవడంతో అక్కడ నుంచి గంజాం జిల్లాలోని బెర్హంపూర్‌కు వెళతారని, అలాగే, శనివారం భువనేశ్వర్‌లో కార్యక్రమంలో పాల్గొంటారని పాట్కర్ సహచరుడు నరేంద్ర మహంతీ వెల్లడించారు. తాజా పరిణామంపై మేధా పాట్కర్ విలేకరులతో మాట్లాడుతూ 'నేను రావడంతో ప్రజలకు సమస్యలు వస్తాయనేందుకు నేనేమీ ఉగ్రవాదిని కాను. దేశ పౌరురాలిని. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. సుస్థిర ప్రగతినే డిమాండ్ చేస్తాం' అని అన్నారు. కాగా, మా మాటి మాలీ సురక్ష మంచ్ అధ్వర్యంలో రాయగఢ్, కోరాపుట్ జిల్లాల్లో బాక్సైట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆందోళనలకు కేంద్రబిందువు రాయగఢ్ జిల్లాలోని కాశీపూర్‌లో 240 మంది పోలీసులను మోహరించినట్టు అధికారులు తెలిపారు.



# 'మేడమ్ ఎన్' ట్రాప్‌లో భారత ఇన్‌ఫ్లూయెన్సర్లు

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ కింద పనిచేసే ఓ మహిళా వ్యాపారవేత్త భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను గూఢచర్యంలోకి లాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన నోషబ షెహజాద మసూద్ లాహోర్‌లో జయాన ట్రావెల్స్ అండ్ టూరిజం పేరిట ఓ సంస్థను నడుపుతోంది. షెహజాద భర్త పాక్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేసి పదవీ విరమణ చేశారు.షెహజాదకు ఐఎస్ఐతో బలమైన సంబంధా లున్నాయి. భారత్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా వంటి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు ఆమె సాయం చేస్తోంది. ఐఎస్ఐ ఆమెకు పెట్టిన కోడ్ నేమ్ 'మేడమ్ ఎన్'. హిందూ, సిక్కు యాత్రికులకు పాకిస్థాన్‌లో పర్యటనలు ఏర్పాటు చేయించేది షెహజాదకు చెందిన సంస్థ ఒక్కటే. ఇది అక్కడి ప్రభుత్వానికి చెందిన ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్‌తో కలిసి పనిచేస్తోంది. దీనిని బట్టే ఆమెకు ఆ దేశ సైన్యం, ఐఎస్ఐతోఉన్నబలమైన సంబంధాలు వెల్లడిస్తున్నాయి. ఆమె సంస్థ భారత్‌లోని ఢిల్లీ వంటి చోట్ల ట్రావెల్ ఏజెంట్లను నియమించుకొన్నట్లు తెలుస్తోంది. భారత్‌లో గూఢచర్యం ఆరోపణలపై కొంతమంది ఇన్‌ఫ్లూయెన్సర్లు అరెస్టయ్యారు. వారిని విచారించగా... షెహజాద పాత్ర వెలుగులోకి వచ్చింది. భారత్‌లో ఆమె దాదాపు 500 మందితో స్లీపర్ సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి పాక్ ఐఎస్ఐ, సైన్యం నుంచి ఆమెకు స్పష్టమైన సూచనలు వచ్చాయి. పాక్‌కు వచ్చిన భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను పాక్ సైనిక అధికారులు, ఐఎస్ఐకు షెహజాదనే పరిచయం చేస్తోంది. భారత్‌లోని దాదాపు 3 వేల మంది ఈ సంస్థ నుంచి సాయం పొందినట్లు తెలుస్తోంది. వీరిలో దాదాపు 1500 మంది ఎన్నారైలు ఆరు నెలల్లోనే ఆ దేశాన్ని సందర్శించారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్యకార్యాలయంలో వీసా విభాగంలో ఈమెకు విశేషమైన పలుకుబడి ఉంది. అక్కడి ఫస్ట్ సెక్రటరీ (వీసా) సుహైల్ కమర్, కౌన్సిలర్ (ట్రేడ్) ఉమర్ షేయర్‌తో మంచి సంబంధాలున్నాయి. ఆమె నుంచి వచ్చే ఒక్క ఫోన్‌కాల్‌తో కోరుకున్న వారికి పాక్ వీసా లభించేది. అదే కార్యాలయంలో వీసా అధికారిగా పనిచేస్తున్న ఎహసాన్ ఉర్ రెహ్మాన్ అలియాస్ డానిష్‌తో బలమైన పరిచయం ఉంది. 'మేడమ్ ఎన్' రికమండేషన్ లేదా స్పాన్సర్‌షిప్ ఉంటే భారతీయులకు విజిటర్ వీసా వచ్చేసేది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ములుగు జిల్లాకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ

### కేబినెట్ నిర్ణయంపై మంత్రి సీతక్క హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ములుగు జిల్లా ఇంచర్లలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం 12 ఎకరాలు కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ములుగు జిల్లా పరిసర ప్రాంతాల్లో ఆయిల్ ఫామ్ సాగుతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. వెనకబడిన జిల్లా ములుగు పారిశ్రామికీకరణకు క్యాబినెట్ నిర్ణయంతో ముందడుగు పడిందన్నారు. ములుగు జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, క్యాబినెట్ సహచరులందరికీ ములుగు జిల్లా ప్రజల పక్షాన మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు

# ప్రభుత్వం, ప్రజల సంయుక్త కృషి అవసరం

### పిసిబి కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యావరణాన్ని పరిరక్షించుకొని భవిష్యత్ ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత మన అందరిపై ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యావత్ ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్ మహమ్మారి నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం, ప్రజలు సంయుక్త కృషి అవసరం అని ఆమె అభిప్రాయపడ్డారు. పిసిబి కార్యాలయంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యాక్రమానికి మంత్రి కొండాసురేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనం అందరం కలిసి మన పర్యావరణాన్ని రక్షించుకోవాలి, సంరక్షించుకోవాలనే బాధ్యతను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఇదొక విప్లవాత్మకమైన చర్యగా తాను అభివర్ణిస్తున్నానని చెప్పారు. ఈ ఏడాది ప్లాస్టిక్ కాలుష్యాన్ని ప్రపంచవ్యాప్తంగా అంతం చేయడం అనే థీమ్‌తో ఈ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. ఈ రోజు మన రాష్ట్రం, దేశమే కాకుండా యావత్ ప్రపంచమంతా ప్లాస్టిక్ సమస్యను పెద్ద ఎత్తున ఎదుర్కొంటున్నదన్నారు. అందుచేత ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనవైపు మనమంతా దృష్టిసారించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్లాస్టిక్ అనేది సులభంగా కుళ్ళిపోయే పదార్థం కాదని మన అందరికీ తెలిసిందే అని అది వందల, వేల సంవత్సరాలపాటు మన మట్టి, నదులు, సముద్రాలలో ఉండిపోతూ తీవ్ర నష్టం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భూమి మీద ఉన్న వనరుల్లోకి విష పదార్థాలను విడుదల చేస్తూ సమస్త జీవరాశులకు పెను ముప్పుగా మారుతోందని వాపోయారు. భారతదేశం ప్రతి సంవత్సరం సుమారు 12.65 కోట్ల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తోందని నిపుణులు చెబుతున్నారన్నారు. ప్రతి నిమిషం ప్రపంచవ్యాప్తంగా సుమారు 20 లక్షల సింగిల్‌యూస్ ప్లాస్టిక్ సంచులు పంపిణీ అవుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. నిమిషానికి 10 లక్షల ప్లాస్టిక్ బాటిళ్లు కొనుగోలు అవుతున్నాయని, 2026 నాటికి ఈ సంఖ్య 50 కోట్లకు పైగా ఉంటుందని మన పర్యావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం 80 లక్షల నుంచి 120 లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లోకి చేరుతోందని, ఇది ప్రపంచ తీర ప్రాంతాలను అనేక వ్యర్థాలతో కప్పేసేంత ప్రమాదం ఉందన్నారు. 91శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు రీసైకిల్ కావడంలేదని అన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ సంస్థలు, సామాజిక సంస్థలు అందరూ కలిసి ఆదర్శవంతంగా పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించాలని మంత్రి సురేఖ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిబి మెంబర్ సెక్రటరీ రవి గూగులోత్, పిసిబి బోర్డు మెంబర్లు సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మి, జయదేవ్, పిసిబి ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బతుకమ్మ కుంట పనులు చేసేందుకు

# హైడ్రాకు అనుమతి

### ముంపు నివారణ పనులు కొనసాగించొచ్చు – హైకోర్టు ఉత్తర్వులు



**ప్రజాపక్షం/హైదరాబాద్**

వర్షాకాలంలో వరద ముంపునకు గురికాకుండా బతుకమ్మకుంట పునరుద్ధరణలో భాగంగా అవసరమైన పనులను చేయడానికి హైడ్రాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. బతుకమ్మకుంట స్థలానికి సంబంధించి ప్రైవేటు వ్యక్తులు హక్కుల వివాదంపై సివిల్ కోర్టులో ఇంజంక్షన్ పిటిషన్‌పై తేలే దాకా యథాతథస్థితిని కొనసాగించాలన్న గత ఉత్తర్వులను సవరించింది. హైదరాబాద్ బాగ్ అంబర్‌పేట సర్వే నెం.563/1లోని 7 ఎకరాలకు సంబంధించిన స్థలంపై మే 5న ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులను సవరించాలని కోరుతూ హైడ్రా వేసిన వ్యాజ్యంపై జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ ఇటీవల విచారించింది. హైడ్రా తరపు అడ్వకేట్ కె. పవన్‌కుమార్ వాదిస్తూ, బతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఆక్రమణదారులు చెరువులో అక్రమంగా డంపింగ్ చేస్తూ చెరువును కబ్జా చేస్తున్నారన్నారు. ఎ.సుధాకర్‌రెడ్డి మరో ఆరుగురు బాగ్ అంబర్‌పేటలోని 7 ఎకరాల భూమిపై హక్కుల కోసం హైకోర్టును ఆశ్రయించగా సింగిల్ జడ్జి పిటిషన్ కొట్టివేశారన్నారు. తిరిగి అప్పీలు దాఖలు చేయగా హక్కులకు సంబంధించిన వివాదాలను హైకోర్టు తేల్చదని, సివిల్ కోర్టులో తేల్చుకోవాలని, అవసరమైతే ఇంజంక్షన్ ఉత్తర్వులు తెచ్చుకోవాలని డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిపై ప్రైవేటు వ్యక్తులు సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేశారని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి ఇంజంక్షన్ దరఖాస్తు తేలే దాకా యథాతథస్థితి కొనసాగించాలంటూ మే 7న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ప్రస్తుతం వర్షాకాలం వస్తోందని, ఇప్పుడు పనులు పూర్తిచేయకపోతే పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతాయని, మధ్యంతర ఉత్తర్వులను సవరించని పక్షంలో పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుందన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం స్టేటస్ కో కొనసాగించాలని, అయితే వర్షాకాలంలో కాలనీలు ముంపునకు గురవుతాయన్న హైడ్రా వాదనను పరిగణనలోకి తీసుకుని ముంపు నివారణ పనులు చేపట్టడానికి అనుమతిస్తూ గత ఉత్తర్వులను సవరించింది.

## లీగ్ మ్యాచ్ సెలక్ట్ కమిటీని కొనసాగించండి

### హెచ్‌సిఎకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లోని క్రికెట్ సెలక్షన్ కమిటీ, లీగ్ మ్యాచ్‌ల పర్యవేక్షణ కమిటీలను కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలోని సింగిల్ మెంబర్ కమిటీ నియమించిన క్రికెట్ సెలక్షన్ కమిటీలు, లీగ్ మ్యాచ్‌ల పర్యవేక్షణకు హైకోర్టు ఏర్పాటు చేసిన హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ నవీన్‌రావు సారధ్యంలోని సూపర్‌వైజరీ కమిటీలను కొనసాగించాలంది. తాము తిరిగి ఆదేశాలు జారీ చేసే వరకు ఆ కమిటీలను కొనసాగించాలని హెచ్‌సిఏను ఆదేశించింది. హెచ్‌సీఏ జనరల్‌బాడీ మీటింగ్ (ఏజీఎం)లో నిర్ణయాలు తీసుకునే వరకు ఆ కమిటీలను కొనసాగింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని జై హనుమాన్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్ను విచారించిన న్యాయమూర్తి పైవిధంగా మధ్యంతర ఆదేశాలు ఇచ్చారు. 2025–26 కాలంలో నిర్వహించబోయే లీగ్ మ్యాచ్‌లను హెచ్‌సీఏ నిబంధనలు, సూపర్‌వైజరీ కమిటీ నివేదిక మేరకు వ్యవహరించేలా హెచ్‌సీఏను ఆదేశించాలని పిటిషనర్ న్యాయవాది వాదించారు. సెలక్షన్ కమిటీలను, సూపర్‌వైజరీ కమిటీలను తొలగిస్తే హెచ్‌సీఏ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోడానికి వీలుంటుందన్నారు ఏజీఎంలో నిర్ణయాలు తీసుకునే వరకు ఆ కమిటీలను కొనసాగింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.. వాదనల తర్వాత హైకోర్టు, హెచ్‌సీఏ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఆ కమిటీలను కొనసాగించాలని హెచ్‌సీఏను ఆదేశించింది. విచారణను ఈనెల 11కి వాయిదా వేసింది.

## అవినీతికి తావులేకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** అవినీతికి తావులేకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన మండల ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్‌తో కలిసి ఎ మ్మెల్యే కడియం ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు ప త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీ హరి మాట్లాడుతూ నియోజకవర్గంలో 90శాతం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయని, ఎక్కడా అవినీతి లేకుండా లబ్దిదారుల ఎంపిక జరిగిందని ఇందుకు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, గ్రామ, మండల నాయకులకు అభినందనలు తెలిపారు. గ్రామాలలో అందరి సమన్వయం చేసుకుని సమిష్టి నిర్ణయంతో లబ్దిదారుల ఎంపిక జరుగాలన్నారు. ఎక్కడా, ఎవరికి లంచం ఇవ్వొద్దని సూచించారు. ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారికి అవకాశాలు వస్తాయన్నారు. అందరినీ క లుపుకొని సమన్వయం చేసుకోవాలని సూచించారు. మనమందరం కలిసి నియోజకవర్గంలో, మండలంలో, గ్రామంలో పార్టీ ని బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు మార్కెట్ చై ర్మన్ లావణ్యారెడ్డి, వైస్ చైర్మన్ ఐలయ్య, పిఏసిఎస్ చైర్మన్ కరుణాకర్‌రావు, ఆర్‌డిఓ వెంకన్న, తహసీల్దార్ శంకరయ్య, ఎంపి డిఓ సుమన్, ఇతర అధికారులు, ప్ర జాప్రతినిధులు, నాయకు లు, కార్యకర్తలు, లబ్దిదారులు, మహిళలు,పాల్గొన్నారు.

## సమాజానికి దిక్సూచి జర్నలిజమే

### కెయు జర్నలిజం విభాగం అధ్యాపకుడు కంజర్ల నర్సింహరాములు

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** సమాజానికి దిక్సూచి జర్నలిజమేనని జర్నలిజం వృత్తి ఏంతో బాధ్యతాయుతమైనదని కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్, రాజకీయ విశ్లేషకులు తిరునహరి శేషు అన్నారు. సీనియర్ జర్నలిస్టులు జక్కుల విజయ్ కుమార్, జన నిర్ణయం ఎడిటర్ దామెర రాజేందర్ కోఆర్డినేటర్లుగా నిర్వహించిన జర్నలిస్టుల శిక్షణా శిబిరం వరంగల్ నగరంలోని కాశీబుగ్గ స్కాలర్స్ పబ్లిక్ స్కూల్ జరిగింది. ఈ సందర్భంగా తిరునహరి శేషు హాజరై ప్రా రంభోపన్యాసం చేశారు. పాలకులకు, ప్రజలకు వారధిగా పత్రికలు ఉండే క్ర మంలో జర్నలిస్టులు బాధ్యతతో ముందుకు సాగాలని అన్నారు. సమాజంలో మరుగనపడ్డ సమస్యలను, వివిధ అంశాలను వెలికితీయడంలో జర్నలిస్టు తమదైన శైలిలో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. సోషల్ మీ డియా ప్రభావం పేరుగుతున్న నేపథ్యంలో నేటితరం జర్నలిస్టులు మరింత అప్రమత్తంగా ఉండటంతోపాటు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి శిక్షణా శిబిరాలు భవిష్యత్తులో కొనసాగించాలని అన్నారు. నిర్వాహకులను అభినందించారు.

## గోసంరక్షణ చట్టం అమలును వివరించండి

### రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో గోవధ నిరోధక, జంతు సంరక్షణ చట్టం అమలుపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. గోవధ నిషేధ చట్టం అమలు చర్యలపై కౌంటర్లు దాఖలు చేయాలంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈనెల 18వ తేదీకి వాయిదా వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ గోవధ నిరోధక, జంతు సంరక్షణ చట్టాన్ని అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ వరల్ హిందూ ఫెడరేషన్ ఇండియా తరఫున జాతీయ అధ్యక్షుడు ఆషూ మోంగియా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.శరత్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈనెల 7న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమంగా గోమాంసం రవాణా చేసే అవకాశం ఉందన్నారు. గోసంరక్షణ చట్టాన్ని అమలుకు చర్యలు తీసుకోవాలంలూ అధికారులకు మూడు వినతి పత్రాలు సమర్పించామని, వాటిపై చర్య తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. గతంలో హైకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టి జారీ చేసిన ఉత్తర్వులను అమలు కావడం లేదన్నారు. అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తున్నామని, పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయడానికి గడువు కావాలని కోరడంతో న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను ఈనెల 18కి వాయిదా వేశారు.

## అవి పత్రికల గొంతు నొక్కే ఉత్తర్వులు

### కింది కోర్టు ఆర్డర్‌ను రద్దు చేసిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పత్రికల గొంతు నొక్కేలా ఎలాంటి ఆదేశాలు ఇవ్వడం చెల్లదని హైకోర్టు తీర్పు వెలువరించింది జాతీయ భద్రతతో పాటు ఇతర కొన్ని ప్రమాదకరమైన సందర్భాల్లో మాత్రమే గ్యాగ్ ఆర్డర్లకు ఆస్కారం ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేసింది. 2022లో తొలి వెలుగు వెబ్‌సైట్, యూట్యూబ్ చానల్‌పై ట్రయల్‌కోర్టు ఇచ్చిన గ్యాగ్ ఉత్తర్వును రద్దు చేసింది. వెబ్‌సైట్‌లో వీడియోలు, చిత్రాలను, నివేదికలు, ప్రచురణలు, వ్యంగ్య చిత్రాలు ప్రచురించడాన్ని, ప్రసారం చేయడాన్ని నిలిపివేయాలని కోరుతూ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ కూకట్‌పల్లి కోర్టులో కేసు వేసింది. ఇందుకు అనుకూలంగా కింది కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2022, డిసెబర్ 2న కూకట్‌పల్లి కోర్టు ఇచ్చిన ఈ గ్యాగ్ అర్డర్‌ను సవాల్ చేస్తూ వెబ్‌సైట్, యూట్యూబ్ నిర్వాహకులు హైకోర్టులో సవాల్ చేసిన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ పీ శ్రీసుధలతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల తీర్పు చెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ), 19(1)(జీ)లకు వ్యతిరేకంగా కింది కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని పిటిషనర్ల వాదన.

## రాణాలో ఆటో డ్రైవర్ మృతిపై డిజిపికి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల రాజేంద్రనగర్ పిఎస్‌లో ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటనను జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సి) సుమోటోగా తీసుకుంది. దీంతో రాష్ట్ర డిజిపి జితేందర్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు ఇచ్చింది. గత నెల 13 రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వేధింపుల వల్లే మరణించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో మీడియాలో వచ్చిన కథనాలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్‌సి.. గురువారం రాష్ట్ర డిజిపికి నోటీసులు ఇచ్చింది. ఆటో డ్రైవర్ మృతిపై రెండు వారాల్లో విచారణ చేసి పూర్తి నివేదికను ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది.



## హెచ్‌ఎండిఎలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వన మహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని 2025–26 సంవత్సరంలో 450లక్షల మొక్కలు నాటడానికి హెచ్‌ఎండిఎ సన్నాహాలు చేస్తోంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, అర్బన్ ఫారెస్ట్రీ, హెచ్‌ఎండిఎ ఓఆర్‌ఆర్ సమీపంలోని తుక్కుగూడలోని పడమటికాచ రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్, సంజీవైష్ పార్క్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. హెచ్‌ఎండిఎ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ కె. శ్రీనివాస్, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. శ్రీనగర్ క్లస్టర్‌లోని పండమటికాంచ ఫారెస్ట్ బ్లాక్‌లో, గత రెండు సంవత్సరాల నుండి, 2023–24లో భారీ బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టి 2లక్షల మొక్కలు, 2024–25లో 3.50లక్షల మొక్కలు నాటారు. ఈ సంవత్సరం 2025 నాటడం సీజన్లో 2 లక్షల మొక్కలు నాటాలని ప్రతిపాదించారు. వన మహోత్సవం కార్యక్రమం ద్వారా నేరేడు, చింత, సీమచింత, ఉసిరి, తాని, మారేడు, వెల్గ వంటి పండ్లను కొట్టే జాతులను నాటడం ద్వారా జీవవైవిధ్యాన్ని పెంపొందిస్తుమన్నారు. జిట్రేగి, యెర్ర చందనం, యెగిస, నరేప, వేప వంటి కలప జాతులు. పుసుగు, సోమి, బుద్ద దారైమిం, తెల్ల మద్ది, బండారు, వెదురు, బట్ట కడిమి వంటి అటవీ జాతుల మొక్కలు నాటామన్నారు.

## లోహ విజ్ఞానంపై అద్భుత గ్రంథం

# ‘ఫూట్జ్ ద ఫార్గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్’

### ఎమ్మెల్సీ మధుసూదనా చారి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోహ విజ్ఞానంపై అద్భుత గ్రంథం ‘ఫూట్జ్ ద ఫార్గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్’ అని శాసనమండలి బిఆర్‌ఎస్ పక్ష నాయకుడు మధుసూదనా చారి ప్రశంసించారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురువారం జాతీయ విశ్వకర్మ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ పెరుందురు జైశంకర్ రాసిన ‘ఫూట్జ్ ద ఫార్గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్’ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎ.పద్మాచారి అధ్యక్షతన జరిగిన ఈ పుస్తక ఆవిష్కరణ సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధుసూదనాచారి మాట్లాడుతూ సాంస్కృతికంగా, చారిత్రకంగా ఉన్నత చరిత్ర కలిగి ఉన్న తెలంగాణలో అత్యంత నాణ్యమైన ఉక్కు లోహం కూడా ఉత్పత్తి చేసేదని ఆధారాలతో సహా రూపొందించిన ‘ఫూట్జ్ ద ఫార్గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్’ పుస్తకం మంచి పరిశోధనా గ్రంథంగా ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణాలో ఉక్కు లోహానికి సంబంధించిన అనేక అంశాలను తెలియ చేసే ఈ పుస్తకం మెటల్స్‌పై పరిశోధన చేసే స్కాలర్స్‌కు, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ, ప్రస్తుత నిచ్చెనమెట్ల సమాజంలో అద్భుత కళాకారులుగా, నిర్మాణ ప్రతిభ వున్నా విశ్వబ్రాహ్మలు శూద్రులుగా విభజించబడి అణగారిన కులాలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజానికి నాగరికత నేర్పిన విశ్వబ్రాహ్మణుల గొప్పతనంపై ఈ గ్రంథంలో అద్భుతంగా పేర్కొన్నారని అన్నారు. అంతకు ముందు గ్రంథ రచయిత పెరంబుదూరు జైకిసాన్ తెలంగాణాలో ఉక్కు లోహ పరిశ్రమ పరిణామంపై వివరించారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రామణ సంగం రాష్ట్ర అధ్యక్షులు వేములవాడ మదన్ మోహన్, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ, హైదరాబాద్ డిఆర్‌ఓ వెంకటా చారి, రాజేందర్ రెడ్డి, వి. రఘునాథ్, రఘువీర్ ప్రతాప్, పెండోట శ్రీను, తంగెళ్ల పల్లి రవికుమార్, కిరణ్ కుమార్,బుద్దారం సుధాకర్,శాంతి కృష్ణ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకి, ప్రభుత్వానికి వారధిగా పార్టీ శ్రేణులు

### టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్టీకి, ప్రభుత్వానికి నాయకులు, కార్యకర్తలు వారధిగా పనిచేయాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో వరంగల్, మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ఎంపి కడియం కావ్య, ఎంఎల్‌సి, ఎంఎల్‌ఏలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కమిటీల ఆలస్యంతో కార్యకర్తల్లో నైరాశ్యం చెందిన మాట వాస్తవమన్నారు. త్వరలోనే అర్హతల ప్రకారం పదవులకు ఎంపిక చేస్తామని తెలిపారు. 17 నెలల పాలనలో ఎమ్మెల్యేలు తమ పనితీరును బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేలపై ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు. మీనాక్షి నటరాజన్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

చురుకైన నాయకులను పరిశీలకులతో గుర్తించి, తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకేళ్లే బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలతో అనుసంధానంగా పని చేయాలని సూచించారు. సీనియర్, జూనియర్‌లతో సమన్వయంతో పని చేయాలన్నారు. కుల సర్వే, ఎస్‌సి వర్గీకరణ, సన్న బియ్యం, భూ భారతి పట్ల ప్రజల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. దేశాన్ని ఆశ్చర్యపరిచే విధంగా పథకాల అమలు జరుగుతుందని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

# రైతన్న చూపు ‘పత్తిసాగు’ వైపు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** పత్తి సాగువైపు రైతన్నలు చూస్తున్నారు. గతం కంటే కనీసం మద్దతు ధరను ప్ర భుత్వం పెంచడంతో రైతుల్లో పత్తి సాగు చేయాలనే ఆ శలు చిగురిస్తున్నాయి. రానున్న ఖరీఫ్ సీజన్‌లో వ్యవసా య అనుకూల వాతావరణం ఉందనే వార్తలు రావడంతో రైతులు పత్తిసాగుకు ఉపక్రమిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే భూముల్లో వేసవి దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ వాతవరణానికి సంబంధించి అనువైన విత్తనాలను కూడా ఎంపిక చేసుకునే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. వ్యవసాయ అధికారులు సైతం భూ సార పరీక్షలు చేసేందుకు సిద్ధపడుతున్నారు.

**పత్తికి పెరిగిన ధర:** ప్రభుత్వం ఈ ఏడాది వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించింది. కొత్త మద్ద తు ధర ప్రకారం పత్తి సాధారణ రకం క్వింటాకు రూ.77 10 కాగా మేలు రకం క్వింటాకు రూ.8110 పెంచింది. గతంలో ఈ ధరలు, రూ.7121, రూ.7521గా ఉంది. పత్తితో పాటు జొన్నలు, రాగి, శనగపప్పు, ఎర్ర కందిపప్పు, ఆవాలు తదితరాలకు కూడా కేంద్రం కనీసం మద్ద తు ధర ప్రకటించింది. పత్తికి మంచి ధరే ఉండటంతో రై తులు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

**సుమారు 5 లక్షల ఎకరాలు:** ఈ ఖరీఫ్ సీజన్లో రుతుపవనాల రాక ఆశాజనకంగా ఉండటంతో ఉమ్మడి జిల్లా వ్యా ప్తంగా ఉన్న రైతాంగం కనీసం 5 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేసేదుకు సిద్ధపడుతున్నట్లు వ్యవసాయాధికారు లు అంచనాలు వేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జి ల్లాలో 2లక్షల 60వేల ఎకరాలు, ఖమ్మం జిలాల్లో స మారు 2లక్షల 40వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తంగా రెండు జిలాల్లకు క లిపి 10 లక్షల ప్యాకెట్ల విత్తనాలు అవసరమ్యే అవకాశం ఉండగా, ఇప్పటికే డీలర్ల వద్దకు స్టాకు చేరుకుంది. కాగా విత్తనాల కొరత ఎక్కడా రాకుండా వ్యవసాయాధికారు లు చర్యలు చేపట్టారు. కాగా గత ఏడాది కంటే కొద్దిగా విత్తనాల ధర పెరిగింది.

**నఖిలీలపై నిఘా:** పత్తి వ్యవసాయం సీజనల్లో పెద్ద ఎత్తున నఖిలీ విత్తనాలు రాజ్యమేలే అవకాశం ఉండటంతో జిల్లా వ్యాప్తంగా టాస్క్ ఫోర్సు టీంలు రంగంలోనికి దిగాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో దుకాణాలను సైతం తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లోకి నఖిలీ విత్తనాలు అంటగట్టేందుకు కేటుగాళ్లు వచ్చే అవకాశం ఉందని, వారి మాయ మాటలకు మోసపోకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలని ప్రచారం చేస్తున్నారు.

## మాగంటి గోపినాథ్‌కు గుండెపోటు

### ఎఐజి ఆసుపత్రిలో చికిత్స

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏ మాగంటి గోపినాథ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుకు గురయ్యారు. సకాలంలో కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఎఐజి ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రథమ చికిత్స అనంతరం ఆయన్ని ఐసియు వార్డుకు తరలించారు. ఇక్కడ ఆయన్ని 48 గంటల పాటు అబ్జర్వేషన్‌లో పెట్టామని వైద్యులు ప్రకటించారు. అయితే ఆయన వెంటీలేటర్‌పై చికిత్స పొందుతున్నారని, ప్రస్తుతం చికిత్సకు స్పందిస్తున్నారని ఆయన బంధువులు పేర్కొన్నారు. ఆయన అనారోగ్యంపై వస్తున్న వందతులను వారు కొట్టిపారేశారు. గోపీనాథ్‌కు ఐసీయూలో 48 గంటల అబ్జర్వేషన్ కొనసాగుతోందని, ఆయన చనిపోయారంటూ వస్తున్న వార్తలు అసత్యం అన్నారు. దయచేసి అలాంటి వదంతులను ప్రచారం చేయవద్దని మీడియా మిత్రులను వారు కోరారు. మరోవైపు గోపీనాథ్ అనారోగ్య పరిస్థితి తెలుసుకున్న బిఆర్‌ఎస్ నేతలు భారీ ఎత్తున ఆసుపత్రికి తరలివచ్చారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏ హరీష్ రావు, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, కెపి వివేకానంద, ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్ తదితరులు ఆసుపత్రికి చేరుకొని గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అమెరికాలో ఉన్న కెటిఆర్ కూడా గోపినాథ్ ఆరోగ్యంపై ఆరా తీశారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడులు



ప్రజాపక్షం/నర్వః వికాసిత కృషి సంకల్ప అభినయ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పాతర్చేడ్ గ్రామ రైతువేదికలో ఎంఏఓ అలేఖ్యరెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఆర్ డి ప్రసాద్ సురేష్ కెవికె మదనపురం సైంటిస్ట్ డిఆర్ రాజేందర్ రెడ్డి లు కలిసి రైతులకు నూనె గింజల పంటల యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అలాగే అముదంలో వచ్చిన కొత్త టెక్నాలజీ గురించి వివరించారు. రైతులు ఎప్పుడూ ఒకే పంటలు వేయడంతో చాల నష్టపోతరని పంట మార్పిడి చేయడం వల్ల అధిక దిగబడులు సాధించవచ్చన్నారు.రైతులకు ఐసిహెచ్5 అనే అముదం రకం విత్తనాలిచ్చారు.గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

ప్రజాపక్షం/జడ్చర్ల : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డా॥ బూర్గుల రామకృష్ణా రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల వృక్ష శాస్త్ర విభాగం, ఎన్‌సిసి యూనిట్ 3 సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ బోటానికల్ గార్డెన్ లో మొక్కలు నాటారు. నిత్యావసరాల కోసం ప్లాస్టిక్ ను విరివిగా వాడుతున్నాడు. అలా వాడటం వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా మానవాళికి కూడా నష్టం జరుగుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా॥ డి. నర్మద పేర్కొన్నారు.ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలంటే కార్యాచరణ ప్రతి ఇంటి నుండి మొదలవ్వాలన్నారు. తెలంగాణ బోటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా॥ బి. సదాశివయ్య మాట్లాడుతూఏ ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, తిరిగివాడటం,తిరిగి మార్పు చేయడం వల్ల ప్లాస్టిక్ ను మెల్లమెల్లగా పారద్రోలవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటడమే ప్రధాన కర్తవ్యం అని ఆయన తెలిపారు. నిత్య అవసరాల కోసం జూట్ బ్యాగులను ఉపయోగించాలని ప్లాస్టిక్ పాడకాన్ని తగ్గించాలని అప్పుడే మనము ఈ పర్యావరణాన్ని కాపాడుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యపకులు లత, పరిశోధక విద్యార్థులు రమాదేవి, రాహూల్, వాలంటీర్లు రవి, భరత్, పూర్వ విద్యార్థిని అనిత తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల సమస్యలు పట్టవా?

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిఃజిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని రాజు హెచ్చరించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ శంభుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తరగతి గదులను శుభ్రం చేయించాలని విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు, శ్రీను, రాజేష్, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారం



ప్రజాపక్షం/ నర్వ : భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్థానిక తహసిల్దార్ మల్లారెడ్డి అన్నారు. మండలంలో గురువారం ఉండేకోడ్ రైతు వేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పాస్ బుక్కు సమస్యలు రీ సర్వే, ముటేషన్ కు 16 దరఖాస్తు వచ్చినప్పుడు తాసిల్దార్ మల్లారెడ్డి తెలిపారు. రైతులకు పలు సూచనలు, సలహాలను చేసారు. డాక్యుమెంట్లు లేని వారు, పూర్వం తప్పులు పడిన వాటికి సంబంధించినవి సరైన డాక్యుమెంట్లు జతపరచి సరిచేసుకోవాలని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, జూనియర్ అసిస్టెంట్ బాలరాజు, ఆంజనేయులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పర్యావరణ దినోత్సవం



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని, మహబూబ్‌నగర్ జిల్లా యెనుగొండ గురువారం తన నివాసంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఖజానాదారు శాంతి కుమార్ మామిడి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి పౌరుడి సహకారం అవసరమని తెలిపారు.

## ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత



ప్రజాపక్షం/నారాయణపేట్ః ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి సూచించారు. నారాయణపేట నియోజకవర్గం కోయిలకొండ మండలం కోత్లాబాద్‌లో శ్రీ అయ్యప్పస్వామి వారి జీవిత చరిత్ర వీధి నాటకాన్ని నిర్వహించారు. కళాకారులను, సాంకేతిక నిపుణులను రాజ్ కుమార్ రెడ్డి సత్కరించారు. అనంతరం రాజ్ కుమార్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులను నిర్వాహకులు సన్మానించారు. వీధినాటకఉపాధ్యాయులు కతల్ అహ్మద్, హార్మోనిస్టులు బి.మాధవుల, రాజన్న, నారాయణ, లక్ష్మన్న, ఖాజన్న, అంజిలయ్య, సందుల అంజిలయ్య, రాజు, వెంకటయ్య, కళాకారులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు, ఫౌండేషన్ సభ్యులు, గడ్డం తప్పిన్న, మధుసూదన్ రెడ్డి నర్సింహనాయుడు, హన్మంతు ముదిరాజ్, శివరాజ్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పరికరాలు

ప్రజాపక్షం/నారాయణపేట్ః 40% వైకల్యం కలిగిన దివ్యాంగులకు చదువుతో సంబంధం లేకుండా వారి అవసరాన్ని బట్టి ఉచితంగా పరికరాలు ఇవ్వాలని గత పది సంవత్సరాల నుండి వికలాంగుల సంఘాలు ఉద్యమాలు చేసిన అప్పటి బిఆర్ఎస్ పట్టించుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలలో భాగంగా జీవో 89ని అమలు చేయాలని మంత్రి సీతక్క దృష్టికి వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తీసుకెళ్లారు. జివో అమలులోకి రావడంతో తొమ్మిది రకాల దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాలను పొందే అవకాశం కలిగిందని వికలాంగుల రాజ్యాధికార సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిజ్వార్ నగేష్‌గౌడ్ అన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం



ప్రజాపక్షం/ నారాయణపేట్ః జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, ప్రధాన న్యామూర్తి బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ సంస్థ వింధ్య నాయక్ గురువారం నారాయణపేట్ టౌన్ సఖి సెంటర్ లో వరల్డ్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ వింధ్య నాయక్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మెరుగైన జీవితం కోసం ఆరోగ్యంగా ఉండడం తప్పనిసరి అన్నారు.ఇళ్లలో లెడ్ లైట్ల వాడకం పెరగాలి.ప్లాస్టిక్ రీసైక్లింగ్ పక్కాగా అమలవ్వాలి. అడవుల్ని పెంచాలి, చెట్లను నరికేవాళ్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మనము చెట్లను పెంచితేనే వాతావరణం పరిపుష్టంగా ఉండి మన జీవన ఆయు ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. సఖి సెంటర్ ఆవరణలో న్యాయమూర్తి , ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాద్ చెట్లను నాటారు. నందు నామాజీ సీనియర్ అడ్వకేట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ కే.లక్ష్మీపతిగౌడ్, ఎన్. నాగేశ్వరి,అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, కే. సురేష్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుపతయ్య, ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాద్, పాల్గొన్నారు. షీటీం, భరోసా సెంటర్ వాళ్లు, పారా లిగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు స్ప్రింక్లర్లసెట్లు పంపిణీ

ప్రజాపక్షం/బిజినేపల్లి : మండలపరిధిలోని వెల్గొండ పోలేపల్లి గ్రామాలకు చెందినస్ప్రింక్లర్లయూనిట్లను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనక్యాంపు కార్యాలయంలో గురువారం అర్హులైన రైతులకు 14యూనిట్లను పంపిణీచేశారు.ఆయన మాట్లాడుతూ మండలపరిధిలోని పోలేపల్లి గ్రామాలలోని 14మందిరైతులకు స్ప్రింక్లర్లను పంపిణీచేసి వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. రైతన్నలు ప్రజాప్రభుత్వంలో రైతన్నలకు వచ్చే ప్రతి సబ్సిడి యంత్రాలతోపాటు విత్తనాలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటిచైర్మన్ రమణరావు, వ్యవసాయమార్కెట్ కమిటి డైరెక్టర్ ఎండి నజీర్, వెంకట్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రజలదే కీలకపాత్ర

### నాగర్‌కర్నూలు కలెక్టర్ బదావత్ సంతోష్





ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ పురపాలక సంఘం, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధ్యక్షతన ఒకమార్పు అభివృద్ధికి మలుపు స్వచ్ఛతపై తొలిఅడుగు అనే నినాదంతో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిఓ కార్యాలయంనుంచి అంబేద్కర్ చౌరస్తావరకు ర్యాలీ సాగింది.కలెక్టర్ మాట్లాడుతూచెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో వచ్చేతరం ఆక్సిజన్ పెట్టుకునేస్థాయికి వస్తుందని ప్రతి ఒక్కరు మొక్కలునాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. ప్రతి ఒక్కరు చెట్టును నాటి సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతిఒక్కరుజూట్‌బ్యాగులనువాడాలన్నారు. మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు, పొల్యూషన్‌బోర్డు కంట్రోల్ అధికారి దివ్య, మెప్మా మేనేజర్ సోఫియా, వివిధశాఖల అధికారులు స్వయం సహాయక మహిళా సంఘాలు పాల్గొన్నారు.

### రైస్‌మిల్లులు తనిఖీ

కల్వకుర్తి పట్టణంలో గురువారం శ్రీసద్గురు రాఘవేంద్ర పారాబైల్డ్ రైస్‌మిల్‌ను కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లుకు రోజు ఎంత ధాన్యం చేరుతుందని, రోజు ఎంతమొత్తంలో వచ్చిన వరిధాన్యాన్ని బియ్యంగా మారుస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మిల్లులో ఉన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్‌రైస్‌ను పెండింగ్‌లేకుండా ఎఫ్‌సిఐకి తరలించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్‌చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు తదితర అంశాలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఇప్పటికే 90శాతానికిపైగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన ధాన్యం నిల్వలనుకూడా సకాలంలో దిగుమతి చేసుకొని సామర్థ్యంమేరకు పూర్తిస్థాయిలో మిల్లింగ్ ప్రక్రియను చేయాలని ఆదేశించారు. మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. మిల్లులవద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి ఆర్‌డిఓ శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం, మిల్లు యజమాని రమేష్ ఉన్నారు.

## భూభారతితో సమస్యలకు శాశ్వత పరిష్కారం



ప్రజాపక్షం/బిజినేపల్లి : భూములపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విభిన్నదిశలో అడుగులు పడుతున్నాయని నాగర్‌కర్నూల్ ఆర్‌డిఓ సురేష్ అన్నారు. మండలంలో గురువారం, కారుకొండలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూసమస్యల శాశ్వత పరిష్కారంకోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న భూభారతిచట్టం అమల్లోభాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో ప్రతిరైతు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ సిహెచ్‌రవికుమార్, రెవెన్యూ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ భారతిభాయ్, జూనియర్ అసిస్టెంట్ తేజస్విని, కాంగ్రెస్‌పార్టీమైనార్టీ జిల్లావైస్‌చైర్మన్ ఖలీల్, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రావు, మాజీసర్పంచ్ బాలరాజు, బాలురాజు, శ్రీను, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నేడు కుమ్మెరలో సిపిఐ మహాసభ



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లి, పుల్జాల గ్రామాలలో గ్రామ శాఖ సమావేశాలను నిర్వహించారు. మర్యాద వెంకటయ్య, ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ పిడికిలిబిగించి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని అనేక త్యాగాలు చేసినపార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ నాగర్‌కర్నూల్ 18వ మహాసభను విజయవంతం చేయాలన్నారు. గగ్గలపల్లి సిపిఐగ్రామశాఖ నాయకులు రామకృష్ణ, రాముడు, పులిజాల గ్రామశాఖ వెంకటయ్య, బుచ్చన్నగౌడ్, రమేష్, వెంకటమ్మ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రజాపక్షం /వనపర్తి టౌన్ : మన చుట్టూ ఉండే పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పర్యావరణ పరిరక్షణలో ఆటవీ శాఖ ఆధ్వర్యంలో ఏకో పార్క్ దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలోజిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్య అతిథిగా వనపర్తి అదనపు కలెక్టర్ యాదయ్యతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వనపర్తి పట్టణంలోని ఏకో పార్క్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఎస్పీ మాట్లాడుతూ అధునాతన విజ్ఞానం విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో మనిషి తన మనుగడకు కావాల్సిన చాలా వాటిని యంత్రాల సహాయం ద్వారా అందిపుచ్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో కర్మాగారాలు ఫ్యాక్టరీలు వాహనాల వల్ల కొంత కాలుష్యం ఏర్పడటం సహజం కాని వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ మార్గాలు ఎన్నో ఉన్నాయి. జిల్లా అదనపు కలెక్టర్ యాదయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఇంటి పరిసర ప్రాంతాలలో కనీసం మూడు మొక్కల నాటి పెద్ద చేయాలని సూచించారు.వనపర్తి అదనపు కలెక్టర్ యాదయ్య, వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అటవీ శాఖ ఫారెస్ట్ రేంజ్ అధికారి నిఖిల్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్ , సీఐ కృష్ణయ్య, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పలనాయుడు, నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు స్నేక్ సొసైటీ సభ్యులు, అటవీ శాఖ అధికారులు , సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాపక్షం/కల్వకుర్తి : మండలపరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి నూతన దేవాలయంలో విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఐక్యతఫౌండేషన్‌చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం దేవాలయంలో ఏర్పాటుచేసిన పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయ నిర్మాణానికి తనవంతుగా రూ.5లక్షలతో పెయింటింగ్ పనులుపూర్తిచేసి దేవాలయ అభివృద్ధికి సహకారం అందజేయడంతో గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీసర్పంచ్ లింగారెడ్డి, సీనియర్ నాయకులు అల్వాల్‌రెడ్డి, శ్రీధర్, పరమేశ్వర్, తిరుపతయ్య, లాలయ్య, బాలస్వామి,లింగం,శ్రీను, మల్లయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం..

### మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధిఃమానవాళి మనుగడకు హాని కలిగించే ప్లాస్టిక్ కాలుష్యాన్నిఅంతం చేద్దాం అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మయూరి పార్క్ వద్ద రహదారి వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించే డ్రైవ్ లో కలెక్టర్ విజయేందిర బోయి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా అధికారులు, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని, ప్లాస్టిక్ వినియోగం అంతం చేయాల్సినఅవసరం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి వెళ్ళడం వల్ల సముద్ర జీవులు మరణిస్తాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయన్నారు. ఇది నేల యొక్క సారవంతతను తగ్గిస్తుంది. నీటి వనరులను కలుషితం చేస్తుందని పేర్కొన్నారు. ఆహార వనరులను కలుషితం చేయడమే కాక ఆహార భద్రతకు ముప్పు కలిగిస్తుందన్నారు.ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణ వ్యవస్థల సామర్థ్యాన్ని తగ్గిస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్లాస్టిక్ సంచులు, బాటిళ్ళు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్నితగ్గించాలనితెలిపారు.పునర్వినియోగం,చేయదగిన వస్తువులను వాడాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సరిగ్గా పారవేసి, రీసైకిల్ చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వం, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన వారికి మెమెంటోలు కలెక్టర్ అందచేశారు. పర్యావరణ కాలుష్య మండలి ద్వారా జూట్ తో తయారు చేసిన బ్యాగ్ లను విద్యార్థులకు పంపిణీ చేశారు. జడ్చర్లకు బి.ఆర్.ఆర్.డిగ్రీ కళాశాల అధ్యాపకులు సదాశివయ్య స్నేక్ పోను విద్యార్థులు తిలకించారు. తొలుత స్టేడియం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్లాస్టిక్ ను నిర్మూలిద్దాం అనే అంశంపై ర్యాలీ నిర్వహించారు. డి.ఎఫ్.ఓ సత్య నారాయణ ప్రారంభించారు. డిఎఫ్ఓ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ డి.పి.ఆర్.ఓ శ్రీనివాస్, ఎల్ .డి.ఎం కల్వ భాస్కర్,పరిశ్రమల శాఖ జిఎం ప్రతాప్ ఉన్నారు.

## రసాయనాల వినియోగం తగ్గించాలి



ప్రజాపక్షం/నారాయణపేట్ః రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం లో భాగంగా నారాయణ పేట మండలం లోని ఎక్లస్పూర్‌లో రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్త డా.జె డి సరిత మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో రసాయనాల వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. వాటి స్థానంలో పచ్చిరొట్ట, వానపములు ఎరువు, జీవన ఎరువులు వాడాలని సూచించారు. నారాయణపేట యం ఏ ఓ,బాల దినకర్, ఏవో, బి.రాజేష్, 50 మందికి పైగా రైతులు హాజరయ్యారు.

## నేడు నవాబుపేటలో విద్యుత్ వేడుక

### ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/ జడ్చర్ల : జడ్చర్ల నియోజకవర్గానికి 21 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లు, మరో 132/33 కేవీ సబ్ స్టేషన్ ను కూడా మంజూరు చేసిందని, ఈ విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఈ సబ్ స్టేషన్ల నిర్మాణాలతో మరో ఇరవై ఏళ్లపాటుజడ్చర్లనియోజకవర్గంలో విద్యుత్ కష్టాలు ఉండవన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి మొదలుకొని 2023లో బీఆర్ఎస్ గద్దె దిగేవరకూ జడ్చర్ల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 35 సబ్ స్టేషన్లు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రూ. 66.50 కోట్లతో 21 కొత్త 33/11కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యా యని తెలిపారు. నవాబుపేట మండలం రుద్రారం, కొండాపూర్,చౌదూర్,జడ్చర్లమండలం నస్రుల్లాబాద్, గొల్లపల్లి, ఆలూ రు, పెద్దపల్లి, నక్కల బండ తాండ జడ్చర్ల పట్టణం గంగాపురం రోడ్డు, క్లబ్ రోడ్డు, మిడ్జిల్ మండలంలోని రాణిపేట్, మున్ననూరు,సింగందొడ్డి లలో భట్టివిక్రమార్కశంకుస్థాపనచేయనున్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాపక్షం / కొత్తకోట: ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి అని అన్నారు. నేడు కొత్తకోట మండలంలో చర్లపల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊరచెరువులో మొసలి సంచారం

ప్రజాపక్షం / వీపనగండ్ల: వీపనగండ్ల గ్రామానికి సమీపంలోని ఊర చెరువులో మొసలి సంచరిస్తూ ఉండటంతో పశువుల కాపర్లు గొర్రెల కాపరులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని నెలలుగా ఊర చెరువులోకి బీమా కాలువ వెంట మొసలి చెరువులోకి వచ్చి చేరి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చెరువు వద్దకు ప్రతినిత్యం గ్రామంలోని పలు మహిళలు బట్టలు ఉతకటానికి, పశువులు గొర్రెలను దప్పిక తీర్చడానికి కాపరులు చెరువు వద్దకు మూగజీవాలను తీసుకువెళ్తుంటారు. ప్రమాదవశాత్తు మొసలి బారిన పడితే పెద్ద ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని, అధికారులు చర్యలు తీసుకొని మొసలిని బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# భూభారతి రెవెన్యూ సదస్సులు సద్వినియోగం

### కలెక్టర్ ఆదర్శ్ సురభి






ప్రజాపక్షం / పెబ్బేరు: భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రజలకు సూచించారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా గురువారం పెబ్బేరు మండలంలోని రంగాపూర్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చారని, ఉదయం నుండి సాయంత్రం వరకు ఉంటారు. ప్రజలు తమ భూ సమస్యలు ఏమున్నా నిర్ణిత ప్రొఫార్మలో పూరించి అధికారులకు ఇవ్వాలని సూచించారు. అధికారులు దరఖాస్తులను పరిసీలించి సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. షెడ్యూలు ప్రకారం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవె న్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీరంగాపురం : భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శ్రీరంగాపూర్ మండలంలోని నాగసానిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సందర్శించారు.

### రికార్డులు సరిగ్గా నిర్వహించాలి

ప్రతి చౌక ధర దుకాణంలో బియ్యం నిల్వలు, లబ్ధిదారులకు ఇచ్చిన బియ్యం తదితర రికార్డులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం శ్రీరంగాపూర్ మండలంలోని నాగసానిపల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

### సొంత ఇంటి కల సాకారం

మొదటి విడతలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తి చేసుకొని లబ్ధిదారులు తమ సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని సూచించారు. నాగసానిపల్లి లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను సందర్శించారు. జిల్లాసివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, ఆర్డీఓ సుబ్రమణ్యం, శ్రీరంగాపూర్ తహసీల్దార్ రాజు, పెబ్బేరు తహసీల్దార్ పి. మురళి, ఆర్ఐ రాధాకృష్ణ, ఇతర సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన శెట్టిపల్లి బంగారి లక్ష్మమ్మ కూతురు పింకి నగేష్‌ల వివాహం గురువారం జరిగింది. ఈవివాహ వేడుకకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ, రైతు సంఘం నాయకులు ఉజ్జిని యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ దేవరకొండ మండల కార్యదర్శి దేపా సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## 2025లోనే కులగణన ప్రారంభించాలి

### బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రం 2027 మార్చిలో కులగణన షెడ్యూల్ ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ షెడ్యూల్‌ను సవరించి 2025 లోనే కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీకి బీసీల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. త్వరలో జరగబోయే తమిళనాడు, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి బీసీల కులగణన అంశాన్ని తీసుకొచ్చిందే కాని బీసీల ప్రయోజనాల కోసం కాదన్నారు. నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే షెడ్యూల్ సవరించి 2025లోనే కులగణన చేపట్టాలన్నారు. ఆలస్యం చేయడం వల్ల విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, కుమ్మరికుంట సుధాకర్, దొనేటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

### ప్రొసీడింగ్ జారీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి

**ప్రజా పక్షం/నల్లగొండటౌన్:** ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 ఫీజు రాయితీ ప్రొసీడింగ్‌ను జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి గురువారం జారీ చేశారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరుతూ డిఇఒ బొల్లారం బిక్షపతికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించి జిల్లా విద్యాధికారి ప్రొసీడింగ్‌ను జారీ చేసిన సందర్భంగా గార్లపాటి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ డిఇఓ ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరం అన్నారు. దీనికి స్పందించిన డిఇఓ,అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు అందించడానికి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం రాయితీని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఏదైనా పాఠశాల యాజమాన్యం వినకపోతే,దానిని తన దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కొరకు టియుడబ్ల్యూజే ( ఐజేయు) నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె నాగయ్య, ఏరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, వంగాల శ్రీనివాసరెడ్డి, దోటి శ్రీనివాస్, జిల్లా యాదయ్య, సుధాకర్, అంజయ్య, తెలగ మల్ల దశరథ, , సమద్, వెంకటేశ్వర్లు, అశోక్, రామకృష్ణ, కృష్ణ, రాంప్రసాద్, సత్యం, సోమ చంద్రశేఖర్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్టు సెంట్రల్, ఎండ్ డివైజ్ యూనిట్లకు సర్వీసింగ్ పూర్తి

### ... త్వరలో క్రస్ట్ గెట్ల ట్రయల్ రన్



**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ముందస్తుగా కృష్ణానదికి వరద వస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కొద్ది రోజుల క్రితం ప్రాజెక్టు అధికారులు రేడియల్ క్రస్ట్ గేట్ల రబ్బర్ సీల్ మరమ్మతు పనులను పూర్తి చేసారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులుకాగా 546 అడుగుల వద్ద 26 రేడియల్ క్రస్ట్ గేట్లు అమర్చి ఉంటాయి. అయితే గురువారం గేట్లను ఎత్తేందుకు వినియోగించే మోటర్లకు సంబంధించిన స్టార్టర్లు, గేర్ బాక్సులు,తదితర యూనిట్లను పరిశీలించివిద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా సక్రమంగా జరుగుతుందా లేదా అని పరిశీలించారు ఆతరువాత 26 రేడియల్ క్రస్ట్ గేట్లను ఆపరేట్ చేసే సెంట్రల్ డివైజ్ యూనిట్, ఎండ్ డివైజ్ యూనిట్ లకు సంబంధించి సర్వీసింగ్, గ్రీజింగ్1 నుంచి 13 క్రస్ట్ గేట్లకు సంబంధించిన పనిని పూర్తి చేశారు.ఆ తర్వాత మిగతా యూనిట్లకు సంబంధించిన పనిని వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. మొత్తం సర్వీసింగ్ పని పూర్తయిన తర్వాత 26 రేడియల్ క్రస్ట్ గేట్లకుసంబంధించి ట్రైల్ రన్ నిర్వస్తామని తెలిపారు.

## నిరుపేదలకు నివాస స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు



### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరస్వామి డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణంలో ఎంతోమంది నిరుపేదలు నివాస స్థలాలు లేకుండా జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దుమ్ భవన్‌లో సిపిఐ నల్లగొండ పట్టణ కమిటీ సమావేశం ముండ్ల ముత్యాలు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పట్టణంలో ఆసరా పింఛన్లు పొందే పోస్ట్ ఆఫీసుల వద్ద కనీసం టెంట్ త్రాగునీటి సౌకర్యం లేకపోవడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రతినెల ఆసరా పింఛన్ పంపిణీ సమయంలో టెంట్, తాగునీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వార్డులలో డ్రైనేజీ పేరిట తొవ్విన రోడ్లకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఇట్టి సమావేశంలో పట్టణ సహాయ కార్యదర్శి వి లెనిన్, ఎస్ కె మదార్, రామచందర్ రాజు, ఆర్ లక్ష్మయ్య, జె విజయ, పులిగిళ్ళ లక్ష్మి, ఎం పార్వతమ్మ, ఎండీ యూసుఫ్, కొండోజు విష్ణు వర్ధనా చారి, ఎం విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** సహజ వనరులను కాపాడుకోవడానికి, అవి కాలుష్యం బారిన పడకుండా ఉండటానికి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వ్యవహర్త పెద్ది నరేందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని నేరడ గ్రామంలో గురువారం చిరు వ్యాపారులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై పాఠశాల ఉపాధ్యాయ బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల పంపిణీ కోసం వాడే ప్లాస్టిక్ కవర్ల వల్ల మానవాళి అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలున్నాయని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే గాలి, నీరు లాంటి సహజ వనరులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పెద్ది పద్మ, నమ్ముల ఆనందకుమార్, షమీమ్‌ఉన్నీసా బేగం, ఎస్ జ్యోతి, కె మౌనిక, జుబీదా, పి రమాదేవి, మాధవి, ఆసియా, కీర్తి పాల్గొన్నారు.



# నిజమైన లబ్ధిదారులకే పథకాలు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రభుత్వం అందించే ప్రతి పథకం నిజమైన లబ్ధిదారులకే చెందాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి లబ్ధిదారులకు అందజేసి మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో మునుగోడు నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ కట్టించిన దాఖలాలు లేవని విమర్శించారు. సొంతింటి కలను నిజం చేసేందుకు మా ప్రభుత్వం ఇందిరమ్మ పేరుతో 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇల్లు అనేది ఇల్లు మాత్రమే కాదని, ఆత్మ గౌరవం పెంచే కార్యక్రమం అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా తయారు చేశామని, ఇందుకుగాను 200 మంది లబ్ధిదారులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి జాబితాను పరిశీలించి జిల్లాస్థాయిలో వచ్చిన జాబితాను 5 ర్యాండం పరిశీలన చేసి లబ్ధిదారుల ను ఎంపిక చేశామన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, చండూర్ ఇంచార్జ్ ఆర్‌డిఓ రమణా రెడ్డి, చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు దోటి నారాయణ, వైస్ చైర్మన్ పాలు వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు,జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, మండల కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయం చేయొద్దు : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిజమైన లబ్ధిదారులు కాకుండా రాజకీయ నాయకులకు ఇచ్చి రాజకీయం చేయొద్దని శాసనమండలి సభ్యులు నెలికంటి సత్యం అన్నారు. సంవత్సరాల తరబడి పూరి గుడిసెలో నివసిస్తున్న వారికి రాష్ట్ర ప్రభు త్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం సంతోషమని అన్నారు. నియోజకవర్గంలో సుమారు పది వేల మంది వరకు నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఇల్లు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. మునుగోడు నియోజకవర్గం పూర్తిగా ఫ్లోరైడ్ ప్రాంతమని ,సుమారు 1500 ఫీట్లు బోరూ వేసినా నీరు పడని పరిస్థితి ఉందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా డిండి,ఎస్ఎల్‌బిసీ, బ్రాహ్మణ వెల్లంల సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే మునుగోడు సస్యశ్యామ లం అవుతుందన్నారు.క్షేత్ర స్థాయిలో మరోసారి పూర్తిగా పరిశీలించి అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. మునుగోడు అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డితో కలిసి పనిచేస్తామని అన్నారు.



## ప్రజల పక్షాన సిపిఐ పోరాటం

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో అట్టడుగు వర్గాల ప్రజల పక్షాన ఎళ్లవేళలా సిపిఐ పోరాడుతుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో ఈ నెల 8న జిల్లా కేంద్రంలో నిర్వహించే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సమానత్వానికి మద్దతు పలుకుతూ,కార్పోరేట్ శక్తుల దోపిడీని వ్యతిరేకిస్తూ సిపిఐ కార్మికుల,కర్షకుల పక్షాన నిలుస్తుందన్నారు. విద్య,ఉపాధి,ఆరోగ్యం రంగాల్లో ప్రజలందరికీ సమానమైన అవకాశాలు ఉండాలని సిపిఐ కోరుకుంటుందన్నారు. ఈ మహాసభలో రాష్ట్ర నాయకులు పాల్గొననున్నట్లు తెలియజేశారు. కార్యకర్తల,నాయకులు సకాలంలో మహాసభకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మామిడి వెంకయ్య,సోమగాని కృష్ణ,జడ వెన్న,చక్రాల స్టాలిన్,మామిడి నర్సయ్య,చెన్నగాని సైదులు,యల్లావుల సురేందర్,చక్రాల వెంకటేశ్వర్లు,గొల్లగోపు వీరేశం,జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి మెరుగైన వైద్యం

### హెల్త్‌క్యాంపును పరిశీలించిన కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం పరిశుభ్రంగా ఉండునని వారి ఆరోగ్య పరిరక్షణ కోసం మున్సిపాలిటి వారు హెల్త్‌క్యాంపు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటిలో పారిశుద్ధ్య విభాగం సిబ్బందికి ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు పరిశీలించి కార్మికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్యాంపులో పరీక్షల అనంతరం ఎవరికి అయిన జబ్బు ఉన్నదని తేలితే వారిని ఆసుపత్రికి పంపించి మెరుగైన వైద్యం అందించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అదేశించారు. వెంటనే ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ నేరుగా ఫోన్ చేసి మున్సిపల్ సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు.ట్రిట్‌మెంట్ విధానాన్ని దగ్గర ఉండి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి పి.రాంబాబు, కమిషనర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, డాక్టర్ మల్సూర్, డాక్టర్ ప్రవలిక, గౌస్ ఎన్ఎస్ఆర్ ప్రసాద్ యాదగిరి వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సూర్యాపేట జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

### ధాన్యం కొనుగోలు పూర్తి : కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** జిల్లాలో ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, సివిల్ సప్లై అధికారి, డియం, డిఆర్‌డిఎ పిడి, మెప్మా డిసివో, వ్యవసాయ అధికారులతో కలిసి కొనుగోలు పూర్తయిన సందర్బంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐకెపి, మెప్మా సహకార సంఘాలు, మార్కెటింగ్‌లు లాంటి వివిధ శాఖలు సమన్వయం చేసుకుంటూ జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినందుకు అధికారులను అభినందించారు. ట్రక్ షీట్ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 48 గంటలలోనే రైతులకి డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చే సీజన్ నాటికిప్రతి సెంటర్‌లో పాడి క్లీనర్స్ ఉండేలా కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలని డిఆర్‌డిఎ పిడి, డిసివో లను కలెక్టర్ అదేశించారు. ఈ సీజన్‌లో ఏమైనా చిన్న చిన్న పొరపాట్లు జరిగితే వాటిని వచ్చే సీజన్ నాటికి పునరావృతం కాకుండా సరిదిద్దుకోవాలని అధికారులకు సూచించారు. కేసులు నమోదైన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ మిల్లులపై రోజు వారి నివేదికలు తమకి సమర్పించాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అదేశాల ప్రకారం జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు కలిపి ఒకేసారి సన్నబియ్యం చివరికార్డు వరకు అందేలా జూన్ 30 వరకు కొనసాగుతుందని లబ్ధిదారులు ఒకేసారి రేషన్ షాపులకు ఎక్కువ సేపు నిల్చోవాల్సి వస్తుందని రోజు కొంతమంది వచ్చేలా చూసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, సివిల్ సప్లై డిఎం ప్రసాద్, సివిల్ సప్లై అధికారి శ్రీనివాసరెడ్డి డిసివో పద్మ, మెప్మా పిడి రేణుక, వ్యవసాయ అధికారి ప్రణవి, సివిల్ సప్లై డిటిలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

## గురుకుల డిగ్రీ కళాశాలకు స్థలం పరిశీలన



**ప్రజాపక్షం/నందికొండ:** స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాలకు సంబంధించి స్థలాన్ని గురువారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పరిశీలించారు. గత నెల మే 21న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిసాగర్ వద్ద స్థల పరిశీలనకు బీసీ గురుకుల పాఠశాలకు వచ్చినప్పుడు పాఠశాల యాజమాన్యం సాగర్ లో ఉన్న పాత బిఈడి కళాశాలను తమడిగ్రీ కళాశాలకు కేటాయించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.అందుకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి గురువారం పాత బిఈడి కళాశాల ప్రాంగణాన్ని, ఆ పక్కనే నిర్మించి వదిలేసిన భవన సముదాయం డిగ్రీ కళాశాలకు ఏమేరకు ఉపయోగపడుతుందో దగ్గరుండి పరిశీలించి డిగ్రీ కళాశాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వం నుంచి నిధులు సమకూరిన తర్వాత ఒక నిర్ణయం తీసుకుందామని హామీ ఇచ్చారు. ఆ తరువాత గురుకుల పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం తన సొంత ఖర్చులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎంపీ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో మాజీ జెడ్పీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగయ్య, వేణు,జయరాం, మద్దాల భాను, అబ్రహం, ముజీబ్ ఉంగరాల శీను పాల్గొన్నారు.

## రైతుల నడ్డి విరుస్తున్న నల్ల చట్టాలు

### రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతుల నడ్డి విరుస్తుందని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు నల్ల చట్టాలను కేంద్రం వెంటనే తొలగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రైతుల మీద ప్రేమ ఉంటే వారికి సబ్సిడిపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించాలన్నారు. రైతుల వద్ద ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే వడ్లను రీస్లైకింగ్ చేసి అందులో కొంత పొడిని కూడా కలిపి కొత్త కొత్త కంపెనీల పేరుతో పది కేజీల బస్తాను రూ.1000 నుంచి రూ.1200 కు తిరిగి రైతులకు అమ్ముతున్నారని అన్నారు. కేంద్రం వరి ధాన్యానికి మొక్కుబడిగా క్వింటాకు రూ.60మాత్రమే పెంచి చేతులు దులుపుకుందే తప్పా రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. రైతులు ఒక ఎకరానికి రూ.40వేల పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేస్తే ఐదు నెలల తరువాత తిరిగి చూసుకుంటే రోజువారి కూలీ కూడా రాని పరిస్థితి ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ధాన్యం రేటు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి బదులు భూభారతి తీసుకురావడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు ఎర్రబోతు పద్మ, బంటు బుచ్చయ్య, అంజన్నపెల్లి రామలింగం, బంటు రాజేశ్వరి, సైదా తదితరులు పాల్గొన్నారు.

## దాడి ఘటనలో 12 మందికి రిమాండ్



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** పచ్చని పొలాల్లో కాలుష్యం కంపెనీని వ్యతిరేకిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మించ తలపెట్టిన స్థలంలో ఉన్న సామాగ్రిని ధ్వంసం చేసి కంటైనర్ ను తగలబెట్టగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కంపెనీ ఏర్పాటు పై యాజమాన్యం చేస్తున్న మోసాలను తట్టుకోలేక కంపెనీ ఏర్పాటు చేయవద్దని ప్రశ్నించినందుకు ఇద్దరి పై దాడి చేసిన ఘటనను తీవ్రంగా పరిగణించిన బాధిత 12 గ్రామాల ప్రజలు ఐక్యంగా ముందుకు వచ్చి నిర్మాణ స్థలంలో ఉన్న సామాగ్రిని ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన 12 మందిని రిమాండ్ కు తరలించారు. ఆందోళన చేసిన రైతులను ఖైదీల్లా. ఫాక్షనిస్టుల్లా పోలీస్ స్టేషన్ లో బంధించడం బాధాకరమని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. పెద్ద ధన్వాడలో రైతుల ఆందోళన నేపథ్యంలో రాజోలి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 46 మందిని బుధవారం మానవపాడు పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పోలీసుతో మాట్లాడి వాహనాల్లో ఉన్న వారిని కిందకు దింపించారు. పోలీసులు, పరిశ్రమకు చెందిన బౌన్సర్లు కొంతమందిని కొట్టడంతో గాయాల పాలయ్యారని ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. పరిశ్రమ వద్దని ప్రజలు మొరపెట్టుకున్నా. నిరహార దీక్షలు చేసినా పట్టించుకోకుండా రాత్రికి రాత్రి పనులు ప్రారంభించడం ఎంత వరకు సబబని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బాధిత రైతులకు రాజకీయ ప్రజా సంఘాల నా యకులు దొడ్డి వెంకట్ రాములు, ఆంజనేయు లు, వెంకటస్వామి , కుర్ర పుల్లయ్య, టవర్ మ క్బూల్, కార్తీక్ పరిశ్రమను తరలించేంత వరకు రైతులకు మద్దతుగా ఉంటామన్నారు. పరిశ్రమను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. సుమారు 36 మందిని ప్రత్యేక వాహనంలో స్వగ్రామాలకు పంపించారు. 12 మందికి రిమాండ్ విధించారు. మరికొందరి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, రైతులను ఎంత వారించినా కర్రలు, పెట్రోలు, కారంపొడితో నిర్మాణస్థలిలో బీభత్సం సృష్టించారని, సమస్య ఎంత తీవ్రత ఉన్న చట్టాలను అనుసరించి శాంతియుత వాతారణంలో పరిష్కరించుకోవాలన్నారు.

## మోదీ పాలన భేష్

### చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి :** భారత ప్రధాని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలన అద్భుతంగా ఉందని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ ఏలే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో జిల్లా ముఖ్య నాయకుల వర్క్ షాప్ ఎస్ఆర్ మినీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం సంకల్పంతో సహకారం చేస్తూ శత్రు దేశం కవ్వింపు చర్యలతో దేశ ప్రజలను పొట్టన పెట్టుకుంటే ఆపరేషన్ సింధూర్‌తో మహిళ మేజర్లతో తగిన బుద్ధి చెప్పడం దేశంలోని ప్రజలందరినీ ఒక తాటిపై తీసుకొస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని పట్టణాలు, మండలాలలో కార్యశాలలు కార్యక్రమాలు డిజిటల్ పోటీ పరివర్తన, జిల్లాస్థాయి ప్రెస్ కాన్ఫరెన్స్ మండల స్థాయి సంకల్ప సభ శక్తి కేంద్ర స్థాయి రచ్చబండ సాహిత్య పంపిణి యోగా శిక్షణ పర్యావరణ పరిరక్షణ ఇలాంటి వారం రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పట్నం కపిల్, జిల్లా కో కన్వీనర్ ఉడుత భాస్కర్, గుంట్ల సత్యం, పల్లా జితేందర్ రెడ్డి, గుర్రం ప్రవీణ్ రెడ్డి,మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, పోతంశెట్టి రవీందర్, సిఎన్ రెడ్డి, వేముల అశోక్, పడమటి జగన్మోహన్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, చందా మహేందర్ గుప్తా పాల్గొన్నారు.



ఫోకస్

# వ్యవసాయం

# ఖరీఫ్‌కు సన్నాహాలు..



## సేంద్రీయ పద్ధతులు మేలు..

మట్టిలో పోషకాల వినియోగాన్ని మెరుగుపరిచే సాగు పద్ధతులు చేపట్టాలి. ముఖ్యం గా సేంద్రియ వ్యవసాయ పద్ధతులు. సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువు, కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులు వాడటం ద్వారా మట్టిలో జీవక్రియలు, పోషకాల సమతుల్యత పెరుగుతుంది. అంతర పంటలు, మిశ్రమ పంటలు: ఒకే భూమిలో పలు రకాల పంటలు లేదా అంతర పంటలు సాగు చేయడం వల్ల మట్టిలోని వివిధ పోషకాలు సమతుల్యం గా వినియోగం అవుతాయి. పంట మార్పిడి: ఒకే పంటను పదే పదే సాగు చేయకుండా, వేర్వేరు పంటలను మార్పిడి చేయడం వల్ల మట్టిలోని పోషకాల వినియోగం సమతుల్యం అవుతుంది. పంట అవశేషాలను నేలపై మల్చింగ్ చేయడం ద్వారా మట్టిలో పోషకాలు పెరుగుతాయి. ఈ పద్ధతులు మట్టిలో పోషకాలను సమతుల్యం చేసి, మట్టిని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

ఒకే పంటను పదే పదే సాగు చేయకుండా, వేర్వేరు రకాల పంటలను మార్పిడి చేయడం ద్వారా మట్టిలోని వివిధ పోషకాలు సమతుల్యంగా వినియోగం అవుతాయి. సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వాడటం: మట్టిలో జీవక్రియను, పోషకాల సమతుల్యతను మెరుగుపరుస్తుంది. అంతర పంటలు, మిశ్రమ పంటలు సాగు చేయడం: ఒకే భూమిలో పలు రకాల పంటలు లేదా అంతర పంటలు సాగు చేయడం వల్ల మట్టిలోని వివిధ పోషకాలు సమతుల్యంగా వినియోగం అవుతాయి. మట్టిని పరీక్షించుకోవడం: మట్టిలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకుని, అవసరమైన ఎరువులు మాత్రమే వేసుకోవాలి. నీటి నిర్వహణ విషయంలో జాగ్రత్తలు అవసరం. అధిక నీరు లేదా నీటి కొరత వల్ల మట్టిలో పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది. తగినంత నీరు ఇవ్వాలి. ఈ జాగ్రత్తలు

దేశ వ్యాప్తంగా రైతులు ఖరీఫ్ పంటకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. తొలకరి సీజన్‌లో నేల దున్నడం అన్నది రైతులు పొలం సిద్ధ చేసే అతి ముఖ్యమైన దశ. ఇప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే, పంటల పెంపుదలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కాబట్టి, దున్నేటప్పుడు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందులో భూయాజమాన్యం మొదటి అడుగు. ఖరీఫ్ జూన్ నుంచి అక్టోబర్ మాసం వరకూ కొనసాగుతుండగా, అత్యధిక ప్రాంతాల్లో మే మాసం నుంచే భూయాజమాన్యం మొదలైంది. భూమి రకం (రేగడి, ఎర్రటి, నల్ల) అనుసరించి దున్నే పద్ధతులు మారతాయి. మట్టిలో తేమ శాతం, మిహెచ్ స్థాయి వంటి అంశాలను పరిశీలించాలి. గడ్డి, కలప, రాళ్ల వంటి అడ్డంకులను తొలగించాలి. వర్షం మొదలవగానే దున్నకుండా, మట్టిలో తేమ కొంత శాతం ఉన్నప్పుడు మాత్రమే దున్నాలి. చాలా తడిగా ఉండే మట్టిని దున్నితే మట్టి గడ్డలుగా మారి నష్టపరుస్తుంది. అదే విధంగా బాగా ఎండిపోయిన భూమిని దున్నితే మట్టిలో తేమ తగ్గుతుంది. కాబట్టి, దున్నే సమయంలో నేల తీరును జాగ్రత్తగా పరిశీలించాలి. వ్యవసాయ క్షేత్రాలను దున్నడానికి సరైన యంత్రాలు లేదా ఎద్దులు ఉపయోగించాలి. ట్రాక్టర్ వాడితే జాగ్రత్తగా నడిపించాలి. అవసరాన్ని మించి లోతుగా దున్నకూడదు. దున్నే పరికరాలు బాగుండేలా చూసుకోవాలి. సాధారణంగా 6–9 అంగుళాల లోతుగా




దున్నడం సాధారణంగా సరిపోతుంది. ఎక్కువ లోతుగా దున్నితే నేలలోని జీవకణాలు పాడవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ముందుగా క్షేత్రం అంచుల దిశగా దున్నాలి. తరువాత అడ్డంగా లేదా చుట్టుకొలతగా దున్నడం మంచిది.. అప్పుడు నీటి ప్రవాహం సులభతరం అవుతుంది. దున్నే సమయంలోనే జీవామృతం లేదా సేంద్రీయ గోమయ మిశ్రమం చల్లాలి. ఎందుకంటే, ఈ చర్య వల్ల నేల ఉప్పెన స్థాయి తగ్గుతుంది. ఇది మట్టిలో సూక్ష్మ జీవుల పెరుగుదలకు దోహదం చేస్తుంది. నెమ్మదిగా గడ్డల్ని నలిపేలా దున్నాలి. నేల గడ్డలు చిన్నచిన్న ముక్కలుగా మారేలా చూసుకోవాలి. అవసరమైతే రెండోసారి దున్నాలి. పురుగుల నివారణ చర్యలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి, మట్టికి సేంద్రీయ పురుగు మందులు మిశ్రమం చేయాలి. ఖరీఫ్ పంటలు వేసే సమయం దృష్టిలో పెట్టుకుని దున్నడం జరగాలి. ఆలస్యమైతే విత్తనాల నాటే సమయం పోతుంది. ఎక్కువ వర్షపాతం నమోదైన తర్వాత దున్నకూడదు. ఒకసారి బాగా తడిగా ఉన్న మట్టిని మరోసారి తడిగా ఉండగానే దున్నితే మట్టిపంటలు దెబ్బతింటాయి. ఈ జాగ్రత్తలన్నింటిని పాటిస్తే, భూమి ఆరోగ్యంగా ఉండి మంచి దిగుబడి సాధించవచ్చు.

## నీటి ఆదా..

డైరెక్ట్ సీడెడ్ రైస్ (డిఎస్ఆర్) పద్ధతిని పాటిస్తే నీరు ఆదా అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. డిఎస్ఆర్ పద్ధతిలో వరి విత్తనాలను నేరుగా పొలంలో నాటుతారు, నర్సరీలో నాటుల పెంపకం చేసి మళ్ళీ పొలంలో నాటే ప్రక్రియను నివారిస్తారు. ఈ పద్ధతి ద్వారా సాంప్రదాయ సాగుతో పోల్చితే 30 నుంచి 35 శాతం నీరు ఆదా అవుతుంది. ఎందుకంటే.. సాంప్రదాయ పద్ధతిలో నర్సరీ పెంపకానికి అదనపు నీరు అవసరమవుతుంది. డిఎస్ఆర్ పద్ధతిలో పొలాలు నీటిలో మునగవు. నేల తేమ సంరక్షణతో తక్కువ నీటితో పంట సాగు చేయవచ్చు. ఈ పద్ధతి భూగర్భజలాలు నిరంతరం తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితులలో నీటి కొరతకు శాశ్వత పరిష్కారంగా ఎదుగుతోంది. అయితే, ఈ పద్ధతిలో కలుపు మొక్కలు ఎక్కువగా పెరగడం, అధిక ఉష్ణోగ్రతల వద్ద విత్తనాల అంకురోత్పత్తి తగ్గడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. డిఎస్ఆర్ విధానం వాతావరణంపై సానుకూల ప్రభావాలు చూపుతుంది. ఈ పద్ధతిలో నీటి వినియోగం తగ్గడం వల్ల భూగర్భజలాలు రక్షణ సాధ్యమవుతుంది. అలాగే, పొలాలను పూర్తిగా నీటితో ముంచకపోవడం వల్ల మెథేన్ వాయువు ఉద్గారం (గ్రీన్‌హౌస్ వాయువు) తగ్గుతుంది. ఇది గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. నీటి ఆదా, తక్కువ ఉద్గారాలు కలిగి ఉండటం వాతావరణ మార్పు ప్రభావాలను తగ్గించడంలో ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.



## పోషకాల సమతుల్యత కోసం జాగ్రత్తలు...



పాటిస్తే మట్టిలో పోషకాల సమతుల్యతను కాపాడుకోవచ్చు, పంట దిగుబడులు మెరుగుపడతాయి. తగినంత నీరు అందించటం వల్ల మట్టిలోని పోషకాలు మొక్కలకు సమర్థవంతంగా అందుతాయి. అధిక నీరు పోషకాలను మట్టిలో నుంచి కడిగి తీసుకెళ్లి పోషకాల లోపాన్ని కలిగించవచ్చు; తక్కువ నీరు వల్ల మొక్కలు పోషకాలను గ్రహించలేవు. నీటి నిర్వహణ ద్వారా మట్టిలో తేమ స్థాయి సమతుల్యం ఉండి, పోషకాలు మొక్కలకు అందుబాటులో ఉంటాయి. ఈ విధంగా, తగిన నీటి నిర్వహణ పంట పోషకాల నిల్వ, వినియోగం, స్థిరత్వానికి సహాయపడుతుంది. తగిన నీటి నిర్వహణతో పొలంలో ఫసిలిటేటెడ్ పోషకాల నిల్వలు సాధ్యమే. నీరు సరైన పరిమాణంలో ఉంటే, మట్టిలోని పోషకాలు మొక్కలకు సులభంగా అందుబాటులో ఉంటాయి, రూట్ అభివృద్ధి మెరుగవుతుంది, ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్, జింక్, ఇనుము వంటి పోషకాలు మొక్కలు బాగా గ్రహించగలుగుతాయి. నీటి కొరత వల్ల లేదా అధిక నీరు వల్ల పోషకాల లభ్యత తగ్గిపోతుంది, అందువల్ల తగిన నీటి నిర్వహణ ద్వారా మట్టిలో పోషకాల నిల్వలు స్థిరంగా ఉండేలా చేయవచ్చు.

## ఆర్థిక వ్యవస్థకు కీలకం...

దేశంలో వ్యవసాయ భూమి, పంట ఉత్పత్తి, ఆధార పడిన జనాభా వంటి అంశాలపై అధికారిక గణాంకాలు సాధారణంగా ప్రభుత్వం, నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఒ), ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) నివేదికలు వెల్లడిస్తాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, భారతదేశంలో వ్యవసాయం ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఎంతో కీలక భూమిక పోషిస్తున్నది. దేశంలో దాదాపు 60 శాతం భూమి వ్యవసాయానికి అనుకూలంగా ఉంది. ప్రపంచంలో అత్యధిక వ్యవసాయ భూమి ఉన్న దేశాల జాబితాలో భారత్‌కు చోటు దక్కింది. అయితే, దేశ విస్తీర్ణంలో వ్యవసాయ యోగ్యమైన భూమి శాతం పరంగా పలు దేశాల కంటే వెనుకబడింది. కాగా, దేశ జనాభాలో దాదాపు 60 శాతం మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. విస్తారమైన దేశం కాబట్టి, భారతదేశం ప్రపంచంలోనే ఎక్కువ మొత్తంలో ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఉత్పత్తి చేస్తుంది. హరిత విప్లవం, ఆధునిక



యంత్రాలు, మద్దతు ధరలు, పరపతి సౌకర్యాలు వంటివి వ్యవసాయ ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. కాగా, ఇటీవల కాలంలో వ్యవసాయ ఉత్పత్తులు, దిగుబడికి సంబంధించి కొన్ని కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 1950 దశకాల నుంచి హరిత విప్లవం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన విత్తనాలు, యంత్రీకరణ వల్ల ఆహార ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఉదాహరణకు, వరి, గోధుమల అదనపు ఉత్పత్తి 5 కోట్ల టన్నుల నుండి 50 కోట్ల టన్నులకు చేరింది. కానీ, అమెరికా, చైనా వంటి దేశాలతో పోలిస్తే భారతదేశంలో దిగుబడి రేటు తక్కువగానే ఉంది. ఇది యాంత్రీకరణ, సాంకేతికత, నీటిపారుదల, భూమి నాణ్యత, ఛిన్నాభిన్న భూముల వల్ల ఎక్కువగా ఉంది. ప్రెసిషన్ వ్యవసాయం, డ్రోన్లు, స్మార్ట్ ట్రాక్టర్లు, ఐఓటి, కృత్రిమ మేధస్సు (ఎఐ) వంటి సాంకేతికతలు వ్యవసాయ ఉత్పాదకతను, నాణ్యతను పెంచుతున్నాయి. వాతావరణ మార్పు, కొరవడిన నీటి లభ్యత, భూమి క్షీణత వంటి సమస్యలు వల్ల సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులు, బీడు భూములు పునరుద్ధరణ, సరైన ఎరువులు, పురుగుమందుల వినియోగం ముఖ్యమైనవిగా మారాయి. దేశంలో చాలా మంది రైతులకు చిన్నచిన్న కమతాలు ఉండడం వల్ల ఉత్పాదకత, ఆదాయం తక్కువగా ఉంది. సంక్షిప్తంగా, భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తులు మొత్తం పరిమాణంలో పెరుగుతున్నాయిగానీ, దిగుబడి రేటు, సుస్థిరత్వం, సాంకేతిక మార్పులు, భూమి సమస్యలు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి.

---

### సిపిఐ, గీత పనివారల సంఘం నేత

## పోగుల శ్రీనివాస్‌గౌడ్ మృతి



**కొరవి :** సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ అనారోగ్యంతో మరణించారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామం కొరవి మండలం రాజోలు గ్రామంలో గురువారం జరిగాయి. పోగుల శ్రీనివాస్ భౌతిక కాయానికి సిపిఐ మహబూబాబాద్ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు అజయ్ సారథిరెడ్డి , నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు నక్క నాగార్జున గౌడ్, గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దూసరి శ్రీరాములు గౌడ్, ఖమ్మం జల్లా ఉపాధ్యక్షులు బంధం నాగేశ్వర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌గౌడ్ మృతికి బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కాగా, హైదరాబాద్‌లోని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డిజి.సాయిలుగౌడ్, నాయకులు బి.నాగభూషణం, కెవిఎల్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్‌లు నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పోగుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.



## జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమాలు

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఈనెల 8న జరిగే సిపిఐ సూర్యాపేట జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో కామ్రెడ్ ధర్మబిక్షం భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా సమగ్ర అభివృద్ధికి సిపిఐ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. రైతు కూలీ కార్మిక సమస్యల పరిష్కారానికి సిపిఐ ప్రజాపోరాటాలు నిర్వహిస్తుందన్నారు. జిల్లా మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంభశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్, గన్న చంద్రశేఖర్‌లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ నాయకురాలు అనంతుల మల్లేశ్వరి, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు చామల అశోక్‌కుమార్, గుగులోతు రాజారాం, ఖమ్మంపాటి రాము, ఎండి పాషా, నిమ్మల ప్రభాకర్, పెంద్రకృష్ణ, దేశగాని హేమలత తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆపరేషన్ కగార్’ నిలిపివేయాలి

### మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

### వామపక్ష పార్టీల డిమాండ్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** దేశంలో మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగారును వెంటనే నిలిపివేయాలని సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, బందు సాయిలు డిమాండ్ చేశారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సిపిఐ, సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదులతో చర్చలు జరిపిన ప్రభు త్వం అసమానతల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులను అతి కిరాతకంగా ఎన్‌కౌంటర్ పేరుతో చంపడం దుర్మార్గం అన్నారు. కేంద్రప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని మావోయిస్టులతో శాంతిచర్చలు జరిపి జన జీవన స్రవంతిలో కలిసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్రప్రభుత్వం అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే మావోయిస్టులను అంతం చేయాలని చూస్తుందన్నారు. ఆపరేషన్ కాగర్ పేరుతో మావోయిస్టులను అంతం చేయాలనే దురుద్దేశంతో బిజెపి ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. మావోయిస్టులు దేశ పౌరులేనని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించి వారిని చంపడం ఏం టని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో వామపక్ష నాయకులు సోతుకు ప్రవీణ్‌కుమార్, క్యాతరాజు సతీష్, వెలిశెట్టి రాజయ్య నేరెళ్ల జోసెఫ్ మాతంగి రామచందర్, శేఖర్, పొన్నగంటి లావణ్య, గోమాత, శ్రావణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 7 నెలల పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో సూపర్‌డెంట్ షఫియోద్దీన్‌కు ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు అవుతున్నా ఇంతవరకు ఉద్యోగులపై దృష్టి పెట్టలేదని, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి దివాకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ఉపాధ్యక్షుడు ముస్తక్, సంగీత తదితరులు పాల్గొన్నారు.




# సమస్యల వలయంలో సర్కారు బడులు

### విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

### ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి : డిఇఒలకు ఎఐఎస్ఎఫ్ వినతి

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. గురువారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు18 నెలలు గడుస్తున్నా, ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేయలేదని విమర్శించారు. జూన్ 12న ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కానునందున సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. విద్యార్థులను వంచించడంలో టిఆర్ఎస్ కాంగ్రెస్‌కు పెద్ద తేడా లేదని విమర్శించారు. రానున్నది వర్షాకాలమని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కొన్ని బిల్డింగ్స్ శిధిలావస్థలో ఉన్నాయని, అలాంటి పాఠశాలల బిల్డింగ్స్‌ను గుర్తించి



హనుమకొండ..

డిస్మెంటల్ చేసి నూతన భవనాలు నిర్మించాలన్నారు. తరగతులకు అనుగుణంగా టీచర్స్‌ను నియమించాలని, పాఠశాలలో పరిశుభ్రత కోసం స్కావెంజర్స్‌లను నియమించాలని, కొన్ని పాఠశాలలకు ప్రహరి గోడలు, కిటికీలకు జాలీలు, కరెంటు సదుపాయం, లేదా వాటర్ సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయం లేని పాఠశాలలు కూడా జిల్లా కేంద్రంలో ఉన్నాయని తక్షణమే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సమస్యలు పరిష్కరించాలన్నారు.

**హనుమకొండ టౌన్ :** ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విద్యాశాఖ, ప్రభుత్వం విఫలమైందని ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వుట్కూరి ప్రణీత్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో డిఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు బుర్ర రాజుకుమార్, కొండ చరణ్ పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం కోరారు. గురువారం ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఇఒ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, నాయకులు మహేష్ పాల్గొన్నారు.

**కరీంనగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో డిఇఒ మొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకాన్ని కల్పించేలా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, మచ్చ పవన్, సాయి, వినయ్ తదితరులున్నారు.



కరీంనగర్..



నిజామాబాద్..



వరంగల్..

## పేద ప్రజల పక్షాన పోరాటాలు

### సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి విలాస్



**ప్రజాపక్షం/బైంసా :** కార్మిక, రైతు, పేద ప్రజల పక్షాన సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ పేర్కొన్నారు. గురువారం సిపిఐ బైంసా మండల మహాసభ పెండారి ముత్యం అధ్యక్షత జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా విలాస్ హాజరై మాట్లాడుతూ కార్మిక వర్గం రైతు వర్గం పేద ప్రజల పక్షాన పోరాటాలు చేసి అనేక హక్కులను సాధించడం జరిగిందన్నారు. దున్నే వాడిదే భూమి, బ్యాంకుల జాతీయ కరణ, రాజభరణాల రద్దు సిపిఐ ఆలోచన పరంగానే జరిగిందన్నారు. పనికిహారం పథకం, అటవీ హక్కుల చట్టం ఇన్ఫర్మేషన్ యాక్ట్ భవన నిర్మాణం సంక్షేమ చట్టం సిపిఐ పోరాటం వల్లే వచ్చాయన్నారు. సిపిఐ నిర్మల్ జిల్లా మహాసభలు జూలై6న నిర్మల్‌లో జరుగుతాయన్నారు. మహాసభలకు సిపిఐ రాష్ట్ర నాయకులు కూనంనేని సాంబశివరావు, చాడా వెండటరెడ్డి, కలవేని శంకర్ ముఖ్య అతిథులుగా హాజరు అవుతారన్నారు. అనంతరం మహాసభలో 13 మంది కౌన్సిల్, 7 గురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. టి.ప్రకాష్ మండల కార్యదర్శి, పిముత్యం మండల సహాయ కార్యదర్శి, కోశాధికారిగా బాన్సదే శివాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వందన సమర్పణతో మహాసభ ముగిసింది.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ మేడ్చల్ జోన్ డిసిపి కోటిరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బక్రిద్ పండగ సందర్భంగా సిద్దిపేటహైద్రాబాద్ రాజీవ్ రహదారిలోని అచ్చాయిపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. పోలీసులకు తగు సూచనలు సలహాలు ఇచ్చరు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను తనికీ చేశారు. నూతనంగా నిర్మాణం చేపట్టిన పోలీస్‌స్టేషన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐజికె కాలనీలో ఎన్నికల సందడి

**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా గృహకల్ప కాలనీలో సంక్షే మ సంఘం ఎన్నికల సందడి మొదలైంది.ఈ నెల 15వ తేదీ ఆదివారం ఎన్నికలు జరగనున్నాయని,నామినేషన్లకు శుక్రవారం వరకు దాఖలు చేసుకోవచ్చునని,7వ తేదీ నా మినేషన్లు ఉపసంహరణ ఉంటుందని ఎన్నికల కమిటీ సభ్యులు తెలిపారు.గురు వారం వరకు అధ్యక్షులుగా నలుగురు పిట్ల కృష్ణ,బెల్లి పరశురామ్,ఈదురు ముత్యాలు,బొడిగె వెంకట్‌గౌడ్,ప్రధాన కార్యదర్శులుగా నలుగురు సోమేశ్వర్,ఉట్ల కృష్ణ,కుంచె వెంకటేష్, కె లక్ష్మణ్‌లు నామినేషన్ దాఖలు చేశారని సభ్యులు తెలిపారు.

## తడి,పొడి చెత్తను వేరుగా సేకరించాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని హనికరమైన చెత్తను ప్రత్యేకంగా సేకరించాలని ముడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో పర్యావరణ దినోత్సవంలో భాగంగా ప్రజలకు తడిపొడి చెత్త సేకరణపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల కార్యాచరణలో బాగంగా మున్సిపల్ ప్రజలకు తడిపొడి చెత్తను ఇంటి దగ్గర వేరుచేసి ఆటోలకు తరలించాలని చెప్పారు. పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్‌ను నిషేదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గీతారెడ్డి, ఎంపివొ మంగతయారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ భారతితో భూసమస్యలు పరిష్కారం




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతుల భూసమస్యలను పరిష్కరించుటకు భూ భారతి పథకం దోహదపడుతుందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. గురువారం శామీర్‌పేట మండలం పొన్నాల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరణి స్థానంలో భూ బారతి ద్వార ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ భూసమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. గత బిఆర్‌ఎస్ హాయాంలో రైతులు ధరణితో తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలుపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ యాదగిరిరెడ్డి, శామీర్‌పేట కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ గడ్డం రమేష్, రైతులు పాల్గొన్నారు. అలాగే కేశవరంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిటిసి గొనె హన్మంతరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం



**ప్రజాపక్షం/కొడంగల్:** భూ భారతితోనే సమస్యలు పరిష్కారం అవుతాయని తహాశీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం, నాగారం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. రుద్రారంలో మొత్తం 19 దరఖాస్తులకు గాను డిజిటల్ సంతకం 1, వారసత్వ పట్టా మార్పిడి 8, తప్పుడు సర్వే02, మ్యూటేషన్01, భూమి రకం మార్పిడి03, క్యాస్ట్ ధృవీకరణపత్రం01, అదనపు భూ విస్తీర్ణం03 దరఖాస్తులు రాగా, నాగారం గ్రామంలో డిజిటల్ సంతకం03, సర్వే మిస్సింగ్02 దరఖాస్తులు అన్నాయని తహాశీల్దార్ తెలిపారు. రెవెన్యూ సదస్సులను ఆయా గ్రామాల ప్రజలు తప్పని సరిగ్గా సద్వినియోగం చేసుకొవాలని కోరారు. వీరితో పాటు రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

## ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్‌లు



**ప్రజాపక్షం / కొడంగల్ :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో మహిళలు స్వయం ఉపాధిని పోందేందుకు ఉచిత కుట్టు మిషన్‌లను అందించడం ఎంతో హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, టిపిసిసి సభ్యులు మహ్మద్ యూసుఫ్‌లు అన్నారు. గురువారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని ముస్లీం మైనార్టీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో పేద బడుగు బలహీన వర్గాల ముస్లీం మైనార్టీ మహిళలు స్వయం ఉపాధి పోందేందుకు ముస్లీం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మున్సిపల్ పరిధిలో దాదాపు 324 మంది మహిళలు దరఖాస్తులు చేసుకొగ అందులో 295 మంది మహిళలకు కుట్టు మిషన్‌లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఉషారాణి, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మునీర్, మాజీ కౌన్సిలర్‌లు శంకర్‌నాయక్, బిఎం రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆసీఫ్ ఆలీఖాన్, మున్సిపల్ కమిషినర్ బలరాం నాయక్, ఆంజనేయులు, భరత్, ప్రవీణ్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన శ్రీకాంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** పెద్దేముల్ మండల పరిధి మంబాపూర్ గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి కూతురి వివాహా వేడుకలకు బిఆర్‌ఎస్ మండల మాజీ యువత అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డిలు హాజరైన వధువరులను ఆశీర్వదించారు. వధువరులను ఆశీర్వదించిన వారిలో బిఆర్‌ఎస్ మాజీ మండల యూత్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డితో పాటు జహిరాబాద్ మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, శేఖపురం మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి, తదితరులు ఉన్నారు.



# రేషన్ పరేషాన్

● వేలి ముద్రలు, తూకంలో జాప్యం ● మొరాయిస్తున్న బయోమెట్రిక్ యంత్ర పరికరాలు ● టోకెన్ విధానం అనుసరించాలన్న అదనపు కలెక్టర్






**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రేషన్ దుకాణాల ద్వారా ఈ నెల మొదటి తేదీ నుండి ప్రారంభమైన మూడు నెలల కోటా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాలో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయో మెట్రిక్ యంత్ర పరికరంతో రేషన్ డీలర్లు లబ్ధిదారుల నుండి మూడు నెలలకు సంబంధించి ఆరు సార్లు వేలి ముద్రలు తీసుకోవాల్సి వస్తుండటం, 72 కిలోల నుండి 144 కిలోలకు పైగా బియ్యం తూకం వేసి లబ్ధిదారులు తీసుకొని వచ్చే బ్యాగుల్లో పోసి ఇవ్వటంలో ఒక్కొక్కరికి 20 నిమిషాలకు పైగాపడుతుండటం, అదే సమయంలో వేలి ము ద్రలు తీసుకోవటంలో బయోమెట్రిక్ యంత్ర పరికరం మొరాయిస్తుండటం లాంటి సమస్యలతో మరింత ఆల స్యం అవుతుండటం వల్ల తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. ఒక్కో రేషన్ డీలర్ వద్ద ఉదయం నుండే పెద్ద సంఖ్యలో అధిక సమయం లబ్ధిదారులు వేచి ఉండాల్సి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో అసహనం కోల్పోతున్న లబ్ధిదారులు రేషన్ డీలర్ల మధ్య తీవ్రమైన వాదోపవాదాలు జరుగుతున్నాయి. మేడ్చల్ జిల్లా లో ఉన్న 618 రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు 32933.198 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కేటాయించారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గాను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఇప్పటికే రేషన్ డీలర్లు, స్టేజి1,2 కంట్రాక్టర్లతో సమావేశమై దిశా నిర్దేశం చేసా రు. రేషన్ డీలర్లు ఎప్పటికప్పుడు తమ వద్ద 50 శాతం కోటా ఉంటుండగానే సన్న బియ్యం మండల్ లెవల్ స్టా క్ పాయింట్ గోదాంల నుండి తెప్పించుకోవాలని, డీలర్ల ఆర్డర్ల మేరకు గోదాం ఇన్‌చార్జిలు సరఫరా చేయటంలో ఎలాంటి అలసత్వం వహించరాదని, సంబంధిత కం ట్రాక్టర్లు, సివిల్ సప్లయిస్ డిటిలు, ఎఎస్‌ఒలు, తహసీల్దార్లకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు రేషన్ దుకాణాల వద్ద ఏర్పడే రద్దీకి అనుగుణంగా మంచి నీరు వంటి మౌలిక సదుపాయాలు సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. రేషన్ దుకాణాల డీలర్లు సమయ పాలన పాటిస్తూ లబ్ధిదారులతో సౌమ్యంగా మాట్లాడి సన్న బియ్యం అందించాలని తెలిపారు.

### బ్యాగులు, వేలి ముద్రలు, తూకం విషయాలలో జాప్యం

లబ్ధిదారుల నుండి ఏక కాలంలో మూడు నెలల కోటా సన్న బియ్యం అందించే విషయంలో ఏ నెలకు సంబంధించి ఆ నెలకు గాను వేర్వేరుగా బయో మెట్రిక్ యంత్ర పరికరంతో ఆరు సార్లు వేలి ముద్రలు తీసుకోవాలన్న ప్రభుత్వ నిబంధన తీవ్ర సమస్య సృష్టిస్తోంది. అధిక సమయం వేలి ముద్రల వద్దే గడిచి పోతుండటం, కొన్ని సందర్భాల్లో వేలి ముద్రలు వెంట వెంటనే రాక పోవటం, ఒక్కొక్కరి నుండే పదే పదే యత్నిస్తుండటం సమస్యలకు దారి తీస్తోంది. ఆ తర్వాత లబ్ధిదారులకు కోటా ప్రకారం డీలర్లు తూకం వేసి ఇచ్చిన బియ్యం తీసుకొని వెళ్లటానికి సరి పడే బ్యాగులు వెంట తీసుకొని రాక పోవటం సైతం ఆలస్యానికి కారణమవుతోంది. అప్పటికే బారులు తీరి ఉంటున్న జనం అసహనానికి గురవుతున్నారు.

### టోకెన్ విధానం అనుసరించాలి

సన్న బియ్యం పంపిణీలో గత నాలుగు రోజులుగా ఎదురవుతున్న ఇబ్బందులను డీలర్ల వద్ద ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరిష్కార దిశగా డీలర్లు టోకెన్ విధానాన్ని అనుసరించాలని తాజాగా గురువారం ఆదేశించారు. లబ్ధిదారులు ఎక్కువ సమయం లైన్‌లో నిలబడే పని లేకుండా తమ వద్దకు రాగానే టోకెన్లు పంపిణీ చేసి సీరియల్ నంబర్ల ప్రకారం సన్న బియ్యం అందించాలని సూచించారు. మండల లెవల్ స్టాక్ పాయింట్ గోదాం ఇన్‌చార్జిలతో సమన్వయంతో ఉంటూ డీలర్లు బియ్యం తమ దుకాణాల వద్దకు సమయానికి జాప్యం లేకుండా తెప్పించుకోవాలని ఆదేశించారు. గురువారం ఆయన మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలోని రేషన్ దుకాణం డీలర్లు, లబ్దిదారుల సమస్యలను పరిశీలించారు.

## అక్రమ గెస్ట్‌హౌస్‌పై చర్యలు ఎప్పుడు?

### హైడ్రా చర్యలు చేపట్టాలని డిమాండ్



**ప్రజాపక్షం/దుండిగల్ :** అధికారుల అండతో అక్రమనిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి,హైడ్రా అధికారులు ఓవైపు వరుసగా అక్రమనిర్మాణాలు కూల్చివేస్తున్న కబ్జాదారులు బరితెగిస్తూ అక్రమనిర్మాణాలు కొనసాగిస్తున్నారు. స్థానిక అధికారుల అండతోనే అక్రమ నిర్మాణాలు సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాడు అక్రమనిర్మాణం అంటూ అధికారులు కూల్చివేయగా కూల్చిన చోట నిర్మాణం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడంలేదు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేటలోని సర్వే నంబర్ 166 అసైన్డ్ భూమి 432.19 గుంటలు,సుమారు 50 ఎకరాలు పోలీస్ శాఖకు కేటాయించగా,మరో 50 నుండి 70 ఎకరాల భూమి ని 10 మంది ఎక్స్ సర్వీస్ మెన్ లకు కేటాయించారు,మిగిలిన భూమిని స్థాని క రైతులకు లావన్ పట్టాలు కేటాయించారు,నిర్మాణాలు చేపట్టాలంటే ఎన్ ఓ సి తప్పని సరి ఎన్‌ఓసి పొందకుండా సుమారు రెండు ఎకరాల అసైన్డ్ భూమి ని కాజేసేందుకు బౌరంపేట చెందిన ఓ వ్యక్తి కన్నేశాడు. ఈ క్రమంలో గత 8 నెలల క్రితం మూడువేల గజాల స్థలంలో గెస్ట్ హౌస్, షెడ్డు నిర్మాణం చేపట్టగా స్థానికులు ఫిర్యాదు చేయగా అప్పట్లో రెవెన్యూ అధికారులు పైపై కూల్చివేత లు చేపట్టారు. కూల్చిన చోట సదరు వ్యక్తి తిరిగి అక్రమ నిర్మాణం చేపడుతు న్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడంలేదు. అక్రమ నిర్మాణంపై అధికారులను వివరణ కోరగా గెస్ట్ హౌస్ నిర్మాణం పై చర్యలు మున్సిపల్ అధికారులదే అంటూ రెవెన్యూ అధికారులు చెప్పడం కోసం మెరుపు ఇకనైనా ఉన్నదా అధికారులు చర్యలు చేపడతారో లేదో చూడాలి మరి.

## సస్యరక్షణ పద్ధతులతో వ్యవసాయం మేలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సమగ్ర సస్యరక్ష ణ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కేశవరంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ సేద్రీయ ఎరువులను వాడుతూ భూసారాన్ని పెంచుకోవాలన్నారు. రసాయన ఎరువులను తగిన మోతాదులో వాడాలని చెప్పారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని రశీదులను భద్రపరుచుకోవాలని అన్నారు. పంట మార్పిడి చేయాలన్నారు. పొలం గట్లపై అవసరమైన వెదురు చెట్లను పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌డి విద్యార్థులు కిరన్మయి, సౌమ్య, మాజి ఎంపిటిసి గొనె హన్మంతరెడ్డి, వ్యవసాయాధికారి రవికుమార్, రైతులు ఇంద్రసేనారెడ్డి, సాయిలు, కొమురయ్య, శేఖర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రాంలోని తహసీల్దార్ కార్యాలయ అవారణలో గల ఇవిఎం గోడౌన్‌లను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం గోడౌన్ తెరిచారు. ఇవిఎంలు బ్యాలెట్ యూనిట్ , కంట్రోల్ యూనిట్‌లు ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షణ్ణంగా పరశీలించారు. ఇవిఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్‌డిఒ వాసుచంద్ర , ఎన్నికల పర్యవేక్షకుడు నెమత్‌హలి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ రహిత జిల్లాగా రూపొందించాలి

అటవీ శాఖ అధ్వర్యంలో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ అనేది నిత్యజీవితంలో భాగమై చివరకు మన అహారంలో మాక్రో ప్లాస్టిక్ రూపంలో చేరుతుందని, అది మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ప్లాస్టిక్ రహిత జీవన విధానంలోకి మారాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడాలన్నారు. కాలుష్య, ప్లాస్టిక్ రహిత జిల్లా ఏర్పాటు చేయాలని, సమాజంలోని ప్రతి వ్యక్తి పర్యావరణాన్ని కాపాడుతానని ప్రతిజ్ఞ పూణాలన్నారు. త్వరలో అనంతగిరి ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, అటవీ రేం జ్ అఫిసర్ వ్యామ్‌కుమార్,రాజేందర్ ప్రతిమ, అ టవీ సెక్షన్ అధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ప్రతీక్‌జైన్

వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో భూ భారతి పై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు కావల్సిన సేవలను అందించాలన్నారు. సాదా బైనామా ,పిపి , భూవిస్తర్ణం లో మార్పులు ,చేర్పులు పాసు పుస్తకాల అందజేత తదితర అంశాలపై క్షణంగా పరిశీలించి సమస్యల పరిష్కర దశగా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దష్టి సాధించాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన అర్జీల నమోదు రిజిష్టర్‌ను తప్పని సారిగా రాసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , ఆర్డిఓ వాసుచంద్ర , తహసీల్దార్ శ్రీనివాస్ , ఆర్‌ఐ భాగ్యలక్ష్మి , సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## పోలీస్ అధికారులతో జిల్లా ప్రధాన న్యాయముర్తి సమన్వయ సమావేశం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కోర్టులో జిల్లా పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా ప్రధాన న్యాయముర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి , ఈనెల 14వ తేదీన జాతీయ లోకాదలత్ లో రాజీ పడదగ్గ కేసులకు అధికా సంఖ్యలో రాజిడేలా చేడాలని ,జిల్లాలోని వికారాబాద్ ,పరిగి ,తాండూర్, కొండగల్ నాలుగు నియోజకవర్గంలోని పోలీస్ అధికారులతో జిల్లా ప్రధాన న్యాయముర్తి సమిక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతే పోలిస్ స్టేషనలలో కేసులు పెట్టుకున్నా వారు , కోర్టుల చూట్టు తిరుగుతున్న వారికి అవగాహన కల్పించి రాజీపడేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు న్యాయముర్తి చంద్రకిశోర్ , వేంకటేశ్వర్లు వికారాబాద్ జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి , దిపారాని , అన్వేషింగ్ ,సమీణ బేగం డిఎస్‌పిలు , శ్రీనివాస్‌రెడ్డి , శ్రీనివాస్ , బాలకృష్ణరెడ్డి , దానయ్య, సిఐలు , బీమ్‌కుమార్, సంతోష్, నరేష్ సంబందిత అధికారులు పాల్గోన్నారు.

## భారత దేశానికి మోడీ గొప్ప వరం



**ప్రజాపక్షం/అల్వాల్ :** భారత దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తూ ఎనలేని సేవలు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ భారత దేశానికి ఒక వరమని భారతీయ జనతా మజ్దూర్ సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగార్జున అన్నారు. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ప్రభుత్వం 11సంవత్సరాలు పూర్తైన సందర్భంగా బిజెఎం సి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ ఆసుపత్రి వద్ద గురువారం రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో ప్రధానమంత్రి మోదీ 11 సంవత్సరాలు సుపరిపాలన సందర్భంగా అతార్జాతీయ పర్యావరణం దినోత్సవంలో భాగంగా మూడుచింతలపల్లి మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్ ఆద్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు నందాల శ్రీనివాస్, సుధాకర్‌నాయక్, నరేందర్‌రెడ్డి, నాగరాజుచారి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు : వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ బాలాజీ లే అవుట్ కాలనీలో నూతనంగా నిర్మించిన భీమేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌లు వేర్వేరుగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్, కూనలు మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీల్లో దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు మానసిక ప్రశాంతతకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. దేవాలయాల అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, విజయరాం రెడ్డి, కమలాకర్, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, వెంకటేశ్, మూసాఖాన్, ఇమ్రాన్ బేగ్, బుచ్చిరెడ్డి, అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి వార్షికోత్సవ వేడుకలు...

సుభాష్‌నగర్ డివిజన్ జీడిమెట్ల, రాంరెడ్డి నగర్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి, ఆంజనేయ స్వామి, నవగ్రహ దేవతల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, నాయకులు సాయికిరన్, వామన్ గుప్త, రాంలింగం గుప్త, శ్రీనివాస్, గోవిందరావు, చంద్రమౌళి, బాలరాజు పాల్గొన్నారు.

## తుర్కపల్లి ఆర్‌యుబి రైల్వే గేట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ తుర్కపల్లి ప్రజలకు రైల్వే చక్రబంధం నుండి విముక్తి కలిగించడానికి తుర్కపల్లి రైల్వే గేట్ వద్ద ఆర్‌యుబి నిర్మాణానికి చర్యలు తీసుకుని పనులు ప్రారంభించామని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం రైల్వే జిహెచ్‌ఎంసి జలమండలి విద్యుత్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే తుర్కపల్లి ఆర్‌యుబి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. అధికారులు సమన్వయం చేసుకొని త్వరలో ఆర్‌యుబి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుర్కపల్లి రైల్వే గేటు సమీపంలో మురుగునీరు వచ్చి రైల్వే గేటు దగ్గర ఆగిపోవడంతో దానికి వేఅవుట్ చూపించాలని జలమండలి రైల్వే అధికారులు సమన్వయం చేసుకొని బాక్స్ డ్రైన్ ఆర్‌యుబితోపాటు నిర్మించాలని తుర్కపల్లి రైల్వే గేట్ సమీపంలో గల ప్రాథమిక పాఠశాలకు చెందిన స్కూలు స్థలము నుండి సర్వీస్ రోడ్డు తీసుకుంటున్నాము దానికి అనుమతి కలెక్టర్ పరిష్కరించారు. ఆ ల్యాండ్‌కు సంబంధించిన విషయాన్ని సిసిఎల్‌కు పంపడం జరిగింది. అక్కడి నుంచి క్లియరెన్స్ ఇవ్వడంతో అన్ని రకాల ఎన్‌ఒసిలు రైల్వే అధికారులకు ఇవ్వడం జరిగింది. త్వరలోనే తుర్కపల్లి ఆర్‌యుబి పనులు ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రవి ప్రకాష్, జలమండలి మేనేజర్ రమేష్, ఎలక్ట్రికల్ ఎఇ రాంప్రసాద్, జిహెచ్‌ఎంసి ఇఇ శ్రీకాంతి, డిఇ రఘు, ఎఇ రఘు, జిహెచ్‌ఎంసి ప్రాజెక్ట్ డిఇ అన్వేష్ రెడ్డి, మాజీ ఎంబిసి చైర్మన్ నందికంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి



**ప్రజాపక్షం/షాబాద్ :** రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు చేవెళ్ల ఆర్‌డిఓ చంద్రకళ అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని కేసారం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రకళ మాట్లాడుతూ.. గ్రామంలో చాలామంది రైతులు భూ సమస్యల గురించి తహసీల్దార్ కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేస్తు సమయం వృద్ధా చేసుకోకుండా నేరుగా అధికారుల గ్రామాలకు వెళ్లి రైతుల సమస్యలు పరిష్కరించి ప్రోసిడింగ్ ధృవ పత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, డిప్యూటి తహశీల్దార్ మధు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 12,13 తేదీలలో రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులకు శిక్షణా తరగతులు

### తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులకు శిక్షణా తరగతులు ఈ నెల 12, 13వ తేదీలలో నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర రావు గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. శిక్షణా తరగతులకు హాజరుకావడానికి ఆసక్తి గల వర్కింగ్ జర్నలిస్టులు తమ పేర్లను రంగారెడ్డి జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో 10.06.2025వ తేదీలోగా నమోదు చేయించుకోవాల్సిందిగా మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర రావు తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## 'పర్యావరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి'



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ బయో డీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు లింగంపల్లి చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. పర్యావరణంపై పాఠశాలల్లో, కాలేజీల్లో భోధించాలని, ఫలితంగా విద్యార్థుల్లో చైతన్యం వస్తదని పేర్కొన్నారు. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చి, తెలంగాణను ప్రకృతిమయంగా మార్చాలని కోరారు. సమావేశంలో అంతర్జాతీయ వాటర్ ట్రిబ్యునల్ బి.చక్రధర్ , ఎన్విరాన్ ప్రొటెక్షన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల నరసింహులు, దీప్, తరుణ్ పాల్గొన్నారు.

## కేంద్రం పునరాలోచించి ఈ ఏడాదిలోనే కులగణన చేపట్టాలి

### జాజుల శ్రీనివాస్‌గౌడ్, టి.చిరంజీవులు డిమాండ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కేంద్రప్రభుత్వం పునరాలోచించి దేశవ్యాప్త కులగణన ఈఏడాదిలోనే ప్రారంభించి, 2026లో పూర్తి చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు డిమాండ్ చేశారు. 2027లో కులగణన చేస్తామని మొన్న కేంద్రం షెడ్యూల్ ప్రకటించిందని, దీనిని బిసి ప్రజలెవరూ ఒప్పుకోబోరని స్పష్టంచేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బిసి కుల సంఘాల జెఎసి కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన మనదేశంలో ఆరు నెలల్లోనే జనగణనతోపాటు కులగణన చేపట్టవచ్చన్నారు, కానీ, 2027లో ప్రారంభిస్తామని చెప్పడం బిసిల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. వెంటనే కులగణనకు కేంద్రం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాలని కోరారు. గతంలో బిజెపిలో కొంతమంది పెద్దలు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడారని, ఇప్పుడు కూడా బీహార్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే కులగణన అంశాన్ని అటకెక్కిస్తారమోనే సందేహం కలుగుతుందన్నారు. ఎట్టిపరిస్థితుల్లో బిసిల జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టంచేశారు. ఈ క్రమంలో సమగ్ర కులగణనకు ఈనెల రెండోవారంలో హైదరాబాద్‌లో మేధావుల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. జులై మొదటి వారంలో ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, నేతలు ఉప్పరి శేఖర్ సగర, చంద్రశేఖర్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, మాదేశి రాజేందర్ గణం నరసింహ పాల్గొన్నారు.

## సీజ్ చేసిన గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా పట్టివేత

### తాండూరు ఎక్సైజ్ కానిస్టేబుల్ సహకారంతో అక్రమ దందా... 1.5కిలోల గంజాయి సీజ్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసిన గంజాయిని విక్రయించేందుకు తరలిస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నారు. గురువారం షాద్‌నగర్ సిఐ విజయ్‌కుమార్ మీడియా సమావేశాన్ని నిర్వహించి వివరాలు వెల్లడించారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ యాదవ కాలనీలో వాహనాలను ఎస్ఐ దేవరాజ్ తనిఖీ చేస్తుండగా అంజద్ (32) చేతిలో ఓ సంచితో వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. వికరాబాద్ జిల్లా తాండూరు ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గులం సుల్తాన్ అహ్మద్ (52) సీజ్ చేసిన గంజాయిని అక్రమంగా బయటకు తీసి తన బందువు అయిన అంజద్‌కు ఇచ్చాడని, దాన్ని విక్రయించాలని సూచించినట్లు సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ గంజాయిని విక్రయించే సమయంలో అంజద్ షాద్‌నగర్ పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. రూ.75వేల విలువ చేసే గంజయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. శంషాబాద్ డిసిపి రాజేష్, అడిషన్ డిసిపి పూర్ణచందర్, షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణలు పోలీసులకు ప్రత్యేకంగా అభినంధించడంతోపాటు తగిన రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సులు చేసినట్లు సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ దేవరాజ్‌తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త రెవిన్యూ చట్టంతో రైతులకు మేలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భూ భారతి రెవిన్యూ చట్టంతో అన్నదాతలకు మేలు జరుగుతుందని ఫరూఖ్‌నగర్ డిప్యూటీ తహశీల్దార్ ఆనంద్‌సింగ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో డిప్యూటి తహసీల్దార్ ఆనంద్‌సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన చట్టాన్ని తీసుకువచ్చినట్లు వివరించారు. పాసుపుస్తకంలో పేర్లు తప్పుగా నమోదు కావడం, భూ విస్తీర్ణంలో తక్కువగా నమోదు కావడం వంటి అనేక సమస్యలను పరిష్కరించేందుకు రెవిన్యూ సదస్సులు ఉపయోగపడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారధితోపాటు రైతులు, రెవిన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రసూల్‌పుర ఫ్లైఓవర్‌కు.. భూసేకరణ పూర్తి చేయండి





జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రసూల్‌పుర ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిప పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో గురువారం కమిషనర్ సికింద్రాబాద్ జోన్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న బస్ స్టాప్‌లను పరిశీలించారు. రైల్వే సరిహద్దు నుండి 24 మీటర్ల వరకు భూమి అవసరం ఉందని, అధికారులు కమిషనర్‌కు తెలిపారు. బస్ స్టాప్‌లకు ప్రత్యామ్నాయ భూమిని కేటాయించి, దానిని తరలించాల్సిన అవసరం ఉందని ప్రాజెక్ట్ ఎస్.ఇ శ్రీనివాస్ కమిషనర్‌కు చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ హెచ్ సిటీ ద్వారా రసూల్‌పుర వద్ద చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణ స్థలాన్ని వెంటనే పరిశీలించి, భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## పారిశుద్ధ్య విభాగం కార్మికుల ఖాళీలు భర్తీ చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశుద్ధ్య విభాగం కార్మికుల ఖాళీలను భర్తీ చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం కోరారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ సి.ఎన్.రఘు ప్రసాద్‌కు ప్రతినిధులతో కలిసి ఏసురత్నం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి జిహెచ్‌ఎంసిలో ఖాళీను భర్తీ చేయకపోవడంతో దాదాపు 1600 ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. అలాగే వయస్సు మీద పడిన వారు, అనరోగ్యంతో విధులకు హాజరు కానీ వారివి మరో 1575 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దీంతో తక్కువ మంది కార్మికులతో ఎక్కువ పనులు చేయిస్తున్నారని తెలిపారు. దీంతో కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు. ఖాళీల అంశాన్ని వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లో రోజు రోజుకు జనాభా విపరితంగా పెరుగుతుందని, జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య విభాగంలో సిబ్బందిని పెంచాలని కోరారు. పారిశుద్ధ్యం, సివరేజి విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసిలో ఎఐటియుసి వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. యాదయ్య, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరినాథ్ రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్, కార్యనిర్వహక అధ్యక్షులు మద్దిలేటి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కొమ్ము పరమేశ్ పాల్గొన్నారు.

## భూభారతితో భూ సమస్యలు పరిష్కారం

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చేపట్టిన నూతన ఆర్‌ఓఆర్ భూభారతి చట్టం 2025 అమలులో భాగంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం శంషాబాద్ మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు.భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు,హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ 2025 చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14వ తేదీ లోపు భూభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామాలలో అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వ పరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు రైతులు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, శంషాబాద్ తహసీల్దార్ రవీందర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలుంటే దరఖాస్తు

**ప్రజాపక్షం/యాచారం :** రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహింపట్నం ఆర్డిఒ అన్నారు. గురువారం మండల పరిధిలోని మొండిగౌరేల్లి గ్రామంలో జరిగిన రెవేన్యూ సదస్సుకు అయన ముఖ్యఅతిథిగా హాజరై రెవెన్యూ ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్డిఒ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్న రైతులు సదస్సులో ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. రైతులందరికి న్యాయం చేయడానికి కృషి చేస్తామని అన్నారు.అనంతరం గ్రామంలోని సర్వేనంబర్ 19,68,127 ప్రభుత్వ భూములను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పై సర్వేనంబర్లలో భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చిన నోటిపికేషన్ ను రద్దు చేయాలని రైతులు అర్డిఒ దృష్టికి తెచ్చారు.ఆ సర్వేనంబర్లలో కొంతమంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు రాలేదు అర్హులైన వారందరికి పట్టా దారు పాసుపుస్తకాలు ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యాచారం తహశీల్దారు అయ్యప్ప, గ్రామ మాజీ సర్పంచ్ బండిమీది కృష్ణ,ఉప సర్పంచ్ యాదగిరిరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు మరిపల్లి అంజయ్య యాదవ్,మాజీ మండల అధ్యక్షులు తాంద్ర రవింధర్ తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ అవార్డు

### నార్సింగి మున్సిపల్ కమిషనర్‌కు అందజేత





**ప్రజాపక్షం/గండిపేట:** పర్యావరణ పరిరక్షణకు కృషిచేసినందుకు నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్ రెడ్డి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలు, కచ్చితమైన ఘన వ్యర్థాల నిర్వహణ, పచ్చదనాని ప్రోత్సాహం వంటి చర్యల ద్వారా నార్సింగి మున్సిపాలిటీకి పర్యావరణ పరిరక్షణలో కృషి చేసినందుకుగాను గురువారం రాష్ట్ర పర్యావరణ, అటవీ, ఎండోమెంట్స్ శాఖామంత్రి కొండా సురేఖ అందజేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు.

## రాష్ట్ర స్థాయి పదవుల్లో స్థానిక నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రాష్ట్ర స్థాయి పదువుల్లో స్థానిక నేతలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి పదవులు ఇచ్చేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఏఐసిసి ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉన్న కార్పొరేషన్లు, చైర్మెన్లు, డైరెక్టర్ల పదవులు ఇచ్చేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డిలతోపాటు ముఖ్యనేతలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. వీరితోపాటు ఆర్యవైశ్య సంఘం నేత ఆగీరు రవికుమార్ గుప్తా, కేశంపేట మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి జగదీశ్వర్, జానంపేట నాగమణి, మహ్మద్ ఇబ్రహీం, రాయికంటి కృష్ణారెడ్డి, నెహ్రు, బాదేపల్లి సిద్దార్థ, జిల్లెల రాంరెడ్డిల పేర్లను పరిశీలించి తగిన ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు, నేతలకు తగిన ప్రాధాన్యత ఇస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని పార్టీగా కాంగ్రెస్ ఎదిగేందుకు అవకాశాలు ఉంటాయని, సీనియర్ నేతలకు తగిన ప్రాధాన్య ఇచ్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం చేస్తుందని తాము భావిస్తున్నామని, రానున్న రోజుల్లో తగిన ప్రాధాన్య పార్టీ కల్పిస్తుందని వివరించారు. పార్టీ పదవులు రాలేవని ఎవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, కష్టపడే నేతలకు తగిన ప్రాధాన్యత ఇస్తుందని గుర్తు చేశారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

**ప్రజాపక్షం/యాచారం :** పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ఉంటుందని మండల ప్రత్యేకాధికారి మాధవరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం గ్రామంతోబాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని మొక్కలు నాటారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ చెట్టుంటే క్షేమం లేకుంటే క్షామమని అన్నారు. చెట్లు పెంచడం ద్వారా మనకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మానవ మనుగడకు చెట్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ప్రతిఒక్కరు ఒక మొక్కనాటాతే అవి భావితరాలకు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. స్వచ్చమైన గాలితో బాటు పండ్లు, కాయలను చెట్లు అందిస్తాయన్నారు. నాటిన ప్రతిమొక్క ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శైలజా, ఎంపిఒ శ్రీలత, ఎపిఒ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

**తుర్కయంజాల్:** పర్యావరణం పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని పర్యావరణ వేత్త, ఇపో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. గురువారం ఇపో రాష్ట్ర కోర్డినేటర్ పి.శివకుమార్ ఆధ్వర్యంలో పర్యావరణం దినోత్సవం సందర్భంగా రాగన్నగూడ, సామా రెసిడెన్సి కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం చేశారు. ఈ సందర్బంగా ఒరుగంటి మాట్లాడుతూ పర్యావరణం కాపాడటం సమాజంలో ప్రతి ఒక్కరీ బాధ్యత అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్,ఇపో ఆధ్వర్యంలో చేపడుతున్న మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్లపు శివకుమార్, విష్ణు, కాలనీ వాసులు జానయ్య, పాండు, మహిళలు పాల్గొన్నారు.









**షాద్‌నగర్ :** ప్రకృతిని సంరక్షించుకోవడంతోపాటు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్ సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని తిరుమల కాలనీ పార్కులో ప్రపంచ వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. న్యూసిటి కాలనీతో పాటు తిరుమల కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. వివిధ కాలనీల్లో మొక్కలు నాటడంతోపాటు మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటే విధంగా చూడాలని, నాటిన మొక్కను కాపాడేందుకు ప్రజలందరు నడుం బిగించాలని అన్నారు. అదే విధంగా తడి, పోడి చెత్తపై మున్సిపల్ కమీషనర్ సునీత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యుడు చెంది తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్యతోపాటు కాంగ్రెస్ నేతలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**గండిపేట :** మణికొండ మున్సిపల్ పరిధిలో వన మహోత్సవంలో భాగంగా మణికొండ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగంలో విశిష్ట సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులకు సేవా ప్రశంసా పత్రం అందించారు కమిషనర్ ప్రదీప్ కుమార్. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి తిరుమల హిల్స్ పార్క్ వరకు ర్యాలీగా వెళ్లి పార్కులో కమిషనర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శ్రీధర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ , డిఇ శివ సాయి , ఎఇ సంజయ్, బ్రాహ్మకుమారి సంస్థ సభ్యులు, మున్సిపాల్ సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





# క్రీడ

## పంజాబ్ కింగ్స్ నుండి ఆ ఐదుగురు ఔట్..!



ఐపిఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ రన్నరప్‌గా నిలిచింది. అసాధారణ ప్రదర్శనతో 11 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరిన పంజాబ్ కింగ్స్ తృటిలో టైటిల్‌ను చేజార్చుకుంది. ఆర్‌సీబీతో జరిగిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఫైనల్లో ఓడినా.. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అసాధారణ ప్రదర్శన కనబర్చింది. 14 మ్యాచ్‌ల్లో 9 విజయాలు, ఓ మ్యాచ్ రద్దుతో 19 పాయింట్స్ సాధించి టాపర్‌గా నిలిచింది.11 ఏళ్ల తర్వాత పంజాబ్ ప్లే ఆఫ్స్ చేరడంతో పాటు టాపర్‌గా నిలవడం, ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ.. రికీ పాంటింగ్ కోచింగ్.. కుర్రాళ్ల ఫియర్‌లెస్ గేమ్.. పంజాబ్‌కు విజయాలను అందించాయి. టాపర్‌గా నిలిచిన ఆర్‌సీబీ జట్టు కొన్నిలోపాలు ఉన్నాయి. వాటిని పంజాబ్ సరిదిద్దుకునే ప్రయత్నం చేయనుంది. ఈ క్రమంలోనే ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు ఓ ఐదుగురు ఆటగాళ్లను వదిలేయనుంది.

### 1. గ్లేన్ మ్యాక్స్‌వెల్



ఐపీఎల్ 2025 మెగా వేలంలో గ్లేన్ మ్యాక్స్‌వెల్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 4.20 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ అతను మాత్రం తీవ్రంగా నిరాశపరిచాడు. 7 మ్యాచ్‌లు ఆడి 8 సగటుతో 48 పరుగులే చేసి తుది జట్టులో చోటు కోల్పోయాడు. బౌలింగ్‌లో 13 ఓవర్లు వేసి 8.46 ఎకానమీతో 4 వికెట్లు తీసాడు. బెంచ్‌పై ఖాళీగా కూర్చోలేక గాయం సాకుగా చూపించి సీజన్ మధ్యలోనే వెనుదిరిగాడు. పంజాబ్ కింగ్స్‌కు భారంగా మారిన మ్యాక్స్‌వెల్‌ను వదిలేసి అతని స్థానంలో మరో స్పిన్ ఆల్ రౌండర్‌ను ఆర్‌సీబీ తీసుకునే ఛాన్స్ ఉంది.

### 3. యశ్ ఠాకూర్




భారత అనామక బౌలర్ యశ్ ఠాకూర్‌ను రూ. 1.60 కోట్ల భారీ ధరకు పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేయగా.. అతను రెండు మ్యాచ్‌లు ఆడి 12.15 ఎకానమీతో ఒక్క వికెట్ మాత్రమే తీసాడు. అతను పంజాబ్ కింగ్స్ ప్లెయింగ్ ఎలెవన్ కాంబినేషన్‌లో సెట్ అవ్వలేదు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో పేసర్‌ను వేలంలో కొనుగోలు చేసే అవకాశం ఉంది.

### 4. మిచెల్ ఓవెన్



ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మిచెల్ ఓవెన్‌ను రూ.3 కోట్లకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్.. ఒకే ఒక్క మ్యాచ్‌లు అవకాశం కల్పించింది. కానీ అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆ తర్వాత పూర్తిగా పక్కనపెట్టేసంది. పంజాబ్‌కు మిచెల్ ఓవెన్ సేవలు అవసరం లేదు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో ఆటగాడిని తీసుకునే ఛాన్స్ ఉంది.

### 2. గ్జేవియర్ బార్ట్‌లెట్



ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ అయిన గ్జేవియర్ బార్ట్‌లెట్‌ను పంజాబ్ కింగ్ రూ. 80 లక్షలకు కొనుగోలు చేసింది. అతను 4 మ్యాచ్‌లు ఆడి 9.60 ఎకానమీతో 2 వికెట్లు మాత్రమే తీసాడు. మెరుగైన ప్రదర్శన చేయకపోవడంతో తుది జట్టులో చోటు కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి ఐపీఎల్ 2026 మినీ వేలంలో మరో పేసర్‌ను పంజాబ్ కింగ్స్ తీసుకునే ఛాన్స్ ఉంది.

### 5. లాకీ ఫెర్గూసన్



ఐపీఎల్ 2025 మెగా వేలంలో లాకీ ఫెర్గూసన్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 2 కోట్లకు కొనుగోలు చేసింది. అతను 4 మ్యాచ్‌లు ఆడి 9.18 ఎకానమీతో 5 వికెట్లు పడగొట్టాడు. కానీ ఆ తర్వాత అతను గాయంతో జట్టుకు దూరమయ్యాడు. లాకీ ఫెర్గూసన్ మెరుగైన ప్రదర్శన చేసినా.. ఫిట్‌నెస్ సమస్యలతో అతన్ని వదిలేయాని పంజాబ్ కింగ్స్ భావిస్తోంది.

## ముందే హెచ్చరించిన గౌతమ్ గంభీర్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) విజయోత్సవ సంబరాలు విషాదంగా ముగిసాయి. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం బయట చోటు చేసుకున్న తొక్కిసలాటలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది అభిమానులు స్టేడియం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తొక్కిలాసట జరిగింది. ఈ అనూహ్య ఘటనతో ఆర్‌సీబీ సంబరం చిన్నబోయింది. ఈ దురదృష్టకర ఘటన నేపథ్యంలో విజయోత్సవ వేడుకలను ఉద్దేశించి గతంలో గంభీర్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. 11 ఏళ్ల క్రితమే విజయోత్సవ వేడుకలపై గంభీర్ హెచ్చరించాడు. ఇలాంటి విజయోత్సవ వేడుకలను నిర్వహించాల్సిన అవసరం లేదని, అలాంటి వేడుకల్లో తాను భాగమవ్వనని తెలిపాడు. ఐపిఎల్ 2014 సీజన్‌లో గౌతమ్ గంభీర్ సారథ్యంలోని కోల్‌కతా నైట్‌రైడర్స్ విజేతగా నిలిచింది. ఈ విజయాన్ని కేకేఆర్ సెల్రబ్రేట్ చేసుకుంది. ఈడెన్ గార్డెన్స్‌లో విజయోత్సవ వేడుకలు నిర్వహించింది.



అయితే ఈ వేడుకల్లో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో అభిమానులు ఈడెన్ గార్డెన్స్‌కు తరలివచ్చారు. అభిమానులను కట్టడి చేసేందుకు పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకున్నా.. అభిమానులపై పోలీసులు లాఠి చార్జీ చేయడంపై గంభీర్ ఆవేదనకు గురయ్యాడు. ఈ ఘటనపై హిందూస్తాన్ టైమ్స్ దినపత్రికకు రాసిన కాలమ్‌లో విచారం వ్యక్తం చేశాడు. భవిష్యత్తులో ఇలాంటి వేడుకల్లో పాల్గొనని పేర్కొన్నాడు.' కేకేఆర్ సన్మాన కార్యక్రమంతో కోల్ కతా ప్రజలకు కలిగిన అసౌకర్యం పట్ల నేను నిరాశ చెందాను. భారత క్రికెట్ అభిమానులు.. ఈ ఆటకు అత్యంత ముఖ్యమైన వాటా దారులు. కానీ వారిని సరిగ్గా ట్రీట్ చేయలేదు. అమాయకులపై లాఠీ ఛార్జ్ జరిగింది. దేవుడి దయతో కెకెఆర్ టీమ్ ఎన్నో ట్రో ఫీలు గెలుస్తుంది. కానీ నేను మాత్రం ఇలాంటి సన్మాన కార్యక్రమాలతో పాటు విజయోత్సవ వేడుకల్లో పాల్గొనను'అని గంభీర్ తన కాలమ్‌లో ప్రస్తావించాడు. తాజాగా ఆర్‌సీబీ విజయోత్స వేడుకల్లో తొక్కిసలాట జరగడంతో గంభీర్‌కు సం బంధిం చిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. విజయోత్సవ వేడుకలను పూర్తిగా రద్దు చేయాలని నెటిజన్లు కోరుతున్నారు.

# రీల్

## జూన్ 13న వస్తున్న 'కట్టప్ప జడ్జిమెంట్'



అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకట స్వామి నిర్మాతగా బాహుబలి కట్టప్ప సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కట్టప్ప జడ్జిమెంట్'. తీర్పుగల్ విర్కపడుమ్ తమిళ చిత్రాన్ని తెలుగులో కట్టప్ప జడ్జిమెంట్ పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత వెంకట స్వామి. బాహుబలి కట్టప్ప అంటే తెలుగులో తెలియని ప్రేక్షకులు వుండరు. అంతలాఎడతెగని అనుబంధం ఉంది తెలుగులో సత్యరాజ్ గారికి. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం యు/ఏ సర్టిఫికెట్ అందుకుంది. జూన్ 13న తెలుగులో విడుదల చేయడానికి నిర్మాత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యర్థి పాత్రలో మధుసూదనరావు అద్భుతంగా నటించారు. పూర్తి మాస్ ఎలిమెంట్స్ తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అనడంలో సందేహం లేదు. కట్టప్ప ఏ విషయంలో ఎలాంటి జడ్జిమెంట్ ఇచ్చాడో వెండితెరపై చూసి తెలుసుకోండి. ఈ చిత్రానికి ధీరన్ దర్శకత్వం వహించారు. మరియు స్మృతి వెంకట్, సత్యరాజ్, హరీష్ ఉత్తమన్ మరియు మధుసూధన్ రావు, రవిప్రసాద్ ప్రధాన పాత్రలు పోషించారు.

## రోషన్ కనకాల గుర్రపు స్వారీ



ప్రముఖ యాంకర్ సుమ , రాజీవ్ కనకాల నటి వారసుడు రోషన్ కనకాల తెలు తెరపై సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నాడు. బబ్లుగమ్ సినిమాతో హీరోగా పరిచయం అయిన రోషన్ తదుపరి సినిమా కోసం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నాడు. చిన్నప్పటి నుంచి సినిమా రంగంలో పెరిగిన రోషన్ ఎలాగైనా హీరోగా ఇండస్ట్రీ లో నిలదొక్కుకోవాలని కసరత్తు చేస్తున్నాడు. మరి రోషన్ రాజీవ్ కనకాల వారసత్వాన్ని నిలబెడతాడో లేదో వేచి చూద్దాం.

## పళని మురుగన్ ఆలయంలో 'సూర్య' పూజలు



తమిళ, తెలుగు ప్రేక్షకులకు ఎంతో సుపరిచితుడు అయిన నటుడు 'సూర్య'. వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. తాజాగా సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్ లో సూర్య సినిమా చేస్తున్నారు. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈనెల 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో తమిళ నాడు లోని పళని మురుగన్ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. లక్కి భాస్కర్ సినిమా ఫేం వెంకి అట్లూరి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. సూర్యదేవర నాగవంశి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు



## 8న 'లక్ష్మీ నరసింహా' రీ రిలీజ్

## బాలయ్య ఫ్యాన్స్ కోసం కొత్త సాంగ్

నందమూరి బాలకృష్ణ టైటిల్ పాత్రను పోషించిన 'లక్ష్మి నరసింహా'. జయంత్ సి పరాన్జి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2004లో విడుదలై అప్పట్లో సూపర్ డూపర్ హిట్ అయింది. ఇప్పుడు బాలకృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా 8వ తేదిన లక్ష్మి నరసింహా సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా కోసం కొత్త పాటు యాడ్ చేస్తున్నారు.మందేసినోడు మహానుభావుడు అనే పాటను చంద్రబోస్ తో రాయించి ఈ సినిమాలో అదనపు ఆకర్షణగా పెట్టారు. ఈ పాటకు భీమ్స్ సంగీతం అందించారు. ఈ సినిమాలో యాడ్ చేసిన కొత్త పాటను ప్రసాద్ ల్యాబ్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత చంద్రబోస్, దర్శకుడు జయంత్ సి పరాన్జి, నిర్మాత బెల్లంకొండ సురేష్, ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తున్న మౌనిక తదితరులు పాల్గొన్నారు



## ఆహాలో దుల్కర్ 'ఒక యముడి ప్రేమకథ' స్ట్రీమింగ్

సీతారామం, కల్కి, లక్కీ భాస్కర్ వంటి వరుస హిట్ చిత్రాలతో దుల్కర్ సల్మాన్ ఒక స్ట్రైట్ తెలుగు హీరోగా మార్కెట్ సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న తెలుగు చిత్రాలు ఒక్కొక్కటీ వంద కోట్లకు పైగా బడ్జెట్‌తో నిర్మాణం లో ఉన్నాయి. ప్రస్తుతం దుల్కర్, రాణా దగ్గుబాటి స్పిరిట్ మీడియా నిర్మిస్తున్న 'కాంతా', స్వప్న సినిమాస్ నిర్మాణంలో రూపొందుతున్న 'ఆకాశంలో ఒక తారా' అనే రెండు తెలుగు ప్రాజెక్టుల్లో నటిస్తున్నారు. దుల్కర్ సల్మాన్ నటించిన మలయాళ బ్లాక్‌బస్టర్‌ను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. . 'ఒరు యమండన్ ప్రేమకథ' చిత్రం, 'ఒక యముడి ప్రేమకథ' పేరుతో ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాను తెలుగులో భవాని మీడియా విడుదల చేయనుంది.

## సిఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా పర్యావరణ దినోత్సవాలు

మొక్కలు నాటిన సిటిజి వ్యవస్థాక అధ్యక్షుడు శ్రీనివాస్, సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు





ప్రజాపక్షం/శేరిలింగంపల్లి; ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లోగురువారం పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిటి ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సిటిజి) వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస్, సరోజ, సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి చెన్నకేశవరావు సారథ్యంలో 'సేంద్రీయ పంటల ద్వారా పండించిందే తిందాం తినేదే పండిద్దాం' అనే నినాదంతో సిఆర్ ఫౌండేషన్‌లో మొక్కలను నాటారు. లక్ష్మణ ఫలం, ఫ్యాషన్ ఫ్రూట్స్ మొక్కలు, వివిధరకాల కూరగాయల మొక్కలు, పూల మొక్కలతో పాటు మిరియాలు, ఆల్ స్పైస్, బిర్యాని ఆకు, మునగ చెట్లు, తమలపాకు, కరివేపాకు, ఇన్సులెన్, మల్టీ విటమిన్ ఆయుర్వేద మొక్కలు నాటారు. అనంతరం సిటిజి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ 70,000 మందికి పైగా సభ్యులతో పురోగమిస్తున్న సిటిజి గత ఐదు సంవత్సరాలుగా ప్రతీ పర్యావరణ దినోత్సవం నాడు వివిధ ప్రదేశాలలో మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని విస్తరించే వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ పాలిక్లినిక్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ ప్రసాదరావు, డైరెక్టర్ కూనంనేని రజనీ, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోసభట్ల కల్పన, మహిళా సమాఖ్య నాయకులు శ్రీమతి వశ్య పద్మ, జ్యోతి, పడాల నళిని, సభ్యులు లలిత, రాజేంద్రరావు, డాక్టర్ గోపిచంద్, వెలెవోలు సాంబశివరావు, సిటిజి గ్రూపు సభ్యులు రమా, స్వాతి, కుసుమ, ధనలక్ష్మి, అఖిలాండేశ్వరి, మాధవి, పావని, అనిత, రాధ, శారద, సౌజన్య, శ్రీలక్ష్మి, అనురాధ, శ్రావణి, శ్రీలత, పద్మజ వాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం..

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కాలుష్య రహిత తెలంగాణ కోసం కృషి చేద్దాం

హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్







ప్రజాపక్షం/హైదరాబాద్ : భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని కాపాడాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో జహీరాబాద్ ఎంపి సురేష్ షేట్కార్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయిద్దిన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెట్లు నీడ ఇవ్వడంతో పాటు ఆక్సిజన్ అందిస్తాయని అన్నారు. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో వచ్చే తరం ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే స్థాయికి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. కాలుష్యం పెరిగిపోయి ప్రజలు క్యాన్సర్, షుగర్ వ్యాధులను బారినపడి మందులపై ఆధారపడుతున్నారన్నారు. కాలుష్యం పెరగకుండా హైదరాబాద్ మరో ఢిల్లీ కానీయకుండా, హైదరాబాద్ ప్రకృతికి మారు పేరుగా ఉండాలంటే ఇక్కడ మనం చెట్లు నాడాలని సూచించారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రికి వచ్చే వారికి మొక్కలు నాటే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. మొక్కలు నానాటి ప్లాస్టిక్‌ను మన దైనందిన జీవితం నుండి దూరం చేయాలని కోరారు. మొక్కలు పెంచడం ఒక వ్యాపకంగా మార్చుకోవాలని, జన్మదినోత్సవాలు, ప్రత్యేక రోజులలో మొక్కలు నాటాలన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ చెట్టు నీడతో పాటు ప్రకృతి సహజమైన ఆక్సిజన్‌ను అందిస్తుందని తెలిపారు. చెట్టు నీడ వెలకట్టలేనిదని, చెట్లు ప్రగతికి మెట్లన్నారు. ప్రతి ఒక్కరూ చెట్టును నాటి సమాజంలో మార్పు తీసుకురావాలని కోరారు. శుభ కార్యక్రమాల్లో కేక్‌లను కట్ చేసి హంగామా సృష్టించే బదులుగా మొక్కలు వినియోగించాలని సూచించారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడే బదులు జూట్ బ్యాగులను వాడాలన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. గోల్కొండ ఆస్పత్రిలో ప్రతి రోజు 1200 నుండి 1500 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారన్నారు. ఆసుపత్రిలో కొత్త భవనం నిర్మించేందుకు రూ. 6 కోట్లు , యంత్రాల కొనుగోలు కోసం రూ.1.80 కోట్లను మంజూరు అయ్యాయన్నారు. ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు అదనంగా అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ పి. సురేష్, డిసిహెచ్ఎస్ సూర్య కుమారి, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, గోల్కొడ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు.

## 1.80 లక్షల అల్ఫాజోలం టాబ్లెట్స్ పట్టివేత..

ఇద్దరి అరెస్టు, గుజరాత్‌లో తయారీ, కాన్పూర్ నుంచి హైదరాబాద్‌కు

ప్రజాపక్షం/హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రూ.9.5 లక్షల విలువైన 1.80 లక్షల అల్ఫాజోలం (మత్తు) టాబ్లెట్స్‌లను రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టిఎఫ్ టీంలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి తెలిపారు. నాంపల్లిలోని ఆభ్కారీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఖురేషి వెల్లడించారు. హైదరాబాద్ కు చెందిన పువ్వాడ లక్ష్మణ్, పొద్దుటూరుకు చెందిన కేతుపల్లి మునిశేఖర్‌లు కాన్పూర్‌లోని అజయ్‌త్రిపాటి వద్ద నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు రూ.9.5 లక్షల విలువైన 1.80 లక్షల అల్ఫాజోలం టాబ్లెట్లను తరలించారు.ఈ మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసింకు విశ్వసనీయ సమాచారం రావడంతో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులతో పాటు ఎస్‌టిఎఫ్‌లు అప్రమత్తమయ్యాయి. బేగంపేటలోని ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి నిందితులు అల్ఫాజోలం ట్యాబెట్లను తీసుకుని తరలిస్తుండగా ఇద్దరు ఎస్‌ఐలు డ్రగ్ కంట్రోల్ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, డ్రగ్ ఇన్స్పెక్టర్లు అనిల్ రెడ్డి, గోవింద సింగర్‌తో పాటు ఎస్‌టిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ నాగరాజు, రవి శ్రీనివాస్, సందీప్ రెడ్డి,కిషన్ ఫారుకి,సిబ్బంది కలిసి హయత్ నగర్ లోని ఆటో నగర్ లో డ్రగ్స్ ఉత్తరప్రదేశ్ నుంచి కొరియర్లో రావడంతో వీరందరూ కలిసి మూకదమ్మడిగా దాడి చేసి టాబ్లెట్లను రికవర్ చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిషేధిత అల్ఫాజోలం టాబ్లెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు ఉత్తరప్రదేశ్ కాన్పూర్ నుంచి తెప్పించి చాలామందికి ఎక్కువ ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటూ లబ్ధి పొందుతున్నారని ప్రో హిబిషన్ అండ్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి పేర్కొన్నారు. కల్తీకల్లుకు, మత్తు రావడానికి వినియోగించేటువంటి అల్ఫా జోలం టాబ్లెట్లను ప్రభుత్వం గతంలో నిషేధించింది. ఈ మేరకు కొందరు వ్యక్తులు ఇలాంటి అనుమతులు లేకుండా ట్యాబెట్లను వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించి నాలుగు రూపాయలకు ఒక టాబ్లెట్ విలువ ఉన్నటువంటి టాబ్లెట్ను పది రూపాయల నుంచి 20 రూపాయలకు ఎలాంటి మందుల చిట్టి లేకుండా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకున్నట్లు ఖురేషి వెల్లడించారు. ప్రధా న నిందితుడు కాన్పూర్‌కు చెందిన అజయ్‌త్రిపాటి పరారీలో ఉన్నారు. మీడి యా సమావేశంలో రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉజ్వల రెడ్డి, రంగారెడ్డి ఎఎస్ జీవన్ కిరణ్ తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోడు భూముల రగడ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిఘటిస్తున్నారు. గత ఐదు రోజులుగా నిత్యం అధికారులు, రైతులకు మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు జరుగుతున్నాయి. అటవీ అధికారులకు, పోడు రైతులకు జరుగుతున్న ఘర్షన ఉద్రిక్తతం కాకముందే ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని రైతులకు అండగా నిలవాలని ప్రజలు కోరుతున్నారు.

**హరితహారం పేరుతో అణచివేత.. మహిళా రైతుల పోరాటం**

చింతలమానేపల్లి మండలంలోని డబ్బా, కొత్తగూడెం గ్రామ శివార్లలో రైతులు పత్తి సాగు చేస్తుండగా, అటవీ అధికారులు వారిని అడ్డుకున్నారు. దిందా, బండలేటి గ్రామ శివారు ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు వచ్చిన అధికారులను రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు పెద్ద సంఖ్యలో అడ్డుకున్నారు. తమ భూముల్లో ట్రాక్టర్లు పెడితే ప్రాణాలు అడ్డుపెడతామని హెచ్చరించారు. దీంతో చేసేదేమి లేక ఎఫ్ఎఓ సుశాంత్ సగం భూమిని సాగు చేసుకోమని, మిగిలిన సగంలో మొక్కలు నాటుతామని రైతులకు ప్రతిపాదించినా వారు నిరాకరించారు. 'మా ప్రాణమైనా పోయిన కానీ, మా భూమిని పంచుకోవడానికి వీలు లేదు!' అని రైతులు తెగేసి చెప్పారు. దీంతో అధికారులు వెనుదిరగాల్సి వచ్చింది. పెంచికల్ పేట మండలంలోని జైహింద్‌పూర్ శివారులోనూ గత మూడు రోజుల క్రితం ఇలాంటి ఘర్షణలే జరిగాయి. మంత్రులు, అధికారులు మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారే తప్ప, దశాబ్దాల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హామీలు గాలికి, అభద్రతా భావంలో రైతులు**

పోడు భూముల విషయంలో ప్రతి ఏటా ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది. ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీలు ఇస్తున్నా, అవి అమలు కావడం లేదు. 2006లో ఆర్ఓఎఫ్ఆర్. పట్టాలు పంపిణీ చేసినా, అది పూర్తిస్థాయి పరిష్కారం కాకపోవడంతో వేలాది మంది రైతులు ఇప్పటికీ అభద్రతా భావంతో జీవిస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో దాదాపు 28,500 మంది పోడు రైతులు 95 వేల ఎకరాల వరకు పోడు వ్యవసాయం చేస్తున్నారని అనధికారిక లెక్కలు చెప్తున్నాయి. బండేపల్లి బీట్‌లో 800 ఎకరాలు, దిందా బీట్‌లో 700 ఎకరాలు సాగులో ఉన్నాయి. అటవీ అధికారుల లెక్కల ప్రకారం, చాలా మంది రైతులకు పదుల సంఖ్యలో ఎకరాలు సాగులో ఉండగా ఈ భూములపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూమిని ఒక్కసారిగా లాక్కుంటే, వేలాది కుటుంబాల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుంది. ఇప్పటికైన ప్రభుత్వం పోడు భూముల సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని పోడు రైతులు వేడుకుంటున్నారు.

## ఆధిపత్యం సహేతుకం కాదు

(మొదటి పేజీ తరువాయి)

చట్టపాలన అనే భావనను ఆయన విపులీకరించారు. కోర్టులు ఆచరణాత్మకంగా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గవాయ్ ఉద్బోధించారు. అందరికీ న్యాయం జరిగేలా చూసుకోవడానికి టెక్నాలజీ ఒక మార్గంగా ఉండాలని చెప్పిన మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్ వ్యాఖ్యలను ఆయన ప్రత్యేకంగా ఉటంకించారు. 'న్యాయవ్యవస్థలో సాంకేతికత డ్రైవర్ సీటును ఆక్రమించిన మరుక్షణం నుంచి దానిపై ప్రజల విశ్వాసం దెబ్బతినడం ప్రారంభం అవుతుంది. దానితో పాటు చట్ట పాలన పునాదులపై ప్రజలకున్న విశ్వాసం కూడా దెబ్బతినడాన్ని మనం చూస్తాం' అని సిజెఐ బిఆర్.గవాయ్ వివరించారు. 'మన కోర్టుల ముందుకు వచ్చే ప్రతీ కేసు న్యాయం దక్కుతుందన్న ఆశతో రావడం జరుగుతుంది. వారి విశ్వాసానికి అనుగుణంగా న్యాయ వ్యవస్థ పరిష్కారం అందరికీ సమానంగా ఉండాలి' అని గవాయ్ చెప్పారు. ప్రజలు ఎప్పుడైతే సంప్రదాయం, ఆవిష్కరణల మూలమలుపు మధ్య నిలబడినప్పుడు న్యాయస్థానాలు చట్టపాలనకు కాపలాదారులుగా ఉండి పురాతన జ్ఞానం, భవిష్యత్ న్యాయం రెండింటికీ రూపశిల్పులుగా వ్యవహరించాలని చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com